

వికృతి
శ్రావణము-భాద్రపదము

భారతి

సంపుటము 27
సంచిక 9

గణేశస్తుతి

●

శ్రీ బులుసు వెంకటేశ్వర్లు

సకల స్థావర జంగమ ప్రథిత విశ్వంబున్ సృజింపంగఁ బూ
నిక సిద్ధింపఁగ బ్రహ్మ; తత్స్థితికినిన్ విష్ణుండు; తన్నాశకా
రకుఁ డీశుండు తదర్థమై; యెపుడు నిన్ బ్రార్థింపఁ గాపాడు నీ
యకలంకం బగు సత్కృపన్ బడయ నే నర్చింతు విఘ్నేశ్వరా![1]

ముల్లోకంబులతల్లి తల్లి యయి నిన్ మోదంబునన్ గాంచ నీ
వల్లారుముద్దుల బిడ్డవై పెరుఁగు చా యంబాఘన స్తన్యముల్
కొల్లల్ కొల్లలు గాఁగఁ గ్రోలితివి నీకున్ శక్తి లేపాటి? నీ
నల్లాపంబులె విఘ్నహాంతకము లాశ్చర్యంబు విఘ్నేశ్వరా!

ఉడివోనట్టి మహోఘపాశముల నీ వొక్కుమ్మడిం ద్రెంపఁగా
నడగొండల్ వలెఁ బైఁబడం గడఁగు విఘ్నశ్రేణిఁ బోఁద్రోలఁగాఁ
గుడుముల్ జిల్లెడుగాయలా? ప్రభువ! నీకున్ వాంఛ; భక్తాళికిన్
గడు సౌలభ్యముఁ గూర్తు నిన్గొలువ విఘ్నధ్వాంత! లంబోదరా!

---

౧. శివపురాణము; గణేశఖండము.

నీపదనీరజంబుల జనించిన పాంసులవంబె భక్తి నే
వాపరతంత్ర దేవపతి భవ్యకిరీట విరాజమానమై
యాపద లెల్లఁ బాపి త్రిదశాధిపపట్టము నిర్వహింపఁగా
నోపినదన్నఁ ద్వన్మహిమ యెుప్పున వర్ణనకున్? గజాననా! ౨

జనకునియాజ్ఞ నీవు శిరసా వహియించి యనేకరీతు లా
తని బహుకీర్తనంబులకుఁ దావలమై కృపతోడఁ గాశికా
ఘననగరంబుఁ బ్రోవఁ గలకాలము నేఁబదియాఱురూపముల్
గని యట నుండిపోతివఁటగా భువనప్రభుతన్ గణాధిపా! ౩

కలుష పిశాచ సంతతికిఁ గాలుని దండము నీదు తుండమా;
నలరులవింటివాని మద మార్చెడు బందము నీదు జందెమా;
బలుపగు విఘ్నసంతతికి బంధము సంతము నీదు దంతమా;
నెలుకపశాణి రాత! నిను నెంతయుఁ గొల్చెద మో గణాధిపా!

పరతత్త్వం బని తత్త్వవేత్తలు నినున్ భావించి కొల్వంగ; నీ
శ్వరుఁడున్ బ్రహ్మయు విష్ణువున్ గొలువ రక్షాదక్షుఁ డంచున్ నినున్;
వర విద్యా విభవాది కాంక్షులు నరుల్ ప్రార్థింప నిత్యంబు; నీ
కరుణాదృష్టిని బ్రోతు వెల్లరను భక్తప్రీతి విఘ్నేశ్వరా! ౪

కులగోత్రంబులు కేళికందుకములై క్రుంగంగ నీ చేతిసం
దుల; లీలార్థము వార్ధి యంతయు వియద్ధూత్కారముం జేయు నీ
చెలువంబుం గని పార్వతీజనని నిన్ జింతించి వారింపఁగా
నిలపై వార్నిధిఁ గ్రుమ్మరించితివి గాదే? నీవు విఘ్నేశ్వరా! ౫

గణపతిగా వినాయకునిగాఁ గపిలాంగునిగాఁగఁ బార్వతీ
తనయునిగాఁ బ్రసన్ననిఁగ దంతిముఖాత్మునిగాఁగ ఫాలచం
ద్రునిగను శూర్పకర్ణునిగ ధూమపతాకిఁగ స్కందపూర్వజ
న్మునిగను నిన్ స్మరించెదము మూషికవాహన! విఘ్ననాయకా!

నవ రాత్రిందివముల్ నినున్ జనులు విఘ్నధ్వాంత యర్చింతు రా
త్మవరంబుల్ గృపసేయు దంచు బహుపత్త్రిశ్రేణిఁ బుష్పాదులన్;
భవదీయామల సత్కథా శ్రవణులై భక్తిప్రపత్తిన్ నినున్
మిపులం గొల్చియుఁ గాంచఁజాలనిది యున్నే? దేవ! విఘ్నేశ్వరా!

౨. స్కాందపురాణము; బ్రహ్మోత్తరఖండము. ౩. స్కాందపురాణము; కాశీఖండము. ౪. శివపురాణము; కాళహస్తిమాహాత్మ్యము. ౫. పద్మపురాణము; తెలుఁగునఁగవికర్ణరసాయనము.

ఆస్థానకవి

శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు

శ్రీ పి. గణపతిశాస్త్రి

చెన్నపుర ప్రభుత్వం నియమించిన సారస్వతసంఘం ఆస్థానకవి పదవికి కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి పేరు సూచించిన దన్న వార్త ఆంధ్రదేశంలో అందరికీ ఆహ్లాదం కలిగించింది. శ్రీశాస్త్రిగారు బహుళగ్రంథరచన చేసిన దిట్టలు. అర్థశతాబ్దం పైగా అవిరళ సాహితీవ్రతం సాగించిన వాఙ్మయ దీక్షితులు. ఆంధ్ర మహాభారతం ఆమూలాగ్రంగా ఆంధ్రుల కందించిన భాగ్యమే గాక వారికి ఇంకా అసంఖ్యాకమైన గ్రంథాలు తెనుగువారి అందించిన అదృష్టంకూడా లభించింది.

ఈ ఆస్థానకవిపదవి ఇటీవలనే ఏర్పాటైనది. ఇది అనుశ్రుతంగా ఉండిఉంటే అధమపక్షం పాతిక సంవత్సరాలకు పూర్వమే ప్రభుత్వం శ్రీపాదవారి నీపదవితో గౌరవించి ఉండేది. ప్రభుత్వానికీనాడు ఆస్థానకవిని ఎన్నుకోవడం ఒకవిధంగా క్లిష్టసమస్య అయిఉండాలి. ఇప్పుడు మనకు రెండుతరాల సుప్రసిద్ధకవు లున్నారు. వాఙ్మయస్వభావాన్నిబట్టి వీరు విభిన్నలక్షణాలు కలిగిన వాఙ్మయప్రస్థానాలకు చెందినవారు. మొదటివర్గంవారు వీరేశలింగయుగానికి సంబంధించినవారు. రెండవతరంవారు నవ్యసాహిత్యోద్యమాలకు చెందిన అధునాతనులు. తిరుపతి వేంకటకవులు, శ్రీకృష్ణమూర్తిశాస్త్రిగారు వీరేశలింగయుగానికి సంబంధించిన వారే. శ్రీవిశ్వనాథ సత్యనారాయణ, కృష్ణశాస్త్రి, రాయప్రోలు సుబ్బారావు, మొదలయినవారు అధునాతనకవితోద్యమానికి సంబంధించినవారు.

మొదటితరానికి చెందిన కవులను వీరేశలింగయుగానికి సంబంధించిన వారని అనడం వాఙ్మయ విమర్శలో ఒక పరిపాటి అయింది. వీరేశలింగకవి కంటె గొప్ప కవులు, సాహితీపరులు ఆయుగంలో అనేకు లున్నారు. అయినా వాఙ్మయంలోను, జాతిలోను, వీరేశలింగకవి తీసుకువచ్చిన నవచైతన్యం వల్లనే ఆ యుగానికి ఆ పేరు కలిగింది. మన వాఙ్మయచరిత్రలో వీరేశలింగయుగం చాల విస్తృతము, పరిపుష్టము అయిన సాహితీరంగము. వైదేశిక సంస్కృతులతోను, వాఙ్మయాలతోను కలిగిన సంబంధంవల్ల మన సాహితి కొక నూతనాఘాతము, చైతన్యము కలిగాయి. ఈయుగంలో సాంప్రదాయికంగా సాగుతూవచ్చిన తెలుగువాఙ్మయం, నాటక, నవలా, కథాది, వివిధ రీతులలో వెల్లివిరియసాగింది. వీరేశలింగకవి, చిలకమర్తి లక్ష్మీనరసింహము, పానుగంటి లక్ష్మీనరసింహారావు, అప్పారావు ప్రభృతులు ఆంగ్లసాహితీ ప్రభావం ఆకళించుకొని మన వాఙ్మయంలో కొత్తపోకడలు ప్రారంభించి, వాటిలో కృతకృత్యులైనారు. గురజాడఅప్పారాయకవి నాటక కథా ఖండకావ్యాదులలో బాగా కొత్త తెన్నులు తొక్కి అధునాతనాంధ్ర కవితకు పితామహు లైనారు. శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి, దేవులపల్లి కవి సోదరులు, ఇటీవలనే కీర్తిశేషు లయిన జనమంచి శేషాద్రిశర్మ ప్రభృతులు ఎక్కువగా సంప్రదాయ ఫణితిలో కావ్యరచన సాగించి వాఙ్మయపోషకు లైనారు.

ఏ వాఙ్మయయుగంలోనైనా సంప్రదాయ మార్గము, నవ్యతామార్గము కనిపిస్తూంటాయి.

ఈనవ్యతామార్గం క్రమంగా ప్రస్ఫుటమై కొత్త

వాఙ్మయరంగాన్ని సృష్టిస్తూఉంటుంది. వీరేశలింగ యుగంలో కూడా ఈ రెండుమార్గాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఈ యుగంలో ప్రముఖులయిన గురుజాడ అప్పారావు, పానుగంటి లక్ష్మీనరసింహారావు, చిలకమర్తిలక్ష్మీనరసింహము, తిరుపతి వేంకటకవులు, వీరేశలింగము మొదలయినవారు ఈయుగంలోని నవ్యతామార్గాన్నెక్కువగా వెలయింపజేశారు.

కేవల సాంప్రదాయికమార్గం అవలంబించినవారిలో శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు ప్రముఖులు. వీరు నాటకాలు స్వతంత్రకావ్యాలు, గద్య రచనలు మొదలైనవి విరివిగా చేసినవారే అయినా వీటిలో సంప్రదాయమార్గమే విస్పష్టంగా కనిపిస్తుంది. వీరి రచనలు ఆ తరువాతి తరంవారిని కొత్త త్రెన్నులు తొక్కించాయని చెప్పడానికి వీలు లేదు. తిరుపతి వేంకటకవులు ఆరోజుల్లో రాజాస్థానాల్లోనే నిలిచిపోయిన కవితను తమ అవధానప్రవాహంలో ప్రజాపదస్సులలో ప్రవేశపెట్టారు. శ్రీశాస్త్రిగారు ఆమార్గం అవలంబించక తమ కవితకు సంప్రదాయంగా వచ్చే ఆస్థానాలనే ఆటపట్టులుగా చేశారు.

మన వాఙ్మయంలోని వీరేశలింగయుగానికీ ఆంగ్లవాఙ్మయంలోని పోప్, డ్రైడనుల యుగానికీ ఎన్నో దగ్గిరపోలిక లున్నాయి. ఆంగ్లవాఙ్మయంలో పోప్ డ్రైడనులయుగం తరవాతనే కాల్పనికోద్యమం (Romanticism) ప్రాదుర్భవించింది. మన అధునాతన ఆంధ్రవాఙ్మయంలో కూడా ఈ పరిణామమే కనబడింది. ఆయా దేశకాలభేదాలను బట్టి ఉభయ వాఙ్మయాలలోను ఈ ఉద్యమాలు ఆకారంలో కొన్ని భిన్నరూపాలు ధరించిఉండవచ్చును. కాని ఈరెండు యుగాలలోను ఉదయించిన కవుల కవితాదృక్పథంలో చాలా దగ్గిర పోలిక లున్నాయి. కాని కాల పరిస్థితిని బట్టి కొన్ని భేదాలు కూడా ఏర్పడ్డాయి

వీరేశలింగయుగంలోని కవితావాఙ్మయం అంతా పరిశీలిస్తే దీనిలో సంస్కృతపురాణేతిహాసాలకు అనుసరణ లయిన కవితారచనలే విరివిగా కనిపిస్తాయి. ఈరచనలతో పోలిస్తే కేవలం కవుల స్వీయోపజ్ఞా రచితమైన కవిత చాలా తక్కువ. కొత్తగా ప్రారంభింపబడిన నాటకాది వాఙ్మయశాఖలలో మాత్రం కొన్ని స్వతంత్రరచనలు బయలుదేరాయి.

శ్రీశాస్త్రిగారి కవితావాహిని ఎక్కువగా సంప్రదాయమార్గానికి చెందిన దని అనుకున్నాము. రూపకాలు మొదలుగ వివిధవాఙ్మయశాఖలలో అసంఖ్యాకరచనలు సాగించినా ఎక్కువగా కవిగనే వారికీర్తి సుప్రతిష్ఠిత మైనది. రామాయణము, గణేశ పురాణము మొదలయిన ఉద్గ్రంథాలనుకూడా వారు అనువాదరూపంలో తెలుగువారి కందిచ్చారు. అయినా భారతరచన వారి సుస్థిరకీర్తిపతాకం కాగల దని చెప్పవచ్చును.

తెలుగుజాతికీ, భారతానికీ చాలా సన్నిహితమైన ఆత్మీయసంబంధం ఉన్నది. అసలు భారతావతరణంతోనే తెలుగుకవిత సర్వాంగసుందర మయింది. తెలుగుభారతకవులే మనకు ఆద్యు లయిన ప్రామాణికకవు.లయినారు. వీరు ముగ్గురు మహాకవులు కావడం మన కవితాచరిత్రలో ఒక ప్రత్యేకత. రాజరాజనరేంద్రునికి భారతకథ లెంత విన్నా తనివి తీరలేదు. అసలీ తనివి తీరకపోవడం ఆంధ్రజాతిలోనే ఉండి, భారతావతరణకు కారణమయిం దని తోస్తుంది. మనకు భారతంపై కలిగిన ప్రేమాదరాలే ఔత్తరాహులకు రామాయణగాథపై కలిగా యని అంటారు. కనకనే వారి తులసీదాసరామాయణం ఔత్తరాహుల ఆత్మప్రతిబింబ మయిన మహాకావ్యంగా అవతరించింది. దాక్షిణాత్యులు మేధాప్రధాను లనీ, ఔత్తరాహులు భావ (Emotion) ప్రధానులనీ అనడం ఒక పరిపాటి. ఏది ఏమయినా ఆంధ్రజాతికీ భారతగాథకూ చాలా సన్నిహితసంబంధం ఉన్నది.

శ్రీ అరవిందులు కాళిదాసవిమర్శలో ఒకచోట వ్రాస్తూ వాల్మీకి వ్యాస కాళిదాసులు ముగ్గురు మూడువిధాలుగా పరిణమించిన భారతీయకవితాత్మకు అవతారస్వరూపు లనీ, వీరిలో వ్యాసమహర్షిలో మేధ మూర్తీభవించిన దనీ అన్నారు. భావమేధల సమన్వయమే ఎక్కువగా ఉన్నా మనజాతి మన స్తత్త్వం మేధవైపే ముఖం చూపుతున్న దని అనవచ్చును.

ఆంధ్రులకు భారతంపైగల సహజాదరమే శ్రీశాస్త్రిగారిని భారతరచనకు ప్రోత్సహించిన దని నా విశ్వాసము. మన కింతకుపూర్వం రామాయణా లనేకం వెలిశాయి. అయినా నూతనరామాయణరచన లనేకం బయులుదేరుతూనే ఉన్నాయి. దీనికి పూర్వ పూర్వ రచనలయెడల అసంతృప్తిగాని, రామకథపై గల భక్తిభావంగాని కారణం కావచ్చును. తెలుగు భారతంతరవాత ఉద్భవించిన మహాకవు లెవరూ మళ్లీ దీనిజోలికి పోలేదు. మళ్లీ భారతరచన సాగించిన వారికి భారతకవులతో తారతమ్యపరీక్ష జరుగుతుంది. మహాకవులతో తులతూగజాల మనే భయంవల్లనే చాలామంది కవు లీవిషయంలో ఉపేక్ష వహించి ఉండవచ్చును. భారతమూలార్థం వివరించడానికే తా మీ రచనకు పూనుకొన్నా మనీ, భారతకవులతో తులతూగడానికి తామీ రచన కుపక్రమించలేదనీ శ్రీ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు సప్రశ్రయంగా భారతపీఠికలో వ్రాశారు.

మన భారతకవులు తమ కవితలో స్వీయోపజ్ఞకే ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చారు. మూలభారతం వారికి ఒక పట్టుగొమ్మ మాత్రమే. కేవలం యథామూలంగా భారతం పఠించదలుచుకొన్న తెలుగుపాఠకులకు కవిత్రయభారతంవల్ల సంతృప్తి కలగదు. ఉదాహరణకు అరణ్యపర్వం తీసుకుందాము. సంస్కృతభారతంలో అరణ్యపర్వంలో ౧౧౬౬౪ శ్లోకా లున్నాయి. దీనికి మన పూర్వభారతంలో ౩౯౦౦ పద్యాలు మాత్రమే ఉన్నాయి. శ్రీ కృష్ణ భారతారణ్యపర్వంలో ౪౩౬౬ పద్యా లున్నాయి. దీనినిబట్టి శ్రీ కృష్ణభారతపు యథామాతృకత గ్రహింపవచ్చును. శ్రీకృష్ణమూర్తి శాస్త్రిగారు యథామూలంగా ఉండా లని కేవలం మక్కీకి మక్కీగా అనువాదం సాగించలేదు. శ్రీరామ చరిత్రము, శిబిచరిత్రము మొదలయినవి మూలంలో రెండుమూడు సారులు వస్తాయి. అల్లాంటిపట్ల మాత్రమే శ్రీ శాస్త్రిగారు స్వాతంత్ర్యం వహించి ఒకసారి మాత్రమే తెలుగులో ఆ కథాభాగం వచ్చేటట్లు చేశారు.

కవిత్రయ భారతానికీ, శ్రీకృష్ణ భారతానికీ మరిఒక భేదం ఉన్నది. భారతకవుల రచనలో ప్రత్యేకమైన శైలీ భేదం కనిపిస్తుంది. అందులోను నన్నయతిక్కనల శైలిలోను, దృక్పథంలోను చాలా ప్రత్యేకతలు గోచరిస్తాయి. ఒకే చెయ్యివిగాదుగా శ్రీకృష్ణభారతరచన సాగడంవల్ల అంతా ఒకే పోతలో పోసినట్లు సుఖంగా నడిచిపోతుంది.

శాస్త్రిగారి భారతశైలి ఒకేకవితాధాటిలో నడిచిపోతుంది. పరిశ్రీకృష్ణ వారిరచనలో ఎక్కడా కనబడదు. కవిత ఎక్కువగా వైదుష్యప్రధానమయినది. దూరాన్వయాలు గాని, క్లిష్టాన్వయాలు గాని, నిఘంటుమాత్రశరణాలయిన పదాలు గాని సామాన్యంగా కనబడవు. మహాభారతేతిహాసరచనకు ఇలాంటి రచన చాలా అనుకూలమయినది. ఈ క్రింది ఉదాహరణలవల్ల శ్రీకృష్ణ భారత రచనావిశేషాలు గ్రహింపవచ్చును.

"క్రోధవాన్ కిన్నిమిత్తం వా వానరం వపు రాశ్రితః
బ్రాహ్మణానంతరో వర్ణః క్షత్రియస్త్వాం తు పృచ్ఛతి."
"కౌరవః సోమవంశీయః కుంత్యా గర్భేణ ధారితః
పాండవో వాయుతనయో భీమసేన ఇతి శ్రుతః
స వాక్యం కురువీరస్యస్మి తేన పరిగృహ్య తత్"

సంస్కృతభారతము

ఈ వెవ రీప్లవంగతను
వేటికిదాల్చితి క్షత్రియుండ నే
నా వర కౌరవాన్వయము
నందు బృథాపతికిన్ సదాగతి
శ్రీవలనం జనించితి ధ
రిత్రి గపీంద్ర! వృకోదరాఖ్యను
దావలపైతి నావుడును
నవ్వుచు నవ్వనచారి యిట్లనన్"

శ్రీకృష్ణభారతము

"క్షత్రియప్రవరుండ విఖ్యాతబలుఁడ
పాండుతనయుండఁ గుంతిగర్భంబునందు
వాయువరమున బుట్టినవాఁడ నన్ను
భీము డండ్రు భూజనులు కపిప్రభుండ."

నన్నయభారతము

శ్రీ శాస్త్రిగారికి శ్రీనాథ రామరాజభూషణుల కవితపై ప్రత్యేకాధారం ఉన్నదని వినికిడి. పరమేశ్వరసాక్షాత్కారవర్ణనాపరమైన ఈ క్రిందిసీసంవల్ల వారి సీసరచనా శిల్పం గ్రహింపవచ్చును.

"మేలైన మగఱాల డాలు డీలింపజాలు
మేనితో పామేని పానితోడ
వెన్నెల వెదజల్లు క్రొన్నెలసికవల్లు
పువ్వుతో మవ్వంపు నవ్వుతోడ
నల్లని దల నల్లకల్లోలమౌ తెల్ల
వాకతో హత్తితోల్ కోకతోడ
చెవపల్కు లాల్లని చెవకొల్కు గల్లు
చూపుతో దొరకలేని రూపుతోడ
నిటల తటముల నంజలిపుటి ఘటించు
వరపితామహ శక్రాది సురలతోడ
నెమ్మి సేవించు ప్రమథగణమ్ముతోడ
నెదుట సాక్షాత్కరించె నుమేశ్వరుండు."

ఈక్రింది శ్రీకృష్ణభారత సీసపద్యం నన్నయ సీసపద్యంతో పోల్పదగి ఉన్నది.

"మణివినిర్మిత సభామధ్యరత్నమయాస
నాసీనున కదో! కుశాసనంబు,
హరాన్వితాంతికోన్నత హంసగరుత్తూలి
కాశయుడవు కదో! తృణశయనము
చందనాగరు దిగ్ధ సర్వాంగసుందర
మూర్తి కదో! నేల బూదిపూత
స్వచ్ఛదుకూల వస్త్రాచ్ఛాదితుఁడ కదో!
తరువల్కలాజిన ధారణంబు
కలిగి మృగములు తోడుగా గాననాంత
రముల దుంపలు దూడు లన్నముగ నుదర
పోషణము చేసికొనుచున్న పురుషు నిన్ను
జూచి నా చిత్తమున శాంతి వీడె నయ్యో!"

శ్రీకృష్ణభారతము

"విమల హర్మ్యంబుల విహరించువారల,
ప్రభు మహార్హాసన శయనరతుల
చందనాగరు లిప్త చారు సర్వాంగుల
నతి నరనాథ సేవితుల, మిమ్ము
వనమున గ్రుమ్మరువారిగా, కుశబృసీ
శయనాభిరతుల గా, నియతిరూక్ష
భూరేణు ధూసరీభూత విగ్రహులగా,
శ్రుతివన్యమృగనిషేవితుల గాఁగ,
నిట్లు చూచి చూచి, యే నెట్లు చిత్తోప
శాంతి సేయుదాన, సకలభోగ
విషయనిరతి జేసి విధియును, ధృతరాష్ట్రు
నట్లు మీకు నహితుఁ డయ్యె నొక్కొ!"

నన్నయ అరణ్యపర్వము

ఈ క్రింది ఉత్పలమాలికకూడా నన్నయరచితమైన ఉత్పలమాలికతో సంపోల్పదగినది.

"ఆ మహనీయమూర్తి ప్రణ
యంబున నన్ను గవుంగిలించి నా
మోమున మోము జేర్చి శిర
మంజిలుకంబును బట్టి మోవితో
గోమలశబ్దముల్ పలికె
గొంచెమురే నది పెంచె హర్ష మే
మేమని చెప్పవాఁడ! నత
డే హృదయేశుఁ డటంచు నెంచెదన్"

శ్రీకృష్ణభారతము

"నన్నును గౌగిలించుకొని,
నా వదనంబునందు నిజాస్యమా
సన్నము చేసియొక్క మృదు
శబ్దము సేసి మనోహరంబుగా
నెన్నడు నట్టి శబ్దము మ
హీశ్వర! మున్ విని యెఱుంగ న
య్యున్నతబ్రహ్మచారి ముఖ మంబు
రుహంబుసమంబు చూడఁగన్"

నన్నయ అరణ్యపర్వము

పార్వతి యెరుకలసాని అయిన సందర్భం వర్ణించే ఈక్రింది శ్రీకృష్ణభారతసీసము స్వభావోక్తి రమణీయము.

"కేలి పేలికలు పట్టీలుగా వేసి కు
ట్టినబొంత మొలచుట్టు దనర జుట్టి

మోచేతులను దాక బోలుపగు నద్దాల
రతపని గల డొల్ల రవిక దొడిగి,
నులివెట్టు వెమిలికన్నుల నెలుల్ చవరాలు
మెడలపై బడ జారుముడిని వైచి
కాళ్ళ జేతుల గల్లు గల్లుమంచును మ్రోయు
నిత్తడివగ లెన్ని యేని బెట్టి,
పూసపేరులు మెడనిండ బొందుపఱచి,
గవ్వపురి: తాడు నిలువెల్ల గలయజుట్టి
లీలపై నేల నొక కుంచె గ్రాలగట్టి,
చలిమలకుమారి యెరుకలసాని యయ్యె.

భారతంవంటి ఇతిహాసంలో మూలంలోనే రసవత్తరఘట్టాలు, కేవలం ధర్మాధర్మోపదేశపరమైన అతిసామాన్యఘట్టాలు ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు అనేకమైనవి విరివిగా ఉంటాయి. వీటిని తెలుగుభాషలో అనుసరించేటప్పుడు, ఎక్కువ వైవిధ్యం కలిగిన రచనాశిల్పం అవలంబించాలి. కవిత్రయంవారిలో ఈ శిల్పదృష్టి విశేషంగా కనిపిస్తుంది. శాస్త్రిగారి రచనలో ఈ శిల్పదృష్టి తక్కువ.

"ఇక్ష్వాకుతనయుడై యొసగె శశాదుండు
తత్పుత్రుడు కకుత్స్థ ధరణినాథు
డతని కనేకసుం డాత్మజుం డతనికి
బృథుఁడు, వాని సుతుడు విష్వగశ్వు
డాతని కుదయించె నద్రి వానికి యువ
నాశ్వు డాతనికి శ్రావాహ్వయుండు"

అని ఈ సీసపద్యం ఇలాగే నడిచి పోతుంది. ఇల్లాంటి పట్టుల పేర్ల జాబితాలతో సీసం నడిపించడం కంటె వచనం వ్రాయడమే బాగుంటుంది. ఇంకా ఇల్లాగే అక్కడక్కడ కొన్ని ఉదాహరణలు చూపించవచ్చును.

శాస్త్రిగారి రచన వైదుష్యప్రధాన మయిన దని అనుకున్నాము. మూలం యథాతథంగా తెలుగు పాఠకుల కందించడంలో వీరు పడిన శ్రమ, అవలంబించిన దీక్ష మహాశ్చర్యం కలిగిస్తాయి. కవిత్రయం వారు ఇంచుమించుగా మూడువందల ఏళ్ళదాకా సాధించలేని మహాభారతం ఎన్నో కష్టాల కోర్చి అచంచల దీక్షతో సాధించిన మాన్యమూర్తులు శ్రీ శాస్త్రిగారు. అసలు ఆయుగం కవులలో అందరిలో గొప్ప రచనాదీక్ష, పరిశ్రమ కనబడతాయి. వారందరికంటె శాస్త్రిగారి పరిశ్రమ, దీక్ష మహత్తరమైనవి.

శాస్త్రిగారు కడటివరకు సారస్వతవ్యాసంగమే ప్రధానంగా అవలంబించి, జీవించిన ధీరచారిత్రులు. నేటి సంఘంలో కేవలం సారస్వతంతో స్వతంత్రజీవిక గడపడం దుష్కరము. శాస్త్రిగారివలె స్వతంత్రంగా సారస్వతవ్యాసంగం చేసినవారు చాలా తక్కువగా ఉన్నారు.

శేన్నాడ్డహా అన్నట్లు అభిమానవిద్యతో జీవిక గడపగలిగిన వ్యక్తులు చాలా అదృష్టవంతులు. శ్రీ శాస్త్రిగారు ఎన్ని కష్టాలు వచ్చినా లెక్కపెట్టక దిన దినము అవిరళంగా సారస్వతోపాసన కావించి, ఆంధ్రవాఙ్మయానికి అన్ని విధాలా మేలుకానుక లర్పించిన కవీశ్వరులు.

జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః

ఆహ్వానము

శ్రీ బెహ్హారి శ్రీనివాసమూర్తి.

ఓ మహాత్మా రమ్మా
ఉర్వరకు దిగి రమ్మా—
స్వాతంత్ర్య దిన మహోత్సవ లీల దిలకింప,
స్వాంత తావక హృదయపుష్పమ్ము పులకింప,
సాధుపుంగవ, రమ్మా
సత్వరమ యేతెమ్మా—
మూడేండ్ల వయసులో ముద్దుబిడ్డను జూడ,
పాడి పొ మ్మొకక జోలపాట హర్షముతోడ,
కర్మయోగీ, రమ్మా
కర్మభూమికి రమ్మా—
భారతాభ్యుదయ సంభ్రమములో పాల్గొంగ
కారుణ్యమయగీతికావీధి మేల్కొందు,
బాపుజీ చనుదెమ్మా
ప్రజలకోసము రమ్మా—
స్వాతంత్ర్య కేతనజ్యోతి నాలోకింప
గీతారహస్య సంగీతమ్ము బోధింప,
ఓ మహాత్మా, రమ్మా
ఉర్వరకు దిగిరమ్మా—

———

చిన్న నవల :

వింధ్యాచలం

శ్రీ అడవి బాపిరాజు

ప్ర థ మ భా గం

౧

నాకిది ఎన్నోసారో వింధ్యాచలం దాటి ఉత్తరాదికి వెళ్లటం! నేను అగస్త్యుణ్ణిమాత్రం కాను! అగస్త్యుడే పుట్టక పోయి ఉంటే ఆంధ్రులు దక్షిణానికి వలస వచ్చి కృష్ణాగోదావరీమధ్యస్థభూమిలో ఏలా వలస యేర్పరచుకొని వుందురు?

హిమాలయపర్వతంకన్న మేరువుపర్వతం కన్న పైకెగసి ధ్రువపథం దాటి సూర్యపథం దాటి సూర్యదేవకతుకు అడ్డంగా పెరిగి సగర్వంగా నిలుచున్నాడుట వింధ్యపర్వతేశ్వరుడు. ప్రతిసంవత్సరం దక్షిణాయనంలో యవద్వీపప్రాంతాకాశపథాల సంచరించే సూర్యదేవుడుగారు ఆ ఏడు మళ్లీ ఉత్తరాకాశపథాల సంచరించటానికి వస్తూంటే ఈ వింధ్యాచలంగారు అడ్డం వచ్చారు. దక్షిణానికి ఒకటే రోహిణీకార్తి అవతరించింది. ఉత్తరభారతవర్షానికి ఒకటే మంచుమయమైన చీకటి. అప్పుడు ఈ దేశభక్తుడైన అగస్త్యఋషిగారిని దేవతలంతా రక్షించవలసిందని ప్రార్థించారుట. అగస్త్యమహర్షిగారు దక్షిణాపథయాత్ర సంకల్పించి బయలుదేరారు. వింధ్యాచలంగారు ఆయనకు భక్తితో గురుపాద నమస్కారం చెయ్యటానికి సాష్టాంగభూతుడైనాడు. "నేను తిరిగి వచ్చేవరకూ ఇలాగే వుండు నాయనా" అని ఆ దివ్యఋషి దక్షిణానికి వెళ్లినాడుట. వింధ్యంగారు అలాగే వున్నారుట.

ఇక నేను ఉత్తరాదికి వస్తూంటే పొరపాటున ఈ వింధ్యధరాధరేంద్రుడు మా బండిలోంచి తొంగి చూస్తోన్న నన్ను చూచి వీడే ఒక అభినవఅగస్త్యుడనుకొని, అగస్త్యులవారు తిరిగి ఉత్తరానికి వెళ్లిపోతున్నారు. ఇంక మనం ఒకనాడాక్రమించిన మహోన్నతోన్నతోన్నతోన్నత్యగగన పథాలను ఉప్పొంగిపోదామని విజృంభించాడా, ఇంక ఉత్తర భారతదేశంలో జరిగే అల్లరి వర్ణనాతీతమై చక్కాపోతుంది. ద్రావిడకైరకసగంవాళ్లు వింధ్యపర్వతంతో కుట్రచేసి, ఆ వింధ్యపర్వతంగారికి ప్రోత్సాహమిచ్చి "నువ్వు నిక్కమైన తమిళుడవోయి వింధ్యన్నా! హిమపర్వతంగారు వట్టి శుద్ధమైన ఆర్యుడు, భారత ప్రధాని నెహ్రూగారు హిమాలయపర్వత మధ్యస్థభూమి అయిన కాశ్మీరములోంచి వచ్చిన నిఖారసుడైన ఆర్యబ్రాహ్మణుడు కాబట్టి నువ్వు మన ద్రావిడసంస్కారముయొక్క మహోన్నతోన్నత తత్వము కళ్మలం కాకుండా ఆకాశానికి ఎగిరి అడ్డంగా నిలువు", అని రామస్వామినాయకరు ఈ వింధ్యమహాగిరికి బోధించివుంటారని ఏ హిందూస్థానీ టైమ్సు వ్రాయవచ్చును.

అది కాదంటారా కొంప మునిచి, ఈ కుట్ర అంతా ఆంధ్రుల నెత్తిమీద పడవేసే సావకాశాలు వున్నాయి. ఏ ఉత్తరాది కాంగ్రెసునాయకుల్లో

ప్రతిశావిశేఖరులు సందర్శించి "ఈ వింధ్యపర్వతము ఇలా పైకి పాకిపోవడానికి కారణం ఏమిటండీ!" అని కారణం అడిగారనుకోండి. అప్పుడా ఉత్తరాది నాయకుడు ఇలా చెప్పి తీరుతాడు. "ఈ మధ్య భారత్ నివేదిక కొందండీ వచ్చింది! తత్ నివేదిక ఆంధ్రుల నందరినీ రోషానల సంతప్తహృదయాంతరంగుల చేసిపారవేయడం చేత, ఏ సాంబమూర్తిగారో ఈ వింధ్యపర్వతంగారికి ప్రోత్సాహ మిచ్చియుండవచ్చును. దానితో పట్టపగ్గాలు లేకుండా ఈ అచలంగారు-చలంగారో—ఆకాశంలోకి చొచ్చుకుపోయి ఉండాలి." అని ఉద్ఘాటించి తీరుతాడు. ఇంకేముంది కొంపలు మునిగిపోతాయి. ఈలాంటి ఆలోచనలు ఆ వింధ్యపర్వతపులోయలో మహావేగంతో పోయే కలకత్తా మెయిలులో కూర్చున్న నాకు వచ్చినమాట సత్యం. జబ్బల్‌పూరు దాటినాము. నర్మదానదము దాటినాము. మా రైలు సిహోరీ రోడ్డు స్టేషన్ దాటినది. ఒక్కొక్క స్టేషన్ మా రైలు సమీపించింది. అనగానే నా హృదయం మింటికెగసి లోతులకు పోతూ ఉంటుంది. నర్మద దాటేటప్పుడు పాలరాతికొండలు మాహిష్మతీనగరం జ్ఞాపకం వచ్చినవి. అటు ఢిల్లీవెళ్ళే దారిలో సాంచీస్తూపము జ్ఞప్తికి వచ్చింది. ఆ దారిని ఢిల్లీ వెళ్లివుంటే అవన్నీ చూచివుండేవాణ్ణే! ఉజ్జయినీ ఆ పక్కనే వుంది. ఉదయనుడు, విక్రమార్కుడు, కాళిదాసు ఉజ్జయనీభావసంబంధాలు; ఇక్కడనుంచి ఉత్తరభారతభూమి పూర్ణరూపంతో ప్రత్యక్షమౌతుంది. ఆ ఉత్తరభారతభూమత పోలికలన్నీ పుణికి పుచ్చుకున్న ఆమెఅనుకుబిడ్డ, ఒక బాల, కాట్నీ స్టేషన్‌లో మా సెకండ్ క్లాస్ పెట్టె ఎక్కింది.

౨

ఆ అమ్మాయివెనకే, ఈ నాటి ఈక్షణం ఫేషన్‌లోవున్న అతినవీన దుస్తులతో పెట్టె ఎక్కాడు ఓ యువకుడు. నేను ప్రయాణం చేస్తున్న పెట్టె, నాటి ఇంటరుతరగతి, ఈనాటి తరగతి రెండు. పెట్టంతా పూర్తిగా నిండి వున్నారు ప్రయాణీకులు. అది శీతాకాలంకాబట్టి సరిపోయింది. గడచిన రాత్రి అంతమంది ఉన్నా కూచున్నవాళ్ళు కూచున్నట్టూ, వరిగినవాడు వరిగినట్టుగానూ కాలంగడిపినాము! అదృష్టవంతుడు పైన పక్క వేసుకొన్నాడు.

రెండుబెంచీలమధ్యనూ, గేట్లదగ్గరనూ, ఎల్లా పడితే, అల్లా నిదురపోయాము తక్కిన వాళ్లం. ఉత్తరానికి వెళ్ళిన కొలదీ జనం ఎక్కువవుతూ వున్నారు. నేను సంస్కారమూ, స్త్రీభక్తి కల వాణ్ణి కాబట్టి సౌందర్యపు పోగైన ఆ అమ్మాయి కాట్నీ జంక్షన్ స్టేషన్‌లో మా పెట్టెలోకి ఎక్కగానే ఎత్తు మడమల జోడుతోనూ, అతి నవీనమైన చీరకట్టువిధానముతోనూ ప్రత్యక్షమగుట చేత ఆమె కాలేజీలో చదువుకున్న బాలిక యని నిర్ధారణ చేసుకున్నవాడనై చటుక్కున లేచి, ఆమె ఇటూ అటూ చూస్తూ ఎక్కడ కూర్చుందామా అని ఆలోచిస్తున్న సమయంలో "మీ రిక్కడ కూర్చోవచ్చునండీ" అని ఇంగ్లీషుభాషలో ఆమెను కోరినాను. "కృతజ్ఞురాలను" అని ఇంగ్లీషులో అంటూ నాల్గు చిరునవ్వులు నాపై విలాసంగా విసరివైచి, నాస్థలంలో ఆమె కూర్చున్నది. ఆమెవెనకాలే వచ్చిన యువకుడు ఆమెప్రక్కనే చటుక్కున సర్దుకు కూర్చున్నాడు.

నాకు వళ్ళు మండిపోయింది. నేను కూర్చుందామనుకొన్న స్థలం కాదా అది? నేను లేచి హాయిగా వున్న నా స్థలం ఆమె కిస్తే ఈయనగారెవరూ నాస్థలం ఆక్రమించడానికి?

నేను ఆక్రిందటిరోజు సాయంత్రమే ఇటార్సీలో గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లో దిగాను. నర్మదానదిని చూచినట్లుంటుంది, జబ్బల్‌పూరునగరాన్ని రైల్లోంచి దర్శించవచ్చును అని మరునాడు కలకత్తా మెయిల్ వచ్చేవరకూ ఉండి పదకొండుగంటలను ఏలాగో పంచి తెలివితేటలు చూపించి ఆ బండిలో చేరాను. కాట్నీ వచ్చేటప్పటికి సాయంకాలం అయిదున్నర అయింది. ఇంకా అయిదు గంటలు ఈ బండిలో వుండాలి. ఇన్ని గంటలూ ఆ అమ్మాయికీ ఆ అబ్బాయికీ నాస్థలం ఇచ్చేసుకుని నుంచోవలసిందేనా అని మరీ బాధ ఎక్కువైంది. ఒక నిట్టూర్పు విడిచి అలాగే

నుంచున్నాను. పైగా నుంచోటానికి కారణం నా చుట్టుప్రక్కల వున్న బెంగాలీవారికీ, యు. పి. వాళ్ళకూ ఇంకో రకంగా స్ఫురించకుండా వుండాలని ఇంగ్లీషులో, "ఎంతసేపని కూచోగలం కాళ్ళు సుదులు పెడితే, ఓ అరగంటైనా నిలుచుంటేగాని మళ్ళీ రక్తం ప్రవించదు" అని పైకి అన్నాను. నాకూ గౌరవము దక్కింది. కానీ నేను అరగంటా నిల్చుంటానని గంట న్నర నిలుచున్నాను తలుపుదగ్గరే. పరుగెత్తే ప్రకృతి దృశ్యం గమనిస్తూ. ఆ అమ్మాయి పక్కన కూర్చున్న యువకుడు మే మిద్దరం ఎంతోకాలంనుంచి స్నేహితుల మైనట్లూ, నే నేదో గౌరవంచేసుకోటానికని లేచి నిలుచుండినట్లు భావించాడు కాబోలు, నాతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడటం ప్రారంభించాడు.

యువకుడు : మీరు బొంబాయినుంచి వస్తు న్నారా?

నేను : కాదు, బెజవాడనుంచి గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చి నిన్నల్లా ఇటార్సీలో కాలం వెళ్ళబుచ్చి ఇవాళ ఈ కలకత్తా మెయిలు ఎక్కాను.

యువతి : మీరు ఆంధ్రులా అండీ?

నేను : ఔనండీ, మీరు బెంగాలీవాళ్ళలా లేరే?

యువతి : మేము యు. పి. వాళ్లము. మాది అలహాబాదు.

నేను : నేనూ అలహాబాదు వెడుతున్నాను.

యువతి : మేమూ అలహాబాదే వెడుతున్నాము. ఇక్కడ కాట్నీలో మా యింటికి వచ్చి ఈ శెలవులు గడిపి అలహాబాదు వెడుతున్నాము.

నేను : మీరు అక్కడ ఉద్యోగమా అండీ? (యువకుణ్ణి ప్రశ్నించాను.)

యువకుడు : ఔను! కలెక్టరేటులో అసిస్టెంటు కలక్టరుగా పనిచేస్తున్నానులెండి. ఈవిడగారు మిసెస్ సుప్రియా త్రిపాఠీ. నేను సుప్రియా త్రిపాఠిని లెండి. మాది కాట్నీ నగరం. మీ రెందుకు వస్తున్నారు అలహాబాదు? మీ పేరు తెలుసుకోవచ్చునా?

నేను: అ తప్పకుండా! నా పేరు ఎం. చతుర్వేది. ఆంధ్రంలో చతుర్వేదుల మల్లికార్జున శాస్త్రి. నేను ఆంధ్రాయూనివర్సిటీలో యం. యస్. సి. మొదటిగా కృతార్థుడనయ్యాను. అలహాబాదు యూనివర్సిటీవారు డి. యస్. సి. పరిశోధనకు స్కాలర్‌షిప్పుతో సీటు ఇచ్చినారు. అది పూర్తి కావచ్చినది. ఇది ఆఖరు సంవత్సరం. శీతాకాలంశెలవులకు ఇంటికి పోయి ఇప్పుడు వస్తున్నాను.

యువతి : మీరు చతుర్వేదులా? మా నాన్నగారి ఇంటిపేరు త్రివేది వారు. హైకోర్టులో మా నాన్నగారు ఎడ్వకేటుగా వున్నారు. ఈ పెద్దమనిషిగారు అలహాబాదులోనే అయిందికదా ఉద్యోగమని అత్తవారింట్లోనే మకాం పెట్టారు లెండి.

యువకుడు : అయితే, చతుర్వేదిగారూ అసలు నేను అలహాబాదు వేయించుకోవటానికి కారణం ఏమిటో ఆవిణ్ణి అడగండి.

యువతి : నా పేరు జ్యోతిర్మయి లెండి. అందుకనే వెలుగును గురించిన రహస్యాలన్నీ తెలుసుకుందామని అలహాబాదుయూనివర్సిటీ బి. యస్. సి. ఆనర్సు ఫిజిక్స్‌లో చేరాను. తానేమో నా చదువు పాడుచేయకూడదని, అలహాబాదులోనే వేయించుకున్నారుట ఉద్యోగం. ఈయనగారు 1945 సంవత్సరంలో తయ్యారై వచ్చిన ఐ. సి. యస్. లెండి.

నేను : త్రివేదులూ, త్రిపాఠులూ, చతుర్వేదులూ! బాగానే వుంది మన స్నేహం.

3

ఇంతట్లో "కాట్నా" పట్నం వచ్చింది. నా అదృష్టంకొద్దీ జ్యోతిర్మయిపక్కనే కూర్చున్న ఒక ముసలాయన, ముసలావిడ లేచి రైలుదిగి వెళ్లిపోయినారు. వాళ్లు లేచి వెళ్లడమేమి, నేను గబుక్కున వారి స్థానంలో కూర్చోటమేమిటి, మేము ముగ్గురం చక్కగా, హాయిగా సర్దుకు కూర్చున్నాము.

మాకు ముగ్గురకూ సంతోషం కలిగింది.

"మీరు మాకు ఏవిధంగానైనా చుట్టాలు కారు

కదా ?" అని జ్యోతిర్మయి పకపకా నవ్వుతూ నా వైపు తిరిగింది.

"ఆంధ్రులు ఆరు వేల సంవత్సరాల క్రితం మన దేశం నుంచి కదలి కృష్ణా గోదావరీ దేశానికి వలస వెళ్లిన వారేగా ?" అని ఆ యువకుడు సుప్రియు డన్నాడు.

ఉత్తరాదివాళ్లూ, దక్షిణాదివాళ్లూ ఇలా రైల్లో స్నేహం కుదరటం విచిత్రంగానే ఉంది. వాళ్లు గంగానదివాళ్లు, నేను గోదావరినదివాణ్ణి. గోదావరి, గంగానది పూర్వావతారము. గోదావరి ప్రాచీనజన్మ అట. త్ర్యంబకేశ్వరుడే గంగోత్రికడ, జటామకుటేశ్వరు డయ్యాడట. అలాగే కృష్ణ నుద్భవింపజేసిన మహాబలేశ్వరుడు. యమునా కృష్ణా నదు లొకే అవతారములు.

రైలు మాణిక్యపూర్ దాటినతర్వాత ఏవో మాటలసందడిని "మీకేం, మీరు చాలా అదృష్టవంతు లగుటచేత మీ రాష్ట్రం మీకు ఇదివరకే వచ్చి ఉంది. కాని మీ రాష్ట్రంవాసియైన నెహ్రూగారికి మీ యందు ప్రేమ లేకపోవడంవల్ల ధార్ నివేదికపై ఏమీ చెప్పకుండా వూరుకొన్నారు" అని కొంచెం తీక్ష్ణంగానే అన్నాను. ఆ యువకునికి చాలా కోపం వచ్చినట్లున్నది. "మీకు రాష్ట్రం రాకపోతే ఏమి లోటు వచ్చింది చెప్పండీ ? మీ ఒక్కరిమీద ఇంకా రాజ్యం చేస్తున్నారా ?" అని అడిగినాడు.

నేను : ఎంత చక్కని భావం వెల్లడించారు ! మీ రాష్ట్రంఅవతల వున్న పంజాబుతోనో, ఇవతల వున్న బీహారుతోనో, అడుగునవున్న మధ్యరాష్ట్రాలతోనో కలిసిపోకూడదా? అలా కలిస్తే మీలో ఉన్న ఇంగ్లీషుతత్వము ఒదిలిపోవునేమో?

యువతి : ఇంగ్లీషు తత్వమంటే?

నేను : సామ్రాజ్య తత్వం.

యువ : అంటే తక్కిన దేశాన్నంతా మా చెప్పు చేతల్లో వుంచుకొని తక్కిన రాష్ట్రాలన్నీ మా సామ్రాజ్యం క్రింద ఉంచుకొన్నా మనేనా? మీ మాటల్లో ధ్వని అదేగా?

నేను : నిజమైన ప్రజాపరిపాలన అయ్యేటట్లయితే, ఈ ముప్పై సంవత్సరాలు వాదించి ఒప్పుకొన్న ధర్మసూత్రాలలో ఒకటికదా భాషారాష్ట్ర విభజన. అది వెంటనే స్వతంత్రభారతం ఎందుకు అమలులో పెట్టలేదు చెప్పండీ ?

జ్యోతి : ఇప్పుడు కేంద్రప్రభుత్వము అనేక విధాల కష్టాలు పడేటప్పుడు దానితో సహకరించక, అతి ముఖ్యం కాని భాషారాష్ట్రసమస్య యెందుకండీ?

నేను : మహాత్మాగాంధీజీ ఇంగ్లీషువారు కాస్త కాస్త స్వరాజ్యం ఇస్తానంటే ఒప్పుకున్నారా? స్వరాజ్యం వచ్చినప్పుడు సంపూర్ణ స్వరాజ్యంరావాలి. దేశంలో ఒక భాగానికి స్వరాజ్యం వచ్చి రెండో భాగానికి రాకుండా వుండేటమా?

యువ : అయితే ఆంధ్రులకు స్వరాజ్యం రాలే దంటారా?

నేను : ముమ్మాటికీ రాలేదంటాను. మీ భార్యాభర్త లిద్దరూ బయలుదేరి ఆంధ్రదేశంవెళ్లి ప్రతి ఆంధ్ర స్త్రీనీ పురుషునీ ప్రశ్నించండీ! ఎంత బాధతో ఆంధ్రులు యావన్మందీ కృంగిపోతున్నారో!

శంకర్ ఘర్ స్టేషన్ వచ్చి వెంటనే వెనక్కు వెళ్లిపోయింది.

యువతి : ఈ రాష్ట్రాల సంగతి అలా ఉంచి మా ప్రార్థన ఒకటి వుంది వింటారా? నేనూ, మావారూ కలసి అడుగుతూన్నాము. మన బండి అలహాబాదు చేరేసరికి పదిన్నర అవుతుంది. మీరు మాతో యింటికి రావలసిందని కోరుతున్నా నా తరఫునా, మా ఆయన తరఫునా.

యువ : మా రాణీగారు నా మనసులో వున్నది నిమిషంలో గ్రహించారు. మా అత్తవారి ఇల్లు పెద్ద మేడ. మీరు యూనివర్సిటీహాస్టలులో మీ బసకు పోయేలోపున మా ఇంట్లో నాలుగురోజులపాటు వుండాలని మనవి. మా మామగారు కొంచెం పూర్వ సాంప్రదాయంవారు. మీరు మాకు అతిథులుగా ఉండమని కోరుతున్నాము.

యువతి : మేము పూర్తిగా శాకాహారులమే నండోయ్!

నేను : మిమ్మల్ని ఇబ్బంది పెడుతానని భయం.

యువతి: ఏమీ భయం లేదు. మా చెల్లెలు వుంది. నా కన్న అందంగా ఉంటుంది. నా కన్న మధురంగా పాడుతుంది. రెండో ఏడు బి. యస్ సి. కెమిస్ట్రీ చదువుతోంది.

యువ : కాని మా ఆవిడలా చిలకలా గంటల కొలదీ మాట్లాడదు. బాపూజీ మౌనవ్రతంలో ఏ శుభ ముహూర్తంలోనో పుట్టివుంటుంది ఆవిడ గారు.

యువతి : మీరు ఏమీ మాట్లాడలేని సంగ నాచులు!

౪

ఏవేవో ఆలోచనలలో పడినాము. రైలు వేగంగా వెడుతూవున్నది. మాకందరికి కొంచం నిద్ర మైకం కూడా వచ్చింది. ఇంతట్లో నైనీజంక్షన్ వచ్చింది. మా కలకత్తా మెయిలు అక్కడ ఆగకుండా అలహాబాదుకే వెళ్ళిపోయింది. వచ్చింది మా స్టేషన్. మేమందరమూ త్రివేదిగారింటికే వెళ్ళినాము. నాకు వారి తల్లిదండ్రులు ఏ మనుకుంటారో అని భయం. కాని వారందరూ ఏదో దగ్గరచుట్టం వచ్చినట్లే చూచినారు.

వింధ్యాచలం వెనకనే ఉండిపోయినాడు. నర్మదా నదిభారతమాతకు మొలనూలై ప్రవహిస్తూనే వున్నది. నేనీ త్రివేణీసంగమపవిత్రస్థలానికి వచ్చి చేరినాను. ఇక్కడి వారికీ ఆంధ్రులకూ అన్ని ఆచారాలూ తేడాగానే వున్నాయి. వారి భోజనాలు వేరు. వారు గోధుమరొట్టెలు ఎక్కువ తింటారు. వారి తర్కారీ లకు మన కూరలకు సంబంధం లేదు. వారు పులుసులలో చింతపండు వేయరు. కొందరు మామిడిఒరుగు, కొందరు ఆల్చకరా వేస్తారు. వారికి పచ్చళ్లు ముఖ్యం కాదు. ఆవకాయ ముఖ్యం కాదు. ఊరగాయలు అపోరకం.

కాని ఇవన్నీ వింధ్యాచలం వేరు చేసిందా? అయితే అరవవారి భోజనానికీ తెలుగువారి భోజ నానికీ అంత తేడా ఉందేమి? ఆచారాలుమాత్రం పైపైన తేడాలేగాని అసలు మడీ గిడీ స్నానం శుద్ధి జపం తపం వారికీ వీరికీ ఒకటే.

త్రిపాఠీ ఐ. సి. యస్. గనుక ఆ యువకునకు ఛాందసాలు ఏమీలేవు. భారతీయుని హృదయం ఒకటే! సంస్కృతి ఏలాంటి మహారాజపథాలు నిర్మించ లేదు గనుకా! భారతజాతికి విముక్తి వచ్చిన ఈ దినాల్లో సర్వదేశాలకూ ఆదర్శము కాగల రాజ్యాంగచట్టం భరతదేశం నిర్మించుకుంటోంది. భాషలు తేడా అయితే హృదయాలు తేడాలు కావాలా? పంజాబు బెంగాలు అల్లరులు, తూర్పు పశ్చిమపాకిస్థానలనుండి కోట్ల కొలది హిందువులను భరతదేశానికి తరిమివేశాయి. ఆ కాందిశీకులు భరతదేశం అంతా వలస ఏర్పాటు చేసుకోవలసివచ్చింది. వారి ఆచారాలు, వలస రాష్ట్రం ఆచారాలూ, సంస్కృతులూ పవిత్రప్రయాగ అవుతున్నాయి. ఒక మహాకష్టంలోంచి ఒక దివ్యమైన శుభమూ అవతరిస్తున్నది. ఈ ఆలోచనలతో నిదుర కూరినాను.

౫

నేను త్రివేదీగారింట్లో ఉన్న మూడవదినాన సాయంకాలం జ్యోతిర్మయి చెల్లెలు ఆనందమయి నేను అతిథిగా మకాం చేసిఉన్న గదిలోనికి వచ్చి, "నమస్కార్ చతుర్వేదిజీ!" అని రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ, నా సోఫాకు ఎదురుగుండా ఉన్న ఆసనం అధివసించింది.

ఆనంద : మీ చదువేమీ పాడుచేయటం లేదు గదా?

నేను : ఎబ్బెబ్బె, నేను ఏవో ఆలోచనలలో తేలిపోతున్నాను లెండి. వానికీ నా చదువుకీ ఏమీ సంబంధం లేదు.

ఆనంద : అలాంటి ఆలోచనలలో తేలిపోయా రంటే, భూగ్రహణ శక్తికి మీరిపోయిన విశ్వపథంలో పడిపోయి మళ్లీ ఈ లోకానికి రారేమో?

నేను : (నాకు నవ్వువచ్చి పకపక నవ్వినాను) అప్పుడు ఇతర లోకాల లేవైనా కొత్తవి కనుక్కొని "రాడార్" ద్వారా మీకు కబురు పంపుతాను!

ఆనంద: అప్పుడు మీకు నెహ్రూమీద కోపం పోతుందనుకుంటాను.

నేను: నాకు నెహ్రూమీద కోప మేమి టండోయ్?

ఆనంద: మొన్న ప్రయాణంలో వస్తూ దారంతా అదేటుగా మీ వాదన!

నేను: రామ రామ! నాకు నెహ్రూజీమీద ఉన్న భక్తి అపారం. నాహృదయంలో ఆయన మహాత్మాజీకి నిజమైన ఆశయపుత్రుడన్న సంపూర్ణ నమ్మకం. ఎటు వచ్చినా, మా ఆంధ్రులకు అన్యాయం చేసేవారి కుట్రలకు నెహ్రూపండితులు, అన్ని విషయాలూ తెలిసిఉండి చేయూత ఇస్తున్నారని బాధపడు తున్నాను.

ఆనంద: తెలిసిఉండి చేయూత ఇస్తున్నారనా మీ అభిప్రాయం?

నేను: తెలిసిఉండి సహాయం చేస్తున్నారా, అది తీరని తప్పు. తెలుసుకోకుండా సహాయం చేస్తు న్నారా, అది మరీ తప్పు.

ఆనంద: అలాంటి దోషవిషయాలకు ఆయన చేయూత ఇస్తున్నారనే మీ నమ్మకం?

నేను: చేయూత ఇస్తున్నారంటే తాను చేయా లని సహాయం చేస్తున్నారని నా అభిప్రాయం కాదు. అందరూ గాంధీజీశిష్యులనీ, అందరూ ధర్మపథాన్ని నడవవలసిఉందనీ, ఆలా వివిధాభిప్రాయాలవారూ ధర్మం నెరవేర్చడానికి సంకల్పం వహిస్తే ఉత్తమ మార్గం అప్పుడే ద్యోతకంఅవుతుందనీ, నెహ్రూగారి అభిప్రాయమని నా నమ్మకం. అదేగా వారు మద్రాసు నకు వెళ్లి మంత్రివర్గంవారికి బోధ చేసింది.

ఆనంద: ఇంక మీరు బాధపడవలసిన అవసరం ఏమిటి? మీ ఆంధ్రుడైన పట్టాభిగారు రాష్ట్రపతి అయినారు. మీ ఆంధ్రుడే కళావెంకట్రావుగారిని ఆయన ఒక కార్యదర్శిగా చేసుకున్నారు. ఇక మీకు ఆంధ్రరాష్ట్రం సత్వరంగా రావచ్చు కాదా?

నేను: నిజమే, మీ రన్నదానిలో నిజం లేక పోలేదు. ఆంధ్రుడు రాష్ట్రపతి కావడం మాకు అదృష్ట కారణమే అవుతుందో, దురదృష్టకారణమే అవుతుందో! భవిష్యత్తు భగవంతుని చేతిలో ఉంది.

ఆనందమయి తాను కూర్చున్న కుర్చీలోనుండి లేచి నా దగ్గరకు వచ్చి నా భుజంమీద చేయి వైచి "ఆంధ్రులకు రాష్ట్రం విషయంలో ఎంత గాఢకాంక్ష ఉందో, ఆశ్చర్యమే! మీ బాధ మాకేం తెలుస్తుంది చెప్పండి. మా కాసమస్య ఎన్నడూ ప్రత్యక్షంకాలేదు." అని అంటూ "చతుర్వేదిగారూ మీరీ రెండేడులన్నర నుండీ ఈ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేస్తున్నారు కదా. మా యు. పి. వారు, మీ విషయంలో ఏలా సంచరించారు?" అని ప్రశ్నించింది.

ఆ బాలిక ఇరువది ఏడుల ఎలప్రాయపు జవ్వని. ఆంధ్రులలో సాధారణంగా కానరాని స్వచ్ఛసువర్ణ చ్ఛాయ శరీరకాంతి గల మహోజ్వలాంగి. ఒయ్యారాల హంసయాన. నా భుజంపైన చేయి వైచినప్పుడు నాకు ప్రపంచమంతా మత్తిల్లి ఒరిగిపోయినట్లైనది. నాకు మాట రాలేదు. నా ప్రజ్ఞ అంతా పటాపంచలైనది.

నా హృదయావేదనాభరితమానం ఆమె అపార్థం చేసుకున్నది కాబోలు, నాప్రక్కనే సోఫాలో కూర్చుండి, "మిమ్ము మా రాష్ట్రం సరిగా ఆదరించలేదా, చెప్పండి?" అని ఆదుర్దాగానే ప్రశ్నించింది.

మీరు చేయి వేస్తేనే, నేను మైమరచినవాణ్ణి, ఆమె నా దగ్గరగా సోఫాలో కూర్చుంటే నా స్థితి ఎవరికి గ్రాహ్యం కాగలదు? మాట రాలేదు. జవాబు చెప్పాలని ప్రయత్నం చేశాను. నోరు తడియారి పోయింది. హృదయమృదంగం భేరీభాంకారమై ద్రుతకాలమైపోయింది. ఏలాగో తెప్పిరిల్లగలిగాను. మాట తడబడుతోనే,

"ఆ...ఆ...ఆనంద...ఆనంద...మయీ దేవి గారు...అచ్చే ఏదో... ఆలోచనలలో...మాట్లాడ లేదు.. మీ...మీ రాష్ట్రం నా యడల చూపించిన ప్రేమ..ప్రేమ...అపారం! మీ కుటుంబమే దానికి... దాని.. చిహ్నం అనుకోండి." అని అన్నాను.

అనాలోచితంగా జరిగే అనేక సంఘటనలు జీవితంలో విప్లవాలు తీసుకురావచ్చును. ఆనందమయి, నా హృదయంలో అవతరించిన తుఫాను ఏమి అర్థం చేసుకోగలదు?

నేను ఇరవై ఆరేళ్ల యువకుణ్ణి. బీదవాణ్ణి. చదువులోమాత్రం ముందంజ గలవాడిని. లోకం నా చదువు చూచి నాకు సహాయం చేయ సంకల్పించింది. నేను దేహి అని ఇతరులను యాచించలేదు. హైస్కూలులో మా ప్రధానోపాధ్యాయుడు నాచదువు చూచే నాకు ఉచిత వేతనం ఇప్పించాడు. మా తండ్రి పురోహితుడు, స్వంత వ్యవసాయదారుడు. మాకున్నది రెండెకరాల మాగాణి. అదే మాకు జమీ. ఏలా సంసారం ఈదేవాడో ఏలా నాకు చదువుకై కర్చులు పంపేవాడో! కాలేజీలో అర్థ ఉచిత వేతనం వచ్చింది. ఆంధ్రాయూనివర్శిటీవారు పూర్తిగా ఉచిత వేతనం ఇచ్చారు. అకే ఆశ్చర్యమన్నారు మావారు.

మా ఆంధ్రదేశం బ్రాహ్మణ బ్రాహ్మణేతర సమస్యతో మండి పోతోంది. గట్టిగా మాస్తే బ్రాహ్మణులలో లక్షాధికారులు పదిమంది ఉండరు. నూరు ఎకరాల మాగాణి ఉన్నవారు రెండు డజన్లుకూడా ఉండరు. ప్రజారాజ్యవిధానంలో బ్రాహ్మణులు ఓట్లు నూటికి ఒక్కటికూడా ఉంటుందో ఉండదో! గ్రామాలలో వారికి ఏమీ బలం లేదు. అయినా వారిమీద రెడ్డి, కమ్మ, కాపువెలాల వారి కున్న కోపం ఇంతింతని కాదు. అయినా ఆ కోపం పైపైనే అనే నానమ్మకం. సంస్కృతిలో పైకి విజృంభించి పోవాలన్న ఆవేదనతో వారిపైన వారికే ఉద్భవించిన క్రోధం బ్రాహ్మణ ద్వేషం అని అనుకుంటున్నారని నా నమ్మకం. కాని ఈలోగా దేశం పొందే సంక్షోభం ప్రజాజీవితాన్ని కలచివేస్తున్నది. బ్రాహ్మణులపైన ఉన్న ద్వేషం మానసిక నైర్మల్యాన్ని ధ్వంసంచేసి వారిలో వారికే ద్వేషం ఉద్భవింపజేసినది. అయినా ఇవన్నీ హృదయగతం కాకపోవడంవల్ల న్యాయం చేయవలసివచ్చినప్పుడు ఆంధ్రులు న్యాయపథము అనుసరించితీరుతూనే ఉన్నారు. అందుకనే నాకు మా ఆంధ్రాయూనివర్శిటీవారు విద్యావేతనం దయచేయించినారు.

నేడు అలహాబాదువారూ విద్యావేతనమిచ్చి నన్ను డి. యస్. సి. కి పరిశోధనచేయడానికి సావకాశం ఇచ్చినారు. దేశంలో ఎవరికి ఉన్న భావాలు వారు ఫలవంతం కావాలని ఆశిస్తారు. అవి కాకపోతే జరగలేదని విషాదం పొంది, అక్కడనుంచి ద్వేషాగ్ని ప్రజ్వరిల్లచేసుకొని ఈ సంస్థనూ, ఆ సంస్థనూ, ఈ వ్యక్తినీ, ఆ వ్యక్తినీ అడిపోసుకుంటారు. తమ జీవితాలు విచ్ఛిన్నం చేసుకుంటారు. ఇతరుల జీవితాలు విచ్ఛిన్నం చేస్తారు.

"మీరు నాకు కాస్త ఇంటిదగ్గిర పాఠాలు చెబుతూఉంటారా? మా నాన్న మీకు తగిన పారితోషికం ఇస్తారు. మీ రీ విషయంలో మొహమాటం పడకండి."

"అయ్యొయ్యో! అదేమిటండీ. అలాంటిమాటలని నన్ను బాధపెట్టకండి. నాకు వీలయినప్పుడు హాస్టలునుండి వచ్చి సంతోషంతో మీకు పాఠాలు చెప్తాను."

"ఆ వీలు ఏ వేళకు ఒక మాటో అవుతుంది కాబోలు."

"వా! వా! అదా నా ఉద్దేశం."

ఈ బాలిక పేరు ఆనందమయి. ఆనందపూర్ణమైన జీవితమే రూపం కట్టిందా యీమె!

ఈ ఆలోచనలన్నీ రెండు మూడు నిమేషములలోనే నాహృదయాన ప్రసరించిపోయినవి. ఆనందమయి నన్ను చూచి "ఏమిటండీ మీ ఆలోచనలు— యీ రెండు ఏండ్లు యిక్కడ చదువుకుంటూ వుండి కూడ మీ దర్శన భాగ్యం యెప్పుడు మాకు కలుగనిచ్చారు కాదు. మీ దక్షిణాదివాళ్లెప్పుడు యింతేనండీ!". అని ఆ బాలిక పకపక నవ్వింది.

"మేము దక్షిణాదివాళ్లము కాదండి. మేము తెలుగు వాళ్లము?"

"తెలుగు వాళ్లు దక్షిణాది వాళ్లు కాకపోతే ఉత్తరాదివాళ్లా! నా కెప్పుడూ తెలియదే యీ విషయము?."

"మేము ఉత్తరాదివాళ్లము కాదండీ."

"అయితే మీరే ఆది వాళ్లు? తూర్పాది వాళ్లా, పడమటిఆదివాళ్లా?"

"మీరు తూర్పుఆదివాళ్లు బెంగాలీవాళ్లూ! అస్సాంవాళ్లూ. పడమటిఆదివాళ్లు రాజపుత్రులూ, గుజరాతీవాళ్లూ. నా వుద్దేశ మేమిటంటే దక్షిణాది వాళ్లంతా దక్షిణపెన్నకి దక్షిణంగా వుండేవాళ్లు మాత్రమే. వాళ్లు అరవవారు, మళయాళీవాళ్లూను, మేము దక్కనువారము.

"మీరూ, తమిళులూ, మళయాళీలూ, కన్నడులూ ఒక జాతికి చెందినవారు కాదా?"

"ఇలా జాతీ జాతీ భేదాలుగా చెప్పలేము. ఒకే భాషవారు ఒకే జాతి అని ఏలా చెప్పగలను? ఒకే భాష మాట్లాడేవారిలో—అనేక జాతులవారు కలిసిపోయి యుండవచ్చును, విడివిడిగాను ఉండవచ్చును. ఒకే జాతికి చెందినవారు వివిధ ప్రాంతాలలో వివిధ భాషలు మాట్లాడుతూవుండవచ్చును. వివిధభాషలలో వున్న సౌందర్యము ఉన్నతస్థాయిని పొంది సర్వ భారతీయమైన సంస్కృతిలో ప్రతియుక్తమైన భాగ మౌతుంది. అప్పుడా సంస్కృతి మహత్తరమైన లాభము పొందగలదు."

"మీరు చెప్పింది నిజం"

నాకు ఆశ్చర్యమెక్కువైంది. నేను ఉత్తరాది వారికి, దక్షిణాదివారికి చాలా భేదా లున్నాయని వాదించడానికి సంసిద్ధుడనై యుంటిని. కాని ఆనంద మయి నేని నావాదన తీసుకోడమూ, నేను ఆమె వాదన బలపర్చడమైనది. ఈ సంగతి యిద్దరం ఒకేసారి గ్రహించాము. గ్రహిస్తూనే యిద్దరం పకపక నవ్వుతున్నాము.

౬

నేను మా విశ్వవిద్యాలయంహాస్టలుకు వెళ్ళి పోయాను. వెళ్ళి వారంరోజులవరకు త్రివేదిగారింటికి రాలేదు. తొమ్మిదవరోజు సాయంకాలం త్రిపాఠీ దంపతులూ, ఆనందమయీ త్రిపాఠిగారి కారు మీద మా వసతిభవనానికి చక్కా వచ్చారు. నా గది నంబరు తెలిసిన త్రిపాఠిగారు రెండవ మేడలో మూడవ అంతస్థులో వున్న నా ౨౦౪ నంబరు గదికి గబగబా వచ్చి "హల్లో, చతుర్వేది" అని పిలిచారు. నేను అప్పుడే లైబ్రరీనుంచి వచ్చి టీ త్రాగి పడకకుర్చీలో మేను వాల్చి, ఆనందమయీసౌందర్యం తలపోసుకుంటూ ఏవేవో అంతులేని కలలు కంటున్నాను. త్రిపాఠీగారి పిలుపుకు ఉలికిపడి లేచి "రారా త్రిపాఠీ గారు, రండి, ఆ పడకకుర్చీమీద దయచేయండి. రెండు నిమిషాలలో టీ ఆర్డర్ చేసి చక్కా వస్తాను" అని అన్నాను. ఆయనరాకకు నా ముఖం ప్రఫుల్లమైనట్లు నాకే స్పష్టమైంది.

"నాకు 'చా' వద్దు 'టీ' వద్దు. మీరు వెంటనే దుస్తులు ధరించి నాతో రావాలి. ఇది ప్రభుత్వంవారి ఆజ్ఞలు." అని త్రిపాఠీ చిరునవ్వుతో హెచ్చరించాడు.

"ఏ ప్రభుత్వం వారు!" అన్నాను నేను.

"ఆ ఆజ్ఞలు మీకేమీ తెల్పడానికి వీలులేదు, రహస్యపు టపాలో వచ్చాయి"

గబాగబా ఉచితమైన వేషం వేసుకొని ఆయనతోపాటు కిందకు దిగి హాస్టల్ భవనాల ముందున్న తోటలోనికి వస్తిమి గదా — అక్కడ తోటరోడ్డు మీద త్రిపాఠీగారి కారు సిద్ధంగా ఉంది. ఆకారులో జ్యోతిర్మయీ, ఆనందమయీ - ఇద్దరూ కూర్చుని వున్నారు. త్రిపాఠీగారు నన్ను వెనుకసీటులో ఆనందమయిప్రక్కన కూర్చుండమని తాను తన భార్యప్రక్క ముందుసీటులో కూర్చుని ఉన్నాడు. జ్యోతిర్మయి కారును మెల్లెక్కలిపి, సుగ్రువ నడక సాగింపించినది. నేను ముందుకు పడబోతే అందమయి నన్ను రెండు చేతులతో ఆపుచేసి తనవైపునకు లాగుకొంది.

"కొంచమయితే పడిపోయి వుందురు. మా అక్క ఎప్పుడూ ఇంతే లెండి. ఆవిడ డ్రైవ్ చేస్తూవుంటే కొత్తవాళ్లయితే ప్రాణాలు ఎప్పటి

కష్టాడు ఎగిరిపోయిన వనే అనుకుంటారు. మాకు అల వాటు అయింది లెండి." అని అంటూ ఆనందమయి కొంచెం దూరంగా జరిగింది.

"అయితే దారిపొడుగునా మీరు నన్నిలా రక్షిస్తూ వుండవలసిందేనా యేమిటి ?" అని నవ్వుతూ అన్నాను.

"అలా అని అవసరం కలగకపోయినా నాకు పనికలిగించేందుకు ముందుకు వాలిపోకండేం !"

"పనికలిగిస్తే మీకు—"

"టర్నింగ్ వస్తున్నది. జాగ్రత్త చతుర్వేది గారు. గట్టిగా పట్టుకోండి"

"మళ్లీ టర్నింగ్ రానే వచ్చింది. ఆమె వొళ్లోకి నేను పడ్డాను. పాపం మళ్లీ నన్ను గట్టిగా ఆనంద మయి పట్టుకొన్నది. మా ప్రయాణం లక్నో రోడ్డు మీద సాగుతున్నది. నేను ప్రాణాలు బిగపట్టుకునే ఉన్నాను. అయిదు మైళ్లు ఆరీతిగా మా ప్రయాణం సాగింది. అక్కడ రోడ్డుప్రక్కనే మంచి తోట లోనికి మా కారును పోనిచ్చింది జ్యోతిర్మయి. నాకు తుఫానులో కొట్టుకుపోయిన విమానం జాగ్రత్తగా భూమిని వాలినది అనిపించింది.

త్రిపాఠి: ఈ తోట మా మామగారిది; చతుర్వేది గారూ. ఆయన ఈ తోటలో యెక్కడో పని చేస్తూనే వుంటారు. మనం నలుగురం కలసి కాసేపు టెన్నిస్ ఆడుకొని కాసేపు బ్రిడ్జి ఆడుకొని ఇక్కడే భోజనాలు చేయడం, ఇక్కడే ఈ రాత్రి మకాం. మా మామగారు కాసేపటికి యింటికి వెళ్లిపోతారు.

నేను : అయ్యో ! నేను హాస్టలులో చెప్పి రాలేదే.

జ్యోతి : దానివల్ల మీకు నష్టమా?

నేను : నష్టం కాదనుకోండి.

త్రిపాఠి : ఉండవయ్యా! టెన్నిసుఆట కాగానే నేను కారుమీద పోయి టెలిఫోనుచేసి వస్తానులెండి.

నేను : మరి...మరి...

ఆనంద : నత్తివస్తుందేమిటి చతుర్వేదిగారూ!

జ్యోతి: చతుర్వేదిగారు హాస్టలులో ఉండడం నాకేమీ బాగుండలేదు.

త్రిపాఠి : ఈ తెల్లారుకనుంచి మన ఇంటిలోనే మకాం పెడతారులే.

నేను: అప్పుడు నా కిచ్చే ఉచితవేతనంలో కొంత తగ్గిస్తారు.

ఆనంద : ఎంత తగ్గిస్తారు. మీ హాస్టలుచార్జి వారే కట్టున్నారు. అది మానేస్తారు. ఏమిటి నష్టం?

నేను : అయ్యో! మీ ఇంటిలో ఉండడం ఏమి బాగుంటుందండీ.

జ్యోతి : ఎందుకు బాగా వుండదు. మీరు వ్రాసే వ్యాసంవ్రాతకు నేమే వెవ్వరము అడ్డురాము. మీరు లేబొరేటరీకి వెళ్లాలన్నా, లైబ్రరీకి వెళ్లాలన్నా, మా ఆనందమయి తా వెల్లాగూ వెళ్లాలికనక కారులో మిమ్మలను తీసుకొనివెళుతుంది. మళ్లీ సాయంత్రం కాగానే కారులో తీసుకువస్తుంది. రాత్రిళ్లు మా అమ్మాయికి మీరు పాఠం చెప్పితీరాలి.

త్రిపాఠి : అసలు రహస్యం చెప్పేయరాదూ ?

జ్యోతి : ఏముందిలెండి, ! చతుర్వేదిగారు హాస్టల్ లో వుండరని, మా యింట్లోనే వుంటారని మేము విశ్వవిద్యాలయఉపాధ్యక్షునికి చెప్పాము. హాస్టల్ వార్డనుకు చెప్పాము. ఈ సాయంత్రంనుంచే రారని చెప్పావుండ్డోయి.

త్రిపాఠి : మీ సామానంతా రేపు మాయింటికే వచ్చేస్తుంది. మీరు అసలు హాస్టల్ కే వెళ్లనవసరం లేదు.

ఆనంద: మీ గదిని వార్డెన్ గా రెవ్వరికో ఇచ్చివేయడంకూడా జరిగింది.

వీరందరూ ఇలా అంటుంటే నాకు మతిభ్రమ ణమే కలిగిందనుకొన్నాను.

నేను : ఏమిటండి ! బ్లిట్జ్ క్రీగ్.

జ్యోతి : బ్లిట్జ్ అని వెనుకటి యుద్ధంసంగతి మాట్లాడతారేం. వచ్చే యుద్ధంలో ఇది ఆటం క్రీగ్.

టెన్నిస్ ఆడుకొన్నాం. బ్రిడ్జిఆటకు కూర్చు

న్నాము. నేనూ ఆనందమయీ ఒకటి; జ్యోతిర్మయీ త్రిపాఠీ ఒకటి. ఇంతటిలో ఆనంద, జ్యోతిర్మయిల తండ్రి, త్రివేదిగారి కారు వెళ్ళిపోతున్న చప్పుడయింది. మేము బ్రిడ్జి కల్‌బర్ట్‌సన్ విధానాన్నే ఆడాము. వారు ముగ్గురూ ఆ ఆటలో నిధులు. నేనంత పెద్ద ఆటకాణ్ణి కాను. అందులో నా మనస్సు ఏమాత్రమూ నిలకడ లేకుండా పోయింది. ఆలోచనలు ఒక పక్క; ఆటలు ఒక పక్క. నేను రెండు ఆటలు అలా పాడుచేసేసరికి నాకు చాలా సిగ్గువేసింది. "ఇవాల్టికి ఈ ఆటతో చాలునండీ!" అని వారి ముగ్గురికీ కొంత సిగ్గుతో మనవిచేసుకున్నాను. ఆనందమయీ లేచి నాదగ్గరకు వచ్చి "మీరు ఇంత మాత్రము ఆడుతా రనుకోలేదండీ. రండి, అలా తోటలోకి షికారుకు వెడదాము" అని చేయిపట్టుకు లేవదీసింది.

ఆ అమ్మాయి ఇంత చనువుగా నాతో సంచరించడం నాకు ఆశ్చర్యం కలిగిస్తూనే వుంది. మేమిద్దరం పూలతోటలో తిరుగుతున్నప్పుడు ఆ అమ్మాయి నా ఆలోచన గ్రహించిందికాబోలు— "చతుర్వేదిగారూ, మా కందరికీ ఎందుచేతనో మీరు చాలా దగ్గరి చుట్టమైనట్లు భావం కలిగింది. నేనందరితోను యిలా చనువుగా వుండను. మా బావగారంటేనే దూరదూరంగా వుంటాను. ఒక్క మా అన్నయ్య అంటే చాలా చనువు. మా జ్యోతి మీరు తనకు కాపా అన్నగారయినట్లే భావిస్తుంది. మా చనువుకు మీ రేమీ అనుకోవద్దేం" అని అంటూ నా మొగంపైపు చూపులు ప్రసరించింది.

ఆనందమయిసాన్నిధ్యము నాకు నిజంగా మతి పోగొడుతున్నది. ఏమి మాట్లాడాలో నాకు తోచదు. ఆమెతోకూడా మౌనంగా తిరుగుతున్నాను. ఆమెకూడా మౌనం తాల్చింది.

నేను బ్రహ్మచారిని. అతిబీదవాడిని; కాస్త చదువులో పదిమంది కన్నా నయమవడంచేత పరీక్షలో మొదటివాడుగా నెగ్గుతూవచ్చాను. నాకు వివాహం సంగతి ఎప్పుడూ తట్టలేదు. నేను చదువుకొనేటప్పుడు నా తోటివిద్యార్థినులు కాని, యితరబాలికలుగాని నన్నే విధంగానూ ఆకర్షించలేదు. వారిలో చాలామంది అందమైనవారే కాని నా బుద్ధి ఆడవాళ్లమీదనే ప్రసరించని కోణాలలో వాళ్ల అందచందాలు కాని వాళ్ల తెలివితేటలు కాని నన్నేమి ఆకర్షించ గలవుకనక! బి. ఎస్. సి. పట్టం పొంది ఏ మంచిఉద్యోగమో సంపాదించుకొన్న తర్వాత వివాహంమాట ఆలోచిస్తానన్నాను. మా పెద్దలందరితోను. డబ్బు కలవాళ్ల పిల్లల సంబంధాలు వచ్చినవని నా తలితండ్రులు నా మేనమామ చాలా సార్లు ఒత్తిడిచేశారు. కాని నా నిశ్చయము ఏమాత్రము వదలినాను కాను. ఇప్పు డీ ఆలోచనలన్నీ రావడం దేనికి? హిందూదేశంలో వింధ్యపర్వతేశ్వరుడు లేనేలేడా? గంగా గోదావరులు ఒకేచోట పుట్టాయా? సర్వసమమైన భావాలు మానవజీవితంలో చొచ్చుకు వచ్చినప్పుడే ఇది గంగ అది గోదావరి అవుతుంది. ఇది తూర్పుకనుమ అది పశ్చిమకనుమ అవుతుంది.

ఆనందమయి చటుక్కున ఆగి 'చతుర్వేదిగారూ, మీకు మా ఎవ్వరిమీద కోపం కలుగలేదుకదా? నేను ఎప్పుడు మీతో మాట్లాడుదా మని వచ్చినా మీరు ఏదో ఆలోచిస్తూఉంటా రేమి! మీరు మా యింట్లో ఉండడానికి అన్ని ఏర్పాట్లు చేసింది మా అక్కే సుమండీ. ఆవిడకు నిజంగా మీవద్ద కొన్ని విషయాలు నేర్చుకోవాలని ఉంది. నాకు కొన్ని విషయాలు మా అక్కకు కొన్ని విషయాలు నేర్పుతూకూర్చున్నా రంటే మీ కాలమంతా భగ్నమై మీ చదువుకు అంతరాయం కలుగవచ్చు. అయినా మా అక్క మాటను ఎవ్వరూ కాదనలేము. ఆవిడ ఒకటి చెప్పిందంటే అది అశోకాజ్ఞ." అని తల వాల్చుకొని తొందరగా చెప్పినది.

మేమిద్దరము ఆప్రక్కన నున్న ఒక ఉద్యానవనాసనంపై కూర్చున్నాము.

"ఆనందమయీదేవిగారూ, మీరు నాకేమీ కష్టం కలిగించలేదు పైగా పూర్తికావచ్చిన నా వ్యాసాన్ని బాగా ముగించడానికిన్నీ, వ్యాసమంతా మళ్లా మొదట్నుంచీ సరిచేసుకోడానికీ హాస్టల్ ప్రీతైన ప్రదేశం కాదని అనుకొంటూవున్నాను. పైగా నా

వ్యాసం అంతా ఎప్పటికప్పుడు పూళ్ళో ఉన్న ఒక టైపుషాపుకు వెళ్లి టైపు కొట్టుకుంటున్నాను. అది రాత్రిళ్లు వీలు కాకుండా వున్నది. నేను టైపుమిషను కొనుక్కోలేను. మీ యింట్లో చక్కటి టైపుమెషీను చూచాను. వీలుగా వుంటే ఆ టైపుమెషీను నేను ఉపయోగించుకోగలను" అని ఆమెతో నెమ్మదిగా అన్నాను.

౭

ఆ రాత్రిభోజనా లయినవెనక ఆ తోటభవనంలో మేము చాలాసేపు రాజకీయాలు, సారస్వతాలు, కళలు, శాస్త్రవిషయాలు చర్చించుకున్నాము. ప్రస్తుతపరిస్థితుల్లో భాషాప్రయుక్తరాష్ట్రాలు వచ్చితీరా లని నా వాదన. భాషాప్రయుక్తరాష్ట్రాలు అనే భావమే సకలభారతావని ఒక్క మహాశక్తితో విజృంభించడానికి అన్నివిధాలా అడ్డమని త్రిపాఠివాదన.

నేను : ఉన్న భాషలు తీసి వేయలేము. ఒకే భాష మాట్లాడేవారు సన్నిహితంగా రావడం తప్పించలేము; బ్రాహ్మణాబ్రాహ్మణవిభేదాలు మా రాష్ట్రంలో ఉన్నమాట నిజమే. అవి మీరాష్ట్రాలలో తక్కువ వుండవచ్చును. అయినా మా రాష్ట్రంలో వున్న బ్రాహ్మణ,బ్రాహ్మణేతరులు ఇతరరాష్ట్రాలలో వున్న బ్రాహ్మణ, బ్రాహ్మణేతరులకన్నా తమలో తాము ఎక్కువ సన్నిహితంగా వుంటారు.

త్రిపాఠి : అది నేను నమ్మను, మీ మద్రాసు శాసనసభసంగతులు చూస్తూవుంటే, మీ మంత్రిత్వపు గడబిడలు గమనిస్తూవుంటే తెలుగు, తమిళ, కన్నడ, మళయాళ, బ్రాహ్మణేతరులంతా ఒకటై ప్రకాశంగారి మంత్రివర్గాన్ని పడగొట్టారని స్పష్టంగా తెలుస్తున్నది.

నేను : అది అంతా పూర్తిగా నిజంకాదు. మొదటిసారి ప్రకాశంగారిని ఓడించడంలో ఎవరో ఒక రిద్దరు తప్ప చాలామంది తమిళ బ్రాహ్మణులు ప్రకాశంగారికి వ్యతిరేకు లయ్యారు. తెలుగువారిలో ప్రకాశంగారి తరఫున చాలామంది బ్రాహ్మణేతరులు వున్నారు. ఈ కక్షలన్నీ నా ఉద్దేశంలో వ్యక్తి సంబంధమైనవని. మాకు ఆనాడు కావలసింది కాంగ్రెసువారి రాజ్యం. అందులోకెల్లా పెద్ద కాంగ్రెస్‌వారు ఆ పక్క రాజగోపాలాచారిగారు. ఈ ఇద్దరూ కలసి మంత్రివర్గం ఏర్పాటుచేసివుంటే మద్రాసురాష్ట్రవ్యవహారాలు చాలా అద్భుతంగా వుండివుండును. కాని, ఇక్కడకూడా భాష అడ్డువచ్చింది. రాజగోపాలాచారిగారు, ప్రకాశంగారు కలవడానికి ఏవో అడ్డు వచ్చాయి. ఇంతకూ నా వాదన సత్వరంగా ఆంధ్రరాష్ట్రం వచ్చితీరాలి.

జ్యోతి : అయ్యయ్యో! మీరలా అంటారు. మా రాష్ట్రమంతా ఒకేభాషే నా, అయినా చూడండి. కాంగ్రెస్‌వారిలో ఎన్ని ముఠా లున్నాయో!

అనంద : నిన్నటివరకూ రాక్షసుల్లా కష్టపడ్డారు కాంగ్రెస్‌వారు; స్వరాజ్యం సంపాదించారు; రాజ్యరథం నడపడానికి పగ్గాలు చేతబట్టారు. ఇంక తమ దేశంమాట మరచిపోయారు.

నేను : ఎవరో నెహ్రూ, పటేలు, రాజేంద్రబాబు, అజాద్ - ఇంకా అలాంటి పెద్దలు తప్ప తక్కినవా రందరూ తామింకా అసలైన గమ్యస్థానం చేరలేదన్న విషయాన్ని మరచిపోయారు.

త్రిపాఠి : అది మరచిపోవడం కాదేమో. వారు అనుకోని, ఊహించలేని ప్రళయాలు వచ్చిపడ్డంచేత ఈమోస్తరుగా సంచరించవలసివచ్చిందేమో ఆలోచించారా !

నేను : మీ రన్నదానిలోనూ నిజం లేకపోలేదు. కాని అసలు గాంధీతత్వం వెనుకపడిందంటారా లేదా !

అనంద : నేను తప్పకుండా నిజ మంటాను.

జ్యోతి : నేను పూర్తిగా నిజం కాదంటాను. ఎందువల్లనంటారా బ్రిటిష్‌వారి పరిపాలనవల్ల నేమి, మరి భారతీయుల సంప్రదాయబాంధవ్యంవల్ల నేమి మనలో మధ్యయుగపు భావాలన్నీ కరడుకట్టివున్నవి. గాంధీగారిని అనుసరించిన రోజులలోకూడా ప్రతి కాంగ్రెస్‌వీరుడూ నూటికి ౧౦ పాళ్ళు మాత్రమే అనుసరించాడు. ఆ మాత్రానికే అతడు వీరు డనుకున్నాడు.

ఆనంద : లేకపోతే స్వరాజ్య మెలా వచ్చింది?

నేను: ఇది నిజమైన స్వరాజ్య మంటారా ఆనంద మయిగారూ! నిజమైన స్వరాజ్యమైతే పాకిస్థాన్ విడిపోనేపోదు. కాంగ్రెస్‌లో జైలుకు వెళ్లినవాళ్ళు దెబ్బలు తిన్నవాళ్లు, ప్రాణాలు కోల్పోయినవాళ్లు, ఆస్తులు పోగొట్టుకున్నవాళ్లు, ఎందుకు పనికిరాకుండా పోయినవాళ్ళు నూటికి ౭౦ పాళ్లు అనుసరించివుండినా పంజాబుహత్యలు నవఖాళీహత్యలు రానేరావు.

ఆనంద : అవతారమూర్తి అయిన ఒక మహాను భావుడు ఉద్భవించినప్పుడు ప్రజలు ఆయనను నూటికి నూరుపాళ్లు ఎప్పుడూ అనుసరించనేలేరు. నూటికి ఏ అయిదుపాళ్ళు అనుసరించినా మానవసంస్కృతి ఎన్నో మెట్లు పైకి నడచిపోగలదు.

నేను : ఇంతకూ మీరు భాషా ప్రయుక్త రాష్ట్రాలు కావాలంటారా అక్కర్లేదంటారా?

త్రిపాఠి : కొంతకాలానికైనా అవి పోవాలి. రాజ్యపరిపాలనాసౌకర్యంమాత్రంకోసమే రాష్ట్రాలు ఏర్పడాలి.

నేను : అలా ఏర్పడ్డంవల్ల రష్యాలో ఏమీ నష్టం కాలేదే? స్విట్జర్లాండులో ఏమీ కష్టాలు కలుగలేదే?

ఇలా మా సంభాషణ సాగించి మే మింత గట్టిగా వాదించుకొనడంవల్ల ఆంధ్రదేశానికి ప్రత్యేకరాష్ట్రం వస్తుందని నేను ఎప్పుడూ అనుకోలేదు. దక్షిణాదిన వుండే ఆంధ్రులే ఆంధ్రరాష్ట్రానికి వ్యతిరేక మయినారు. భాష ఒకటైనంతమాత్రాన అందరినీ ఏకోన్ముఖంగా చేస్తుందా ఏమన్నా? ఆ రాత్రి రెండుగంటలకు నిద్రపోయాము.

తెల్లవారి ఆరుగంటలకు నాకు మెళకువ వచ్చింది. కళ్లు తెరచేటప్పటి! నా గదిలో గుమ్మందగ్గర నన్ను గమనిస్తూ ఆనందమయి నిలుచునివుంది. నేను ఉలిక్కి పడి లేచి కూర్చున్నాను. "రాత్రి ఎంత నిద్రలేక పోయినా, నాకు పెందలకాడె మెలుకువ వచ్చేదండి ఈ వాళ నాకిలా పొద్దు తెలియకుండా నిద్రపట్టిం దేమిటో" అని కొంచెం సిగ్గుతోనే అన్నాను.

"మీ రేమీ కంగారుపడకండి. నేను ఒక్కతినే లేచాను. బావ అక్క ఇంకా నిదురపోతూనే వున్నారు; మీరు లేచారేమో, మీకు కాఫీ కావాలా టీ కావాలా, అని అడగటానికి వచ్చాను" అని ఆనంద మయి అంటూ "మీరు ముఖం కడుక్కొని హాలులోకి రండి" అన్నది.

"నాకు కాఫీ అంటేనే యిష్టం. మీదేశానికి వచ్చాక టీ కూడా అలవాటులెండి. అయినా ప్రొద్దున్నప్పుడు కాఫీయే పుచ్చుకుంటాను" అని అన్నాను.

"మీ హాస్టల్లో కాఫీ తయారుచేస్తా రండీ."

"తెలుగువాళ్ళము, అరవవాళ్ళము, కన్నడ వాళ్ళము కలసి పదిమం దున్నాము హాస్టల్‌లో. మావంటవాళ్లకి కాఫీ చేయడంకూడా నేర్పాము."

"అయితే మీరు నాకుకూడా నేర్పండి. నేను మా వంటవాళ్ళకి నేర్పుతాను."

మే మిద్దరమూ నవ్వుకున్నాము. ఆమె వెళ్ళి పోయింది.

హాలులో మే మిద్దరమూ ఉపహారాలు పుచ్చు కొనేసమయంలో జ్యోతిర్మయీ, సుప్రియాత్రిపాఠీ మేడమీదనుంచి కిందకు దిగివచ్చారు.

౭

నా పరిస్థితి చిత్రంగానే ఉంది. త్రివేదీగారింట్లో నేనూ చుట్టాన్నయ్యాను. ఆ యింట్లో నన్నందరూ ఎంతో గౌరవంగానూ ప్రేమతోనూ చూస్తున్నారు. జ్యోతీంద్రనాథత్రివేదీగారు ఉత్తముడైనఅడ్వొకేటు. నెలకు ఇరవై ముప్పై వేలు ఆదాయం వస్తుంది. ఆయన మొదట మోతీలాల్ నెహ్రూగారిదగ్గిర జ్యూనియర్‌గా చేరినారు. భారతప్రధాని నెహ్రూజీతో ఆయన సమ కాలికుడు. మొదటనుండీ కాంగ్రెసు అభిమానిమాత్రం. నెహ్రూకుటుంబం దేవతల కుటుంబం అని ఆయన నమ్మకం.

ఆయన సంప్రదాయాభిమాని. జపతపాదులు దైనందినధర్మంగా నిర్వహించే సనాతనవాది. అయినా సంఘంలో వచ్చే మార్పులంటే ఆయనకు ఇష్టమే! మరీ పెద్దమార్పులు తార్కికంగా ఆయన ఒప్పుకున్నా

వచ్చే ఉద్యమవిషయంలో ప్రథమసమయంలో ఆయన విముఖంగానే ఉండేవాడు. హరిజనులు దేవాలయాలకు రావడం ఆయనకు కిట్టలేదు. హిందూవివాహానికి విడాకులశాసనం తీసుకు రావడం ఆయనమనస్సుకు వజ్రాఘాతంలా తగిలింది. మదరాసురాష్ట్రం సనాతనధర్మపూర్ణము అని ఆయన భావించుకొనేవారు. మదరాసురాష్ట్రవాసుల ఆచారాలు సనాతనధర్మపూర్ణాలనుకొన్నాడాయన కాని అక్కడ విడాకులచట్టం ఆయనకు ఆశ్చర్యం వేసింది.

అయినా ఆయనకు వేదకాలపు మహాఋషుల శక్తి అంటే అపారమైన నమ్మకం. ముందుయుగాలలో అవసరమైన మార్పులు వస్తూఉండేటట్లే వారు నిర్ణయించారనీ, రాను రాను యుగాలు అవతరించినకొలదీ, ప్రపంచంలో అన్నిభాగాలూ వేదధర్మానుసరణమైన దివ్యభావాలు గ్రహించి భారతీయసంస్కృతిలో చేరిపోతాయని ఆయనకు గాఢవిశ్వాసం. మార్పు వచ్చినప్పుడు బాధపడతాడు. వచ్చిన కొద్దిసంవత్సరాలకు సమన్వయం చేసుకుంటాడు. మహాత్మగాంధి అవతారపురుషుడే కాని మాలవ్యా శివుని అవతారం. వీరిద్దరూ లోకసంగ్రహణానికి అవసరం, అని ఆయన వాదించుకుంటాడు; ఇతరులతో వాదిస్తాడు. శారదాశాసనం వలదని వాదించాడు. వచ్చినవెనక చాలా బాగుందన్నాడు. హిందూమహమ్మదీయసమన్వయం కూడదన్నాడు. కాని రాను రాను మహాత్మజీని బాగా అర్థం చేసుకున్నాడు.

ఇంతకూ ఆయనకు ఉత్తరరాష్ట్రాల బ్రాహ్మణులే నిజమైన ఆర్యఋషిసంజనితులనీ, దక్షిణాది పంచద్రావిడులు, ఎవరో తురేనియన్ జాతులలోనుండి ఉద్భవించి ఉంటారనీ నిశ్చితమైన సిద్ధాంతసూత్రం! అందుకనే చతుర్వేది తన పంక్తిలో ఎప్పుడూ భోజనం చేయడం ఆయనకు ఇష్టంలేదు. త్రిపాఠి ఆంగ్లదేశాది పాశ్చాత్యదేశాలలో సంచరించి రావడం వల్ల అతడూ తన పంక్తికి బాహ్యుడే. అతని భార్య, తన పెద్దకూతురు జ్యోతిర్మయీ అంతే! ఒక్క ఆనందమయిమాత్రం తన ప్రక్కను కూర్చుని భోజనం చేయవచ్చును.

ఒకరోజు రాత్రి త్రివేదీగారి భవనంలోని హాలులో నవజవాన్లము మేము నల్వురమూ కూర్చుండి హోరాహోరి వాదించుకుంటూఉంటే త్రిపాఠీగారు అక్కడకు వచ్చి ఒక ఆసనం అధివసించినాడు. యువతీయువకులమైన మేము నల్వురం మౌనం తాల్చినాము. ఆయన నవ్వుతూ ఆనందమయివంక చూచి "బేటీ! ఏమిటి మీరు వాదించే విషయం?" అని ప్రశ్నించాడు. ఆనందమయిని ఆయన గాఢంగా ప్రేమించాడు. అలా అని జ్యోతిర్మయి అంటే తక్కువప్రేమ కాదు. బ్రూటసు చెప్పినట్లు అతడు "సీజరును తక్కువప్రేమించుట లేదు; రోము అంటే ఎక్కువప్రేమ."

ఆనందమయి: దాదాజీ! చతుర్వేదిగారంటారు: దక్షిణాదిబ్రాహ్మణులు అసలైన ఆర్యఋషిసంతతివారని. అక్క ఉత్తరాదిపంచగౌడులే సిసలైనవారంటుంది.

త్రివేది: నీవాదన?

ఆనం: నేను విద్యార్థినిని; అందుకని వాదనలన్నీ విని నా అభిప్రాయం నిశ్చయం చేసుకుందామని అనుకున్నాను.

జ్యోతిర్మయి: దాదాజీ చతుర్వేదిగారంటారు: రామాయణకాలంలో దక్షిణాదికి వలసవెళ్ళి, మహర్షులు ఆశ్రమాలు స్థాపించినారని సిద్ధాంతం ఉందిగదా! ఆ ఋషుల సంతతిలో తాము ఉద్భవించినారట. ఇక్కడ ఉత్తరాదిశకులు, హూణులు, పహ్లవులు తండాలు తండాలుగా వచ్చి ఆర్యులలో కలిసిపోయారట. వారిలో కొందరు క్షత్రియులైనారట; కొందరు బ్రాహ్మణులైనారట!

త్రివేది: నీ అభిప్రాయం సుప్రియా?

త్రిపాఠి: ఆవాదనా ఈవాదనా రెండూ శుద్ధ నిష్ప్రయోజనాలే. చరిత్రాత్మకంగా నిజం గ్రహించలేము. కట్టి అంచనాలు, ఊహాగానాలు చారిత్రికసత్యం కాజాలవు. మన పంచగౌడులలో కాశ్మీరులు, బెంగాలీలు, ఓఢ్రులు, సారస్వతులు, మత్స్యభుక్కులు మాంసభుక్కులు. మైథిలులు, ఘూర్జరులూమాత్రం

శాకాహారులుకదా. పంచద్రావిడులైన ఆంధ్రులు, కన్నడులు, తమిళులు, మహారాష్ట్రులు, మలయాళ వంబూద్రీలు-అందరూ శాకాహారులే.

త్రివేది: చతుర్వేదిగారూ, మీ సిద్ధాంతం అంతా పూర్తిగా చెప్పండి.

చతు: దక్షిణాదిని ఋష్యాశ్రమాలు రామాయణకాలంలో బాగా వెలిశాయి. అప్పటికి ఆర్యావర్తమైన ఉత్తరాది అంతా జనకీర్ణమైన గ్రామాలతో పట్టణాలతో నిండిపోయింది. కాబట్టి ఆర్య ఋషులు ఆశ్రమాలు హిమాచలంలోనన్నా నిర్మించుకోవాలి, లేదా దండకారణ్యంలో నిర్మించుకోవాలి.

జ్యోతి: అయితే అప్పటి ఋషులకు దండకారణ్యం అపవిత్రమూ, నివాసయోగ్యతారహితమూ అయిన ప్రదేశమని భావం ఉందికాదా అండి.

చతు: ఆర్యావర్తం ఎందుకు పవిత్రమైనది? ఆర్యఋషులు వర్తించడంవల్ల, యజ్ఞయాగాది పవిత్ర కర్మలు జరపడంవల్లా, తద్వారా ఆ ప్రదేశాలకు దేవతలు దిగిరావడంవల్ల కదా!

త్రివేది: అవును.

చతు: అయినప్పుడు వింధ్య దాటి శరభంగుడు, మతంగుడు, ఇంకా అనేకులు దండకారణ్యానికి పోయి ఆశ్రమాలు ఎందుకు నిర్మించుకొన్నారు? ఆ ప్రదేశం కూడా తమ యజ్ఞయాగాదులచే పవిత్రం చేయాలని కదా! కాని అప్పటి రాక్షసులైన నీగ్రోజాతి ఆదివి మనుష్యులు ఆ ఆశ్రమాలను నాశనం చేస్తూవుంటే వాటిని కాపాడేందుకు శ్రీ రామచంద్రుడు రావలసి వచ్చింది. రాక్షసులను నాశనంచేసి ఆశ్రమాలు సుస్థిరం చేశాడు శ్రీ రామమూర్తి.

ఎవరు లొంగుతారు! పూర్వకాలంలో వాదనలో ఓడిపోతే తమ మార్గం మార్చుకునేవారని చరిత్ర చెబుతుంది. ఈనాడు న్యాయంగా వాదించుకోడాలు. అవతల వారిని ఓడింపచటడానికే వాదన. అలాని తెలుసుకోవాలని వచ్చి ఆ విషయం అర్థమయ్యే వరకూ పిడుగులా వాదించి, ఆ వెనక తమకు నచ్చితే ఆ వాదన ఒప్పుకునేవారూ ఉన్నారు.

౬

ఇంత వాదనలలోనూ ఆనందమయి మాట్లాడకుండా కూర్చుండి, ఎవరు మాట్లాడుతూవుంటే, వారిని తీక్షణంగా గమనిస్తూన్నది.

ఆనందమయి జ్యోతిర్మయీ దేవికన్న చాలా అరేదమైన అమ్మాయి. జ్యోతిర్మయే చాలా చక్కని బాలిక. ఇద్దరు అక్కచెల్లెళ్లూ సరస్వతీ, శారదలు. ఒకరికన్న ఒకరు అందంగా కనబడతారు. జ్యోతిర్మయికన్న ఆనందమయి ఒక ఛాయ ఎక్కువ. జ్యోతిర్మయి పూర్ణిమముందు చతుర్దశినాటి వెన్నెలైతే ఆనందమయి పూర్ణిమాజ్యోత్స్న. ఎంతో జాగ్రత్తగా గమనిస్తే గాని ఈ భేదా తెలియదు. ఇద్దరూ వికసించిన దేహసౌష్ఠవం కలవారు. ఆనందమయికన్న జ్యోతిర్మయి రెండేళ్లు పెద్ద. ఆ భేదా మాత్రం వాళ్లిద్దరిలో కనిపిస్తుంది.

ఇద్దరివీ సమనాసికలు. ఇద్దరివి విశాలమైన కళ్లు. కాని జ్యోతిర్మయి పెదవులు కొంచెం పెద్దవి. ఆనందమయి పెదవులు సమంగా ఉంటాయి. జ్యోతిర్మయి పెదవుల అంచులు నవ్వుతున్నట్లు పైకి తిరిగి ఉంటాయి. ఆనందమయి పెదవుల అంచులు సమరేఖాంచలములై ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లుంటాయి.

నాకు కళలలో ఏమీ ప్రజ్ఞ లేదు. నేను సంగీతం పాడలేను; బొమ్మలు వేయలేను; పాటలూ పద్యాలూ సృష్టించలేను. కాని నవలలన్నా, నవలలకన్న, నాటకాలన్నా, నాటకాలకన్న, కథానికలన్నా, కథానికలకన్న, పాటలన్నా, పాటలకన్న పూర్వకవుల కవిత్వమంటేనూ, మహాఇష్టం. నా చిన్న లైబ్రరీలో ఎన్నో తెలుగు ప్రబంధాలు, భారతసంపుట భాగాలు, పోతనామాత్యుని భాగవతమూ, ఉన్నాయి.

జ్యోతిర్మయి, ఉత్తరాది బాణీ సంగీతంలో మేటికు రాలు; కథకనృత్యంలో మంచి ప్రజ్ఞావంతురాలు. ఆనందమయికి బొమ్మలంటే ఇష్టం. ఆవిడ స్వంత గ్రంథాలయంలో భారతీయచిత్రలేఖనాన్ని గూర్చి, శిల్పాన్ని గూర్చి, వాటి ఆలయాలనుగూర్చి ఎన్నో గ్రంథాలున్నాయి. ఆమె సంగీతం పాడుతుంది. కాని

శాస్త్రంగా నేర్చుకోలేను. అక్కగారు కథకళివిధాన నృత్యం నేర్చుకుంటూ ఉన్నప్పుడు తానూ కొన్ని కరణాలు అలవరచుకొన్నది.

ఆనాడు బ్రాహ్మణత్వాన్ని గూర్చి అలా వాదించుకొంటూ ఉంటే, దక్షిణాపథదేశాల బ్రాహ్మణేతర బ్రాహ్మణప్రశ్నను వాదనలోనికి తీసుకువచ్చి జ్యోతిర్మయి "ఒకవేళ మీ తమిళసోదరులు కొందరు వాదించినరీతి దక్షిణాదిబ్రాహ్మణులు ఆర్యబ్రాహ్మణులైతే అయిఉండవచ్చును.

నేను: నేను ఆ వాదనూ ఒప్పుకోను. దక్షిణాది బ్రాహ్మణేతరులలో అనేకులు ఆర్యులే. మా రెడ్లూ, కమ్మవారూ, రాజులూ బలిజలూ ఒకనాడు బ్రాహ్మణులే. బౌద్ధమతజైనమతసంఘాతంవల్ల బ్రాహ్మణత్వం కోలుపోయి సచ్ఛూద్రు లయ్యారు. అలాగే దక్షిణాది వెల్లాలులూ అంతే. కూర్గువారిలో చాలామంది అంతే!

త్రిపాఠి: ఇంతకూ ఈ వాదన ఏమి తేల్చినట్లు. నేడు మనకు కావలసినది, బలవంతమైన భారతము. అజేయమైన భారతము. మతాలూ, కులాలూ అన్నీ ఏకమైపోవాలి.

త్రివేది: హరహరా, ఇన్నియుగాలనుండీ హిమాలయంకన్న శాశ్వతంగా నిలిచిన సనాతనధర్మం నాశనమైపోవలసిందే?

నేను: నిజం మీరు చెప్పింది! ఆ ధర్మాన్ని ఎవరు నాశనం చేయగలరు?

త్రిపాఠి: అసలు ధర్మం మంటగలిసినా, సనాతనధర్మంమాత్రం ఎందుకు నిలవాలి దాదాజీ?

త్రివేది: సనాతనధర్మమే అసలు ధర్మం!

త్రిపాఠి: మానవధర్మం అంటూ వేరే లేదూ? ఈ కులాలు, ఈ మతాలు, ఈ భారతదేశం, ఈ ఋషిప్రోక్తమూ ఇదేనా మానవధర్మం?

నేను: సర్వకాలాలకు సర్వదేశాలకు సత్యమైన ధర్మమేదో అదే ఋషులకు తపస్సులో దర్శనమిచ్చింది. కాని ఆ ధర్మం వేదంలోనూ, ఉపనిషత్తులలోనూ వ్యక్తం అయిఉంది. తక్కిన ధర్మశాస్త్రాలు కాలానుబద్ధాలు. అదీ మా రాధాకృష్ణపండితులు తెలిపింది.

ఆనంద: వారి పుస్తకం నాకు చదివివినిపించి అర్థం చెప్పరూ చతుర్వేదిగారూ?

జ్యోతి: సైన్సుచదువు త్రివేణీలో సంగమించాలా?

త్రివేది: ఏమో చతుర్వేదిగారు అన్న మాటా నాకు నచ్చలేదు. ధర్మశాస్త్రాలే వేదోపనిషత్తుల భాష్యాలు.

త్రిపాఠి: అంటే నంటారా దాదాజీ! మీరు పేరుపొందిన అడ్వకేట్లు. ధర్మశాస్త్రాలను లా పుస్తకాలలోనికి దింపినవారిలో దిట్టమైన ఒకరు. ధర్మశాస్త్రాలు కాలానుసరణంగా మారలే దంటారా?

త్రివేది: మారినాయి. కాని మూలధర్మం ఇంతైనా మారలేదు.


త్రిపాఠి: కులాలూ మతాలూ కలిసిపోతే మూలధర్మమైన బ్రహ్మపదార్థం మారుతుందా?

ఈ వాదన అంతటితో ఆగిపోయింది. హాలు గడియారం సంగీతంలా పదకొండుగంటలు కొట్టింది. "ఇంక పడుకోండి; చాలా ప్రొద్దుపోయింది." అంటూ త్రివేదీగారు లేచినారు. అందరం లేచినాము, ఎవరి గదులలోనికి వారు వెళ్లడానికి. "మూలధర్మం అనేది బ్రహ్మపదార్థం కాదనుకుంటాను. జీవితాన్నీ ఆధ్యాత్మికసత్యాన్నీ సమన్వయం చేయడంలో ఉద్భవించిన పరపడిరాయే, మూలధర్మం అవుతుం దనుకుంటాను. అదే భారతీయసంస్కృతి. ఆ సంస్కృతి దేశంఅంతా నిండి ఉందని నా నమ్మకం!" అన్నాను.

త్రివేదిగారు మేడమెట్లు ఎక్కబోతూ, "ఒకే సంస్కృతి భారతం అంతా నిండిఉందని నేననుకోను. దక్షిణభారతసంస్కృతికీ, ఉత్తరభారతసంస్కృతికీ చాలా తేడా ఉంది" అన్నారు.

"ఆ రెండూ ఒకే మహాసంస్కృతికి కవలపిల్లలాంటివి కావా అంకుల్?"

"తరువాత మాట్లాడవచ్చులెండి" అని అంటూ ఆయన మేడమెట్లెక్కి వెళ్ళిపోయారు. ఆయన వెళ్ళిపోతూ ఉంటే మేమందరం వారికి నమస్కారాలు చేసినాము.



ఊ రి మ ధ్య

చిత్రకారుడు: శ్రీ జి.వి. సుబ్బారావు, శాంతినికేతన్.

ఉత్తరరామచరిత్ర

•

శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి

కవికర్మ కావ్యము. సర్వమానవ సాధారణముగా నానందము కలిగించుచు జీవించియుండునది జీవత్కావ్యము. కవి యెవఁడు? "స్వాదము నాకర్షించు భావములతోడి ధర్మతత్త్వమును దర్శించినవాఁడు కవి, అతఁడు ఋషి; మంత్రద్రష్ట; వైదికకవి. అట్టి ధర్మతత్త్వమును దర్శించి, స్వాదు మధుర పావనములైన నిజ వాక్కుల వర్ణించినవాఁడు లౌకికకవి. ధర్మతత్త్వ ప్రఖ్యాన రూపమగు దర్శనమును, తద్వర్ణనమును లౌకికకవితకు ప్రధానములు. వాల్మీకి మహర్షి దర్శన మెంతటి స్వచ్ఛమైనదైనను తద్వర్ణనము వెలయు వఱకును లోకములో కవిత పుట్టలేదు." అని భట్టతౌతుఁడు కవిదర్శన వర్ణన శబ్దములను నిర్వచించి, వాల్మీకి నాదికవిగాను, రామాయణము నాదికావ్యముగాను తెలియఁజేసియున్నాఁడు. ఈ లక్షణము పట్టిన యే లౌకికకావ్యము శాశ్వతముగా జీవించియుండునో, అది జీవత్కావ్యమని నిర్ణయింతము.

భరతఖండమున మొదటినుండియు నక్షరాస్యత కొలఁదిగానే యున్నది గాని, లోకానుగ్రహ కాంక్షులగు ఋషులు వేదోక్త ధర్మములు బోధించుచు వచ్చుటయు, పౌరాణికు లితిహాసగాథలు వినిపించుచు వచ్చుటయు కారణములుగా చదువుకోనివారు కూడా కొందఱు కొందఱు ధర్మతత్త్వ మాస్వాదించుచు వచ్చిరనుట కనేకకథలు గలవు. అది యట్లు సాగుచుండ, దేశమున విజ్ఞానము పెంపొందించు భావముతో పాఠ్య కావ్యములును, విన్నవానికంటెను చదివినవానికంటెను కంటితో చూచిన విషయము మెక్కువగా మనస్సున నాటుకొను నన్న తలంపుతో దృశ్యకావ్యములు నుదయింపఁజొచ్చినవి. మనకిప్పటికి తెలిసినంతలో నట్టి రూపక సృష్టికాద్యుఁడు భాసమహాకవి యందము.

సంస్కృతములో నట్లుదయించిన వివిధకావ్యములు కొన్ని వేలు. అందు వినవచ్చునవి, మఱుగుపడినవి గాక, కనవచ్చువానిలో—

"ప్రజ్ఞా నవనవోన్మేషశాలినీ ప్రతిభా మతా,
తదనుప్రాణనా జీవద్వర్ణనా నిపుణః కవిః, తస్య కర్మ స్మృతం కావ్యమ్"

అను లక్షణము పట్టిన ప్రతిభామూర్తులగు కవు లెందఱో, అట్టి వర్ణనముతోడి జీవత్కావ్యము లెన్నో పాఠకులే యెఱుఁగుదురు. నే నిపుడు సంస్కృత కవి జీవితము ప్రకటించుచుండుట కారణముగా నట్టివానిలో కొన్ని దృశ్యకావ్యములను కొంచెము విపులముగా పరామర్శించి, వాని యుత్తమత్వమును యథాశక్తి తెలుపఁగోరుటయే యీ వ్యాసముల ముఖ్యోద్దేశము. ఇందుకు ముందుగా కాలక్రమము పాటింపక, ఉత్తర రామచరిత్ర గ్రహింతము.

ఉ త్త ర రా మ చ రి త్ర

వస్తువు :—జనాపవాదమును బట్టి శ్రీరాముఁడు సీత నడవిలో విడువఁబంపుట - ఆమె యచ్చట కొడుకులను గనుట - వారు వాల్మీకి యాశ్రమమున పెరుగుట - శంబూకవధ - అశ్వమేధ మను నంశముల నిది యుత్తర కాండనుండి గ్రహించుటచే నీ పేరు గాంచినది. తక్కిన కథాంశము లన్నియు, కవి ప్రతిభా కల్పితము లగుటచే వస్తువు మిశ్ర మనబడినది. ఆ కల్పితములు కొన్ని రూపకములలోవలె విఖ్యాత వృత్తమునకు విరుద్ధములు గావు సరిగదా, ఉత్తరకాండ నటుంచి, ఈ యుత్తర రామచరిత్రయే నిజమైన శ్రీరాముని యుత్తర చరిత మనిపించునంతగా స్వభావసిద్ధములు, సహృదయ

హృదయంగమములు నై యలరుచున్నవి. క్రమముగా పరిశీలింతము.

ప్రస్తావన :— తత్పూర్వ నాటకముల ప్రస్తావనలే స్వతంత్రములు. వాటిని మించిన దిది—సూత్రధారుడు రంగస్థలమున బ్రవేశించి, యుత్తర రామచరిత మభినయించుచున్నామని యొక్క మాటచెప్పి, వెంటనే అయోధ్యలో రాముని పట్టాభిషేకసమయమం దున్నవాడుగా మాఱి, నటునితో తాత్కాలికోదంతమును గూర్చి మాటాడును. తొలిసారి తెర యెత్తినంతనే ప్రేక్షకుల దృష్టిని కథలోనికి గొనిపోవు నీ రీతి యత్యపూర్వము. ప్రస్తావనానంతరము విష్కంభ పాత్రలు ప్రవేశించి, పాత మప్పగించు పద్ధతిపై గీటుపెట్టిన యీ రీతి, లక్షణమునకు లక్షణముకాని, లక్షణాతిక్రమణము కాజాలదని యభిజ్ఞులు తలంతురు. ఈ యిరువురి ప్రసంగము మాత్రము దీర్ఘమా? అంతా కలిసి నాలుగు మాటలు. అది తత్సమయోచితముగా, కథాసంవిధాన సూచకముగా, రాముని యాత్మబంధువులు, గురువులు నయోధ్య విడిచి వెళ్లుట నిరూపించి, అపుడు ప్రజలలో నలముకొనుచున్న సీతావిషయకాపవాదమును నిరసించి, సామాజికుల హృదయమందలి కరుణమును మెల్లగా కదల్చి యూరకున్నది. రంగప్రసాధనము, కావ్యార్థసూచనము, విష్కంభప్రతిరూపకము నైన యీ ప్రస్తావన నేమని నుతింతును! ఇది చూచుటకు సూత్రప్రాయము. పర్యాలోచనకు భాష్యప్రాయము.

కథారంభము:— ఈ నాటకములోని ప్రధాన రసము కరుణ మని కవి ముందే తెల్పె నన్నట్లు— "దేవ్యాస్తతో విమనసః పరిసాంత్వనాయ, ధర్మాసనా ద్విశతి రాజగృహం నరేంద్రః"

అను సూత్రధారసూచనతో, దుఃఖితచిత్తయగు జానకి నూఱడించుచున్న రాముడు ప్రవేశించును. అంతలో ఋష్యశృంగాశ్రమమునుండి వచ్చిన యష్టావక్ర మహర్షి ప్రవేశించి, అరుంధతీ వసిష్ఠాదుల సందేశములు వినిపించును. అవి పెద్దలు పిన్నల కుపదేశించు హితవచనములుగా పైకి కనవచ్చును గాని, కథాపక్షమం దవి యన్నియు భావగంభీరములు. అందు, వసిష్ఠుని యాశీర్వచనము, తమకు తప్పక పుత్రసంతానము కలుగునని యపుడు సీతారాములు విశ్వసించి సంతోషించుటకును, కుశలవులు సీతకు జన్మించినవారే యని తరువాత మున్యాశ్రమములో రాము డూహించుటకును మూలమైనది—సీతకు గర్భవాంఛ లేవేని కలిగెనేని వెంటనే తీర్పుమన్న యరుంధత్యాదుల సందేశము లోకసాధారణముగా కనవచ్చును గాని, యదియే దేవి గంగాతీరవిహారవాంఛను దీర్పరాముని కూత యిచ్చినది. మఱియు, జనాపవాదము - బట్టి తన్ను భర్త యడవికి పంపుచున్నాడని సీత యనుకొనకుండుటకు తగిన నెపముగా పరిణమించినది. సీత యిట్టి కోర్కె కోరునని కౌసల్యాదు లూహించి రనుట కవకాశ మింతేని కలదా? ఇక—

"యుక్తః ప్రజానా మనురంజనే స్యాః,
స్వస్మాద్యశో యత్పరమం ధనం వః"
ప్రజల రంజింపగా సిద్ధపడుము మీకు,
తనవుకంటెను కీర్తి యుత్తమధనంబు—

అనుచు, రాముని రాజ్యారంభసమయమున దేశాంతరమం దుండవలసివచ్చుటచే తండ్రివంటివాడు గావున వసిష్ఠుడు సందేశమంపెను గాని, ప్రజానురంజనమునకై సీతనే విడువవలసివచ్చునని యూహించి కబురంపెనా? అసలీ జనాపవాద మతడు విన్నాడా?- కాని, ఈవార్త వచ్చునప్పటికి జనాపవాదము మాట లేకున్నను, లోకారాధనతత్పరుడగు రాముడు—

"స్నేహం దయాంచ సౌఖ్యంచ
యదివా జానకీ మపి
ఆరాధనాయ లోకస్య
ముంచతో నాస్తి మే వ్యథా"

ప్రజల యారాధనంబె నా ప్రాణపదము,
దానికై స్నేహమును గాని దయను గాని
సౌఖ్యమును గాని, తుదకు నీ జనకతనయ
గాని విడిచెద బాధ యించేని లేక—

అనుచు తన జనరంజనసంసిద్ధత నావిష్కరించి, 'ఆర్యపుత్రుడు రఘువంశశ్రేష్ఠు' డన్న సీతమెప్పు నొందెను. అట్టి యీ వార్త, సీతను విడుచుసమయ

మందు "సంప్రత్యేవ సందిష్టం భగవతా వసిష్ఠేన" అనుచు తన నిశ్చయమును రాముడు బలపఱచుకొనుటయును, అతడు గావించిన సీతాపరిత్యాగము గురుజనాభిప్రాయమున కనుగుణమైన దనుటయును, తరువాత రాముని చర్యను సీత నిరసింపకుండుటయును కారణమైనది-కథ కాయువుపట్టయిన నిగూఢభావము నీ కృతార్థరంభకల్పనము భవభూతిప్రతిభకు ప్రథమోదాహరణము - ఇంక,

చిత్రప్రదర్శన రంగము :-రమ్యనిర్మాణ దక్షుడగు భవభూతి ప్రేక్షకుల హృదయము దృశ్యమయము గావింప నిందు కల్పించిన యపూర్వరంగములలో నిది మొదటిది. తండ్రి యెడబాటునకు విచారించు జానకి కుత్సాహము గలిగింప నా చిత్రశ్రేణి వ్రాయించితి నని లక్ష్మణునితో రాముడన్నమాట యథార్థము, తక్కనుమోదితము నగును గాని, సామాజికులకు ముందుగా నిసుమంతయు నూహింప నలవిగాక, యుత్కంఠ పుట్టించు చిత్ర విచిత్రాంశము లెన్నో యిందిమిడియుండుటం బట్టి యిది బహుప్రయోజనము కథాధిష్ఠానము నగుచున్నది. ద్వితీయాద్యంకము లందును, అంతర్నాటకమైన సప్తమాంకమందును దీని ప్రభావము గోచరించును — వాల్మీకి రామాయణము మొదటి మూడు కాండలలోని కొన్ని ఘట్టములు మాత్రమే యందు చిత్రింపబడినవి. వానిలో సీత యెఱిగినవి కొన్ని, యెఱుగనివి కొన్ని. అన్నియు నాయికానాయకుల గాఢానురాగమును విశదీకరించునవే— 'ఆలేఖ్య మెంతవఱకయిన'దని యడిగి 'పూజ్యురాలి హుతాశనశుద్ధి వఱకు'నన్న సౌమిత్రి జవాబు విని, రాముడు ఖిన్నుడై 'దేవీ! తప్పుమాట, క్షమించు మనుగ్రహించు' మనుచు బ్రతిమాలుట యామెపై నతనికి గల యనురాగాతిశయమునే కాదు, గౌరవాతిశయము నావిష్కరించుచు, సీతాపరిత్యాగమున రాముడు దోషి గాడని తోపింపజేయుచున్నవి. అందు—ఉత్పత్తి పరిపూతాయాః, క్లిష్టో జనః కిల జనైః-అను పద్యములు—

"దేవీ దేవయజనసంభవా! అనుగ్రహింపుము.

"జననంబున పావన యగు,
జనకుని కన్నియవు వేఱె చను నీ శుద్ధుల్
"దుఃఖితుల లాలనంబు బంధువుల ధర్మ,
మట్టి చో నిన్ను శెడ్డమాటంటి మకట!
పువ్వు తలలో ధరించుట పోవను గాని
కాలితో ద్రొక్కి నల్పుట పోలు నొక్కొ ?"

చిత్తరువు సమీపించినంతనే ముందు సీతకు కనవచ్చినవి జృంభకాస్త్రములు. రాముడు వాటి యుదంతము తెల్పి "ఇవి నీ సంతానము నాశ్రయింప గల"వని వరమిచ్చును. కొడుకో లేక కొడుకులో పుట్టి పెరిగినతరువాత స్వయముగా వారి కుపదేశింప వచ్చునుగదా! ముందుగా నీ యభ్యనుజ్ఞ యెందుకు? తన కొడుకులు జృంభకాస్త్రసంపన్ను లగుదు రని ముందే సీత యానందించుటకు. ఇందలి యాంతర కారణమో, "స్వయముగా నీ కొడుకుల కీ యస్త్రము లుపదేశించు భాగ్యము నీకు పట్టదు. ఇపుడే యిచ్చివేయు"మన్న దైవప్రేరణము. దీని కంతకు ఫలము, గంగాతీరమున జన్మించినంతనే కుశలవుల కీ యస్త్రము లధీనములగుట, తరువాత మున్యాశ్రమములో కుశలవుల యస్త్రలాభము విని రాముడు తా నిచ్చిన యభ్యనుజ్ఞను స్మరించి, వారు సీత కచ్చట పుట్టినవారే యని నిశ్చయించుకొనుట. ఇంత నిగూఢార్థమైనది యస్త్రప్రసంగము-తరువాతి మిథిలాయోధ్యా వృత్తాంత చిత్రముల ప్రయోజనము, ఆనాటి తమ యనురాగమును సౌఖ్యమును సీతారాములు స్మరించుకొని యానందించుటయు, అంతటి ప్రాణవల్లభుడు తన్ను విడుచుట దుర్దైవ మూలకమే యని యుత్తరత్ర సీత యనుకొనుటయు-

పిదప, భాగీరథీచిత్రమును చూచి సీత నను స్మరించుటయు, నీ కోడలగు సీతకు మేలు కోరుచుండు మని రాము డర్థించుటయు దేవతావిగ్రహసందర్శనమందలి చర్యలవంటివే. అయినా, యీ ప్రార్థనము, గంగాదేవి, సీతను ప్రసవసమయమందు రక్షింప సాధనమైనది—అంకాంతమందలి వసుమతీప్రార్థనము నిట్టిదే—అనంతరము వైదేహీ చిత్రకూటమార్గమందలి పటవృక్షమును ప్రస్రవణాద్రిని సాక్షాత్తుగా చూచు

నపు డామెతో రాముడన్నమాటలు ముద్దగట్టిన వారి యనురాగరసమును ప్రేక్షకుల కంటఁ బెట్టునవిగా నున్నవి. వాటిలో "అలస లలిత ముగ్ధాని—స్మరసి సుతను తస్మిన్—కిమపి కిమపి మందం మందం—అను సుప్రసిద్ధ శ్లోకముల యనువాదము లివి—

"కమలిన తూడ్పులట్లు నడ
కన్ గడు గంది వకేంబు తప్పి స
త్త్వము చెడియున్ సుతింత లలి
తంబులుగా గనవచ్చు నీదు నం
గముల యలంత గొంతి విగి
కౌగిలిన్ శమియింప గేల సై
నిమిరెదు నా యురంబుపయి
నిద్దురవోయిన చోటిదే కదా!

"తలతువె లక్ష్మణుండు బహుధా
పరిచర్యలు చేయ దానిపై
వలరుచు నున్న యా దివము?
లాపరసోదక గౌతమీనదిన్
దలతువె! దాని చెంత బలి
నంబులముచ్చట లాడుచున్కి యున్
దలతువె! నాటి వర్తన మె
దం దలతే లలితాంగి జానకీ?

"ఒక్కొక బాహుతోడ నొడ
లుబ్బగ బిగ్గ గవుంగిలించి నె
న్నెక్కొను లోక్కవై కదియ
నెమ్మదిగా మన మేమియేమికో
మక్కువ నీలాల మాటపయి
మాటగ ముచ్చట లాడుకొంచు ను
న్నక్కడి నాటిరాత్రి నలు
యామములంతెనె యంతరింపవే!

అక్కడ చిత్రములలో జనస్థానవృత్తాంత మెక్కువ. తన వియోగమున రాము డపుడు శోకించిన విధమును సీత కన్నార గాంచి దుఃఖించి 'దేవా! నా మూలమున నీ వింత కష్టపడితివా?' అనుటయు, భావి వియోగమునం దతని హృదయ మామె శంకింప నుండుటయు, వాటి ప్రయోజనము. ఈ సందర్భమం దొక్క విశేషాంశము కనుగొందము.

జనస్థానమున సీతాపహరణము జరిగి నాటికి సుమారొక్క సంవత్సర మైనది. అపుడు రాముడు వియోగదుఃఖమూర్తియై తన్నుదా మఱచి వెఱ్ఱియై అట్లు చెట్లను తీగలను పక్షులను మృగములను జూచి 'నా సీతను చూచితివా?' యని యడుగుచు ఘోరముగా విలపించినవిధము రామాయణము నరణ్యకాండమున మూడు సర్గలలో వర్ణింపబడినది. అపు డన్నగారి దుఃఖమునకు ప్రత్యక్షసాక్షియైన లక్ష్మణుడే యీ చిత్తరువులోని సీతాపహరణవృత్తాంతము చూపి నాటి రాముని విలాపమును సంగ్రహించి యొక్కమాటలో నిం దిట్లు తెల్పుచున్నాడు—

"అథేదం రక్షోభిః కనకహరిణచ్ఛద్మవిధినా,
తథా వృత్తం పాపై ర్వ్యథయతి యథా క్షాళిత మపి,
జనస్థానే శూన్యే వికలకరణై రార్యచరితై
రపి గ్రావా రోదిత్యపి దళతి వజ్రస్య హృదయం"
వనరుచు నున్న యార్యునుర
వస్థకు వజ్రముగుండె వ్రయ్యన
ట్లుమ శిల లేడ్చునట్లును ఖ
లుల్ వశియించిన యంత నివ్వనిన్
కనకమృగంబుమాలముగ
గల్గిన దీపని, దీని మేము వెం
టనె యణగించినన్ కటక
టం బడు నేటికి నంతరంగముల్—

అచిరకాలమున పరిహరించుకొనగలిగిన యీ వియోగమునకే యట్లు పరితపించిన తన నాథుడీయపార విరహవ్యథ నెట్లు భరించుచుండెనో యని తరువాత సీత తలచుకొనట కిది కల్పితమనుట స్పష్టము. దాని నుండనిందు—ఈ పైశ్లోకము చదివి పరవశుడైన గోవర్ధనాచార్యుడన్నమాట లివి.

"భవభూతే స్సంబంధా ద్భూధరభూరేవ భారతీ భాతి
అథవా కృతకారుణ్యే కిమన్యథా రోదితి గ్రావా?"

అస లిది గత వృత్తాంతము గాని వర్తమానము కాదు. రాముని దుఃఖము పుట్టినచోటు సత్యమైన జన

స్థానముగాని, యీ చిత్రకల్పితము కాదు. అది వాల్మీకికి సంబంధించినదిగాని భవభూతికి సంబంధించినది కాదు. అట్టియెడ "భవభూతేః సంబంధాత్" అనుచు గోవర్ధనుడు ప్రశంసించుట సముచితమా? కాకేమి? కవి వశమున నీ చిత్రజనస్థానమే యీ సత్యజనస్థానమైన దని లక్ష్మణుడు, 'ఇదమ్' అనుచు సీతాహరణము వేలు పెట్టి చూపుటయే చెప్పుచున్నది. ఇక రాముని దుఃఖమును విశదీకరించు నీ భవభూతి లక్ష్మణుడును దీనిని కన్నారగాంచిన వాల్మీకి లక్ష్మణుడు నొక్కడే యనుట స్పష్టముగదా! ఇంతకును "హంత వర్తమాన ఇవమే జనస్థానవృత్తాంతః" అన్న యీ రాముడే యా రాము డగుచుండ భవభూతిసంబంధమున సర్వతభూమి భారతియైనదని గోవర్ధనుడు వర్ణించుటకు శంకింపనేల? భవభూతి గావించిన పై యద్భుతవర్ణనము విద్వల్లోకమును విస్మయమున ముంచినదన్న నాశ్చర్యమేల? ఈ వర్ణన మీ మహాశైలి కొక యుదాహరణము.

చిత్రసందర్శనమున నలసిపోయిన యీ కఠోరగర్భ నొక యేకాంతస్థలమున గూర్చుండబెట్టి తాను కూర్చుండి రాముడామె బుజమును తన మెడపై చేర్చుకొనియు, నిద్రింపగోరిన యామె తల క్రింద తన బుజము చేర్చియు—వినిశ్చేతుం శక్యః—ఆ వివాహ సమయాత్—అని యిత్యాదరముతోడి తన యానుకూల్య ముట్టిపడ నుచ్చరించెను. ఈ శ్లోకముల యనువాదము:—

"అరయంజాలను దుఃఖమో సుఖమొ మూ
ర్ఛావస్థయో నిద్రయో
గరళాశేగమొ మత్తో! నీవు నను దా
కఁ బుట్టి నా యింద్రియో
త్కరముం ద్రొక్కి మనోవికారమొక డే
కాకారమై లేచి యాం
తర చైతన్యము నంతలో గలచు నం
తం దేర్చు నేమేసఖి?

"పరిణయవేళనుండియును
బాల్యమునం దెలప్రాయమందు నం
దిరమున గాన నీకు సుఖ
నిద్రకు గారణమైనదొండు సుం
దరి నిదురింప నెన్నడును
దార్చని దీ రఘురాము బాహు వో
ధరణికుమారి సిద్ధమగు
తల్గడ నిద్దురపొమ్ము దీనిపై"

ఆమె యట్లు నిద్రించినంత రాము డనుకొన్న మాట-'ఇయం గేహే లక్ష్మీ' రిత్యాదికము—

"నా నిలయంబు లక్ష్మి, యిది
నా నయనామృత, మీమె తాకు నా
మేన వలందు చందనము,
మేలగు ముత్తెపు దండ నా మెడం
బూనిన యీ బుజంబు,
తనపు న్నను నీమెకు కెందినట్టి దే
దైవను, కాని యీమె విర
హంబు భరింప నశక్య మెంతయుఁ"

చిరకాలముగా సీతాస్పర్శసుఖ మనుభవించుచున్న రాముని కంఠలో వనిర్వచనీయమైన యట్టి వికారమావిర్భవింప హేతు వేమి? అది భావి సీతావియోగసూచన. రాబోవు నత్యుత్కటసుఖదుఃఖముల సూచనలుముందుగా మనస్సున పొడగట్టునని యనాగతజ్ఞులైన మహర్షు లనియున్నారుగదా! కాని, రాముని యీమాటలు సీత, కత్యాదరద్యోతకములే యైనవి. అందుచేతనే 'ఇదంతా విా యనుగ్రహ" మన్నది. అమాయకురాలైన యామె కా మాటలలో ప్రతికూల భావము గోచరింపకుండజేయుట కథామర్మము. దానిని పూర్తిగా నెఱిగినవాడు మానసతత్త్వవేత్తయైన యీ మహాకవి. మఱి రెండవ పద్యములోని మాటలం దుమా, అకాలములుగా ననుభవించుచున్న తమ దాంపత్యానురాగమును కడసారిగా సీత యాస్వాదించుటకును యావజ్జీవము స్మరించుటకు నద్దిష్టములు—ఇంక మూడవ పద్యము—తన సర్వస్వము సీతయేయని మురియుచున్న రాముని నోటవచ్చిన కడపటి మాట, జానకిని విడిచి యొక్క నిమిషమేని నిలువజాలనన్న యశక్తతను దెల్పుచు, దైవికమైన పునర్వియోగమును సూచించుచు కథోచిత మగుచున్నది. ఈ మాట సీత వినకుండ నిద్రలో నుండుట ప్రకరణోచితము.

జనాపవాదము :— నిద్రించుచున్న సీత చిత్ర సందర్శనసమయమందు వియోగమును స్మరించియుండుటచే కలలో "ఆర్యపుత్రా! ఎక్కడున్నావు" అని కలవరించినది. ఒక్కొక్కప్పుడు కలకూడా నిజమగునన్న యార్యోక్తిని బట్టియు, బంధుహృదయము లనిష్టమును శంకించునన్న న్యాయమునుబట్టియు, రాముడనిష్టపరిహారముగా నామెదేహము నిమురుచు, ననుకూలమైన దాంపత్యమున కన్నియెడల భద్రము గలుగుగాక యనుచు "అద్వైతం సుఖదుఃఖయోః" రిత్యాది వాక్యములు పల్కెను. అంతలో దుర్ముఖుడు ప్రవేశించి సీతావిషయకజనాపవాదమును రాముని చెవిలో చెప్పను— ఇక చెప్పెడి దేమి! పిడుగువలె ఘోర వార్త పైబడినది. సీత యొమ్మున నిద్రించుచున్నది. కుమ్ములో పెట్టినట్లు హృదయము ముడికిపోవుచున్నది. కాని, ధీరుడు వీరుడు. కొంచెమాలోచించి, దీనికి ప్రతిక్రియలేదనుకొని, ప్రజానురంజనమునకై తన్ను విడిచి తన ప్రాణాలు విడిచిన తండ్రిని స్మరించి, గురుని సందేశమును భావించి, దూరదేశమున జరిగిన యగ్నిపరీక్ష నిక్కడి జనులు నమ్మకపోవుట సహజమే యని తలచి, పరిత్యాగము నిశ్చయించుకొని, రథము తీసికొని రమ్మని సౌమిత్రికి కబురంపి, సీతకు వచ్చిన దురవస్థకు లోలోపల కుళ్లిపోవుచు విలపించిన యతని మాటలు విన్న ప్రేక్షకులు వెక్కివెక్కి యేడ్తురన్న నాశ్చర్యమేమి!— ఆదిమొదలుగా కావ్యమంతట శ్రీరామ మూర్తిని శోకమూర్తిని చేసి సామాజికులను కరుణరస సాగరమున ముంచునట్లు రచన సాగించిన భవభూతి "ఏకోరసః కరుణ ఏవ" అని నిర్ణయించినాడన్న నేమి! కరుణరసవర్ణనము ముమ్మాటికి కతని సొమ్ము. అందుచేతనే "ఉత్తరే రామచరితే భవభూతి ర్విశిష్యతే" అన్నయశః స్మృతిని వరించినది.

పుట్టినమాటా, లేనిదీ కానిదీ. వచ్చిన కష్టము తిరుగులేనిది, బ్రతికినంతకాల ముండునది. అయినా, ఉత్తమక్షత్రియుడు, లోకోత్తరుడు నగుటచే, అప్పుడే కాదు, రాజధానిలోనుండగానూ ప్రజలను పల్లెత్తు మాటన లేదు—ఎంత దిగమ్రింగుచున్నను పైకి పొంగుచుండుట దుఃఖప్రవాహము నైజము కావున—నేను శర్మచండాలుడను అస్పృశ్యుడను నిన్ను తాకదగను అనుచు సీత తలక్రింది తన బుజ మెత్తిగించుకొని, దుఃఖానుభవమునకే జన్మించితినని చింతించి, వసిష్ఠాదులను బంధుమిత్రులను మోసగించితినని లజ్జించి, ఇదే కడసారి యని జానకిపాదములకు నమస్కరించి, తాపసబాధకుడగు లవణాసురుని పీడ వినరాగా ఇదిగో శత్రుఘ్నుని పంపుచున్నాననుచు సభాస్థలికి వెడలిపోయెను. రాముని యీ పరితాపము నెఱిగినవాడొకడులేడు. జనాపవాదమున సీతాపరిత్యాగ మావశ్యకమైనదన్నమాట యప్పుడు లక్ష్మణుడు మాత్రమెఱుగును. ఇంకెవ్వరు నెఱుగరు.

పాడుకలలో భయపడి మేల్కొని రాముని గానక పరితపించుచు రథమెక్కిన సీత "ఆర్యపుత్రుడేడి" యని సౌమిత్రి నడుగలేదు. ఆ నిద్రబద్ధకములో, ప్రియుడు తన్నొక్కర్తెను విడిచి యెందుకు వెళ్లెనో యన్నయాలోచనలో తానెక్కిన రథము గంగాతీరమునకు పోవుచున్న దనుకొన్నదో లేదో! పాత్రశీలపోషణముతోడి కథాప్రవర్తనచాతురి యన నిదిగదా! ఇక్కడ నొక్కమాట:—

గంగాతీరవిహారము కోరిన సీత 'మీరు కూడా రావలెను సుమండీ' యనగా—అయి కఠినే కి మేతదపి వక్తవ్యమ్— ఓసీ కఠినురాలా! ఈ మాట చెప్పవలెనా?—అన్నాడు రాముడు. అంటే తప్పకవత్తు నన్నమాటే కదా!—కథాప్రవృత్తి రాముని గమనమును సమ్మతింపదుగదా! కవి యెందుకీ మాట యనిపించెను?— ఆ భావము కఠినురాలా! అన్న సంబోధనములో దాగియున్నది—నిన్ను విడిచి నిమిషమేని గడపజాలని నేను, నీతో రానేమో యని యనుమానించి యిట్లడుగుటచే కఠినురాలవైతివని యీ భావము. ఇట్లనుట తత్కాలమందు సీత సంతుష్టికిని, తరువాత రాముని పరిపూర్ణపావనప్రేమ నామె స్మరించుటకును—అయినా ప్రజానురంజనమే ప్రధానమైన యీ ప్రఖ్యాతకథలో అసత్యమైన యపవాదమును బట్టి పాతివ్రత్యమూర్తిని పరిత్యజించుటకంటె నీ వాగ్దానభంగ మెక్కువ యధర్మము కాదు. ఇది దానికంగమే. పరిత్యాగ మధర్మమని

రాముఁ డెఱుఁగును. తరువాత సీత యనుకొన్నది, జనకాదు లన్నారు. ఇక దీని విచార మేల?

ఇట్లు జనాపవాదమూలక సీతాపరిత్యాగమన్న నిర్జీవాంశ మొక్కటి గ్రహించి కవి తన ప్రతిభచే దర్శించిన యపూర్వమనోహరాంశముల సంగములుగా కూర్చి దానికి జీవకళ తెచ్చి దర్శనీయము గావించిన యిదిగదా జీవద్వర్ణనము! ఇక నీ కథాచమత్కృతియు కవితాచమత్కారమును సామాజికహృదయమును తదాయత్తము గావించిన విధము చూతము.

ప్రథమాంకమందువలెనే ద్వితీయాంకమందును మూలకథాంశ మొక్కటే. అది శంబూకవధ. రాముని దండకాటవికి చేర్చుట మాత్రమే దానిపని. తరువాతి విషయము దాని కనుబంధము. ఈ చిన్నయంకములో సగము విష్కంభము. అందలి తాపసీ వనదేవతల సంభాషణము చిత్రప్రదర్శనరంగములోనివే కాక యుత్తర కథాంశములు పెక్కు వెల్లడియగును. తరువాతిదంతా రామ శంబూక సంభాషణము — బ్రాహ్మణబాలుని యకాలమరణమునకు రాజదోషము కారణమని దానిని రాముఁడు తనయం దారోపించుకొనుచుండ, శంబూకుని ఘోరతప మందుకు కారణమని యశరీరవాణి పలికినది. మూలకథను బట్టి వినవచ్చిన యీ హేతు వాకాశవాణి యాదేశమున రాముఁడు శంబూకుని వధించుటకు మూలమైనది గాని, సీతాపరిత్యాగరూపమైన తన మహాదోషమే కారణ మనుకొన్న రాముని భావమును సూచించుటకే కవి యతనిచే నుం దామాట యనిపించె ననవచ్చును. విధిలేక రాముఁ డా పని చేసెనుగాని శంబూకవధ రాముని కిష్టము కాదని యతని మాటల వల్లనే యిట్లు తెలియుచున్నది.

"రామస్య గాత్రమసి! దుర్భర గర్భ ఖిన్న
సీతావివాసన పటోః కరుణా కుత స్తే?"

-పూర్ణగర్భనుపై దేహిని మోసపుచ్చి, వనికిం బంపించు, పాపిష్ఠరాముని గాత్రంబవు గావొకో! దయయు మోమోటంబు నీ కున్నదే?-

శంబూకునికి దివ్యత్వమిచ్చినందుకు మొదట సంతోషించినవాఁడు రాముడే. అతని దయకును కడచిన పదునొకండు సంవత్సరములలోను విరహాగ్ని యతని హృదయమున రగులుచునే యున్నదనుటకును పైమాట యొకటియే చాలు. శంబూకుడు చూపగా నా యరణ్య ప్రదేశములన్నియు పరికించి తొల్లి యందు నివసించిన నాటి చర్యలు తలంచి పరితపించి శంబూకునికి సెల విచ్చి పంపి, తిరిగివచ్చిన యతనివల్ల నగస్త్యుని యాదేశము విని పంచవటి చూడకుండగా ముం దమ్మునియాశ్రమమున కేగెను. ఈ యిరువురి సంభాషణము తరువాతి పంచవటీరంగమున కుపకరించినది.

అదే యీ యంకమునందలి సారాంశము. ఇక నిందలివర్ణనలందమూ, అసాధారణములు. అందొకటి రెండు— పాఠకుల కాహాపుట్టించిన యీ నాటకములోని వర్ణనలలో నీక్రింది సుజనశీలవర్ణన మొకటి: —

"ప్రియప్రాయావృత్తి
ర్వినయమధురో వాచి నియమః
ప్రకృత్యా కల్యాణీ
మతి రనవగీతః పరిచయః,
పురో వా పశ్చాద్వా
తదిద మవిపర్యాసితరసం
రహస్యం సాధూనా
మనుపధి విశుద్ధం విజయతే"

—సరసములైన మాట, లుప
చార వివేకము తోచు చేత, లా
దరణములోడి యీవి, విను
తంబగు సెయ్యము ముందువెన్కలన్
దిరుగని సుస్వభావము, వి
ధేయత నిష్కపటంపువృత్తి సు
స్థిరమతి, హౌర ! యీ సుజన
శీల రహస్య మెఱుంగ శక్యమే?"

పండితులెందరో పఠించు నిందలి శ్లోకములలో, కాలవశమున మార్పు సహజమని బోధించు నీ శ్లోక మొకటి—

"పురా యత్ర స్రోతః
పులిన మధునా తత్ర సరితాం,
విపర్యాసం యాతో
ఘనవిరళభావః క్షితిరుహాం,

బహోర్దృష్టం కాలా
 దపరమివ మన్యే వన మిదం
నివేశః శైలానాం
 తదిద మితి బుద్ధిం ద్రఢయతి"
-చూడఁగ దొంటి పల్లవల
 చోటులు మేటలు వేసె, నచ్చటం
బాడయి పల్చనయ్యె దను
 వాటిక, యిచ్చట జిక్కనయ్యె, నే
నాడిది చూచినాడనో! క
 నంబడుచుండెను వేఱె కానగా
నేడిది, కాని యీ గిరులు
 నిక్క మదే యిది యంచు దెల్పెడున్-

ఈ కథకు పట్టిన కాలము పండ్రెండు వత్సరములు. పన్నెండవయేట రాము డీకానలకు వచ్చెను. సుమారు పన్నెండేళ్ల క్రిందట రాముడు సీతతో కలసి యీ కానల నివసించియున్నాడు. అందుచే గిరుల యునికి తప్ప దక్కిన నదీతరువాటి కాదుల యునికి మాఱినవని తెలుచుచున్నాడు.

ఈ మహాకవి పాత్రసృష్టి కూడా అపూర్వమే. ద్వితీయాంకవిష్కంభపాత్రములు, తపస్వినీ, వాసంతికలు. తృతీయాంకవిష్కంభమందలివి, మురళా తమస లనెడి, నదీదేవతలు. ఇవి యుత్తమపాత్రములే యగుటచే విష్కంభము మధ్యమపాత్రప్రయోజ్యము కావలెనన్న లక్షణ మిందు పట్టదు. ప్రస్తావనాలక్షణమునకు పట్టిన గతియే దీనికిని పట్టినది. మహాకవులకు లాక్షణికులు కాపకులా?— సీతావిరహదుఃఖితుడైన రాముని చూచిన లోపాముద్ర పంచవటీదర్శనమున నతని కేమి ప్రమాదము వాటిల్లునో యని శంకించి, జాగ్రత్తగా కనిపెట్టి చూడుమని గోదావరితో చెప్పుటకు మురళను పంపినది— శంబూకవృత్తాంతము విన్న జాహ్నవియు, నట్టి పమాదమే యూహించి, కుశలవుల పన్నెండవ జన్మదినోత్సవము చేయు నెపమున సీతను వెంటబెట్టుకొని గోదావరీతీరమునకు వచ్చి యామెకు తోడుగా నుండుమని తమసను నియోగించినది.

పంచవటీరంగమే తృతీయాంకము. ఇందలి పాత్రములు వాసంతీ రాములు, సీతా తమసలు. వారు వీరికి కనపత్తురు, వారిమాటలు వినవచ్చును. వీరు వారికి కానరారు. వీరి మాటలు వినరావు. వెనుక యిచ్చోట సీతారాము లేవస్తువులు చూచి యానందించిరో యిపుడు వాటినే చూచి విచారింతురు. అపు డేయనురాగము వీరిని సుఖమున నోలలాడించెనో యిపు డదే దుఃఖాబ్ధిని ముంచెను. ఇంతయేల? ఈరంగము భవభూతి ప్రతిభకు పరమావధి. కరుణరసము పుట్టినిల్లు. రసాస్వాదనపారవశ్యమున సామాజికులను స్తంభింపజేయు నింద్రజాలము. కావ్యానందకందము. సీతారాముల తోంటి క్రీడాగారము--ఇందలి వీరి మాటలను దుఃఖావస్థలను ప్రదర్శనరంగమున వినవలసినవి చూడవలసినవి గాని, నాలుగుమాటలతో వర్ణింపదగినవి కావు. రాముని మూర్ఛనుండి తేర్చినప్పటి సీతమాటలకు నతనిమాటలకు కంట తడిపెట్టనివా రుండబోరు. వీరి హృదయావస్థలను వర్ణింప జ్ఞాననేత్రమున సందర్శించిన యీ కవికే చెల్లినది. అతనివద్ద శిక్షనందిన తమసకు చెల్లినది. ఇందు కొక యుదాహరణము— నిష్కారణముగా నన్ను విడిచిన నాప్రియు నీస్థితిలో చూచుచున్న నా హృదయావస్థ యెట్లున్నదో, ఏమి చెప్పుదునని సీత యనగా, 'అమ్మా! నే నెఱుగుదు' ననుచు తమస యిట్లు విశదీకరించినది:

తటస్థం నైరాశ్యా
 దపిచ కలుషం విప్రియవశా
ద్వియోగే దీర్ఘేఽస్మి
 న్ఝటితి ఘటనా స్తంభిత మివ,
ప్రసన్నం సౌజన్యా
 ద్దయితకరుణై ర్గాఢకరుణం
ద్రవీభూతం ప్రేమ్ణా
 తవ హృదయ మస్మిన్ క్షణ ఇవ"

ఎఱిగి యెఱుకయ న న్నడవిఁ బాపె నిత డెంత
 వంచనం బని కోపగించినట్లు,
ఆయాస లడుగంటె నా కెందు రిక నంచు
 నాస్థ మాని తటస్థ మైనయట్లు,
ఘనవియోగమున నాకస్మికఘటనచే
 బరవశింబయి ప్రానుపడినయట్లు,

సహజ సౌజన్య భాస్వరమాట బతిభక్తి
వల్కదేటి ప్రసన్నమైనయట్లు,
భర్త దుఃఖంబునకు దుఃఖపడిన యట్లు
ఘనతరం బగు ననురక్తి గరగినట్లు
పాలుపోకున్నయట్లు, నీ పట్టునందు
నీదు హృదయంబు గనవచ్చు నిర్మలాంగి!

బాహ్యావయవములను వన్నెలు చిన్నెలు పెట్టి బళీయనునట్లు వర్ణించిన కవులెందరో కలరు గాని, అరటిపండొలిచి చేతిలో పెట్టినట్లు హృదయమును విప్పి మాపెట్టిన యింకొక కవి యేడి? ఒక్కక్షణములో హృదయ మెన్ని యవస్థల పాల్పడునో చెప్పి చూప గలవా డితడే యని పైపద్యము చాటుటలేదా?

ఈ ఘట్టమంతయు సీతను తలచుకొని రాముడు గొంతెత్తి యేడ్చుటతోను రాముని చూచి సీత విలపించుటతోను పరిపడినది. ఎందుకింత దీర్ఘప్రసంగ మందుమా, కరుణారసప్రవాహము గాఢముగా ప్రేక్షకుల హృదయముల నత్తుకొనుట, రాముని ధర్మపాలనమును ఆతని విరహబాధను మనసారస్మరించి సీత యాతనిని శంకింపకుండుట, అను రెండును కావ్యపక్షమున హేతువులు—అవి యట్టివే 'నీకు కీర్తికదా యిష్టము. ఓయి కఠినుడా! ఇంతకంటె ఘోరాపకీర్తి కలుగా నుండునా' అని వాసంతి రాముని నిందించినపుడు సీత 'నీవే కఠినురాలవు క్రూరురాలవు. ఏడ్చుచున్న యార్యపుత్రు నింకా యేడ్పించుచున్నా' వనుటయే పై భావమును బలపఱచుచున్నది. అయోధ్యలో నున్నపుడు పైకి విలపింప వీలయినది కాదు, ఇపు డేడ్చుట లాభమే, యన్న, తమస మాటయు దానికి సహాయపడుచున్నది. దీనికంతకు నుదాహరణముగా రాముని యీ మాట చాలును.

"న కిల భవతాం దేవ్యాః స్థానం
గృహేఽభిమతం తతః,
తృణమివ వనే శూన్యే త్యక్తా
న చాప్యనుశోచితా,
చిరపరిచితా స్తే తే భావా
స్తథా ద్రవయన్తి మా
మిద మశరణై రద్యాప్యాభిః
ప్రసీదత రుద్యతే"

జానకి యింటనుండుట య
సమ్మత మయ్యెను మీకు గావునన్,
గాన దృణంబుమాడ్కి విడ
నాడితి, మీ కపుడైన జాలి యిం
తేనియు బుట్టెనే? మది
దహించెడు నప్పటి భావముల్, దయా
హీనుడ దిక్కు లేక యిపు
డేడ్చెద, మీర లనుగ్రహింపుడీ!

పౌరజానపదుల చర్య నిట్లుపాలంభించిన రామునితో, గతించినదానికి విచార మేల? ధైర్యము తెచ్చుకొనుమని వాసంతి యనగా, రాము డన్న యీ మాట లో లెవరికి తెలియును? ఇందుచేతనే యీ యంకము దుఃఖాంకమైనది.

జానకీశూన్యమైనట్టి జగతి కిపుడు
వఱలుచున్నది ద్వాదశవత్సరంబు,
ఆమె పేరును మాసిన ట్లయ్యెగాని
బ్రతికియున్నాడు పాపి యీ రాఘవుండు.

ఇట్లు విలపించు రాముని దృష్టి మరల్చుటకు, అది చూడు యిదిచూడు మనుచు, నొక పొదరిల్లు చూపి వాసంతి యన్న మాట లివి:—

"అస్మిన్నేవ లతాగృహే త్వ మభవ
స్త న్మార్గదత్తేక్షణః,
సా హంసైః కృతకౌతుకా చిరమభూ
ద్గోదావరీసైకతే,
ఆయాన్త్యా పరిదుర్మనాయితమివ
త్వాం వీక్ష్య బద్ధ స్తయా
కాతర్యా దరవిందకుట్మలనిభో
ముగ్ధః ప్రణామాంజలిః"

"ఈ పొదరింట నుంటివి మ
హీసుత వచ్చెడి త్రోవ చూచుచున్,
వా పెయు గౌతమీపులిన
మందలి హంసల జూచిచూచి, రా

సోపక, వచ్చి కోపపడు
చున్నటులుండిన నిన్ను జూచి, నీ
కోపము దీర్పగా జలజ
కోశనిభాంజలి యెత్తి మ్రొక్కదే?"

ఏ చిత్రకారుడేని చిత్రింపవలసిన మనోజ్ఞ భావ మిది. ఒక గంటకూడా రాముడు సీతను విడిచియుండ జాలనివాడన్న యాంతరికతత్త్వ మిందు నిరూపింప బడినది. "హృదయమర్మంబుల నాటుకొని యున్న మనశ్శల్యమును కదల్చు వృత్తాంతము స్మృతికి తెచ్చితివా! ఎంత కఠినురాలవే!" యన్న సీతమాట దానిని బలపఱచుచున్నది. "ఇటునటు కనబడుచున్నావుగాని, అనుగ్రహింపకున్నావు" అని రాముడు విలపించుట దానిని ధ్రువపఱచుచున్నది. ఈ యంకమంతయు నుల్లము నూటాడించు నిట్టి రచనతో నిండియున్న దనుట చెప్పదగిన విశేషము. ఇందు రామునికి వినబడని సీత మాటలకును, సీతకు వినిపించు రాముని మాటలకును సందర్భైక్యము కలిగించి రచన సాగించిన కవిచాతురి వర్ణనాతీతము. ఈమాట మన మనకేల? "అహో! కథానిర్మాణ మెంత యాశ్చర్యముగా నున్నది!" అని తమసయే యన్నది. ఆమెచేతనే కవి యీ క్రింది మాటలు పలికించినాడు.

"ఏకో రసః కరుణ ఏవ నిమిత్తభేదా
ద్భిన్నః పృథక్పృథగివాశ్రయతే వివర్తాన్
ఆవర్తబుద్బుద తరంగమయాన్ వికారా
నంభో యథా సలిలమేవ హి తత్సమస్తమ్"

కరుణరస మొక్కటే వేఱు కారణముల
వేఱువేఱు విధంబుల మాఱుచుండు
సలిల మొక్కటె బింగు తుషారభంగ
బుద్బుదావర్తరూపముల్ పొందునట్లు.

ఈ రంగములో కరుణరసము పొంగిపొరలినదని కవియే యనుకొన్నాడనుట కీ మాట చాలు. "సీత నే పులియో మ్రింగిన దనుట నిజ"మని వాసంతితో నముచు గొంతెత్తి యేడ్చిన రాముని చూచి, ఇప్పటి కిది నైజమే యని సమర్థించిన తమసమాట లింతకంటెను చాలును.

"పూరోత్పీడే తటాకస్య పరీవాహః ప్రతిక్రియా,
శోకక్షోభే చ హృదయం ప్రలాపైరేవ ధార్యతే"
"గట్లు కెగదాసి సలిలంబు కలచునపుడు
చెలువు రక్షింప గతి తూము తెఱచు టొకటె
ఘనవిషాదంబు హృదయంబు కలచునపుడు
దాని రక్షింప నేడుపే తగిన చర్య"

సీతకు కుశలవులు జన్మించిరన్నమాట రామున కిప్పటికి తెలియదు. ఆమె జీవించి యున్నదన్న విశ్వాస మతనికి లేదు. కాని జాహ్నవీదేవి పంచవటిలో సిద్ధపఱిచిన పీఠమాత్రము, తాను మృతిచెందినట్లు నిశ్చయించుకొని విలపించు రాముని మాటలు విని "హా! ఆర్యపుత్రా! బ్రతికియున్నాను. ఇక్కడే యున్నా" ననును. ఈ నాటకము శుభాంతమా, విషాదాంతమా యని కట్టకడపట పరామర్శించునపు డీ విషయము పరిశీలింతము. ఇప్పటికి చదివినదానిని బట్టి, రాముని చిత్తవృత్తి యెట్టిదందుమా, వెనుక వాసంతి యన్నదే తగిన సమాధానము, అది.

"వజ్రాదపి కఠోరాణి మృదూని కుసుమాదపి
లోకోత్తరాణాం చేతాంసి కో హి విజ్ఞాతుమర్హతి?"
వజ్రమున కంటె గట్టివి, పట్టిచూడ
సలరుకంటెను మెత్తని వైన యట్టి,
ధీర గంభీర సుస్థిరోదార వీర
పురుషహృదయంబు లెఱుంగ నెవ్వరి తరంబు?

[సశేషము]

నోణకజాయ

ఆరు రంగముల గీతినాటిక

శ్రీ తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి

[గతసంచిక తరువాయి]

పంచమ రంగము

(ప్రభాభవనము. ప్రాతఃకాల ప్రథమయామము. ఒక కక్ష్యలో విషణ్ణముఖియైన నరేంద్రప్రభ, వర్ధన స్వామి)

నరేంద్ర ప్రభ

వార్త పంపెడివరకు వచ్చితిరి కారేమి ?
కవివరా, నామీద కరుణ తప్పెను మీకు !

కవి

అటులు తలపకు మమ్మ! ఆదియందే యిటకు
రా దలంచితి, అంతరాయమ్ము ఘటియిల్లె—

నరేంద్ర ప్రభ

ఘటియిల్లగా లేదు గద అహిత మేమైన !
సహజ మయ్యెను కీడు శంకించుటే నాకు,

కవి

నేను వలచిన తరుణి నిన్ననే నామీద
పరిపూర్ణకారుణ్య ఫలితమ్ము చూపినది—

నరేంద్ర ప్రభ

అటు లైన కవివరా అభినందనమ్ములను
అర్పించుకొనుదాన ఆభరణాంబరాల్ !

కవి

సంతసమ్మే; కాని స్వల్పకాలము నేను
కలిసికోజాల నాకాంతాలలామమ్ము—

నరేంద్ర ప్రభ

వర్ధనార్య అదృష్టవంతు లన్నను మీరె !
నన్ని వేశం బామె సఖురాలితో మీకు.

కవి

ఎటు గ్రహింపంజాలు దెన్నిమాసాలు నే
పడిన యలజడి యల్ల పరమాత్మునకె యెరుక!

నరేంద్రప్రభ

కావ్య మాకర్ణించి, కాంచి మీ సోయగము
సంభ్రమోపేతయై చనుదెంచి మీమీద
వాలకుండగ జాలువనిత పురమున గలదె !

కవి

(చిరునగవుతో)

ఆకర్షణముమాట అటు లుంచుమా ప్రభా!
విఘ్న దేవత లెన్ని వెలసియున్నవి నడుమ

నరేంద్ర ప్రభ

విఘ్న దేవత యిచట విహరించు మానడుమ.
తొలగిపోవుట యెపుడొ తోచకున్నది కవీ!

కవి

బుద్ధికుశలత కాని పురుషయత్నము కాని
లాభించవు; తనంత లక్ష్మి రావలె గాని.

నరేంద్ర ప్రభ

హస్తసాముద్రికమ్మందు నిపుణులు గదా,
నా యదృష్ట మ్మెట్టు నడుచునో తెలుపుడీ !

(చేతులు చాపును. అతడు హస్తములు తాకకుండనే పరిశీలించుచుండును)

కవివరేణ్యులు మీరు కార్తాంతికులు గూడ,
పట్టుకొనవచ్చు నాపాణియుగ్మము స్వామి!
పూత మూను కవీశ, భూసురోత్తమహస్త
సంస్పర్శనమ్ముచే సకలవస్తువు లవని!

(అతడు హస్తములు పట్టుకొని చూచును)

స్వామి, అప్రియ మైనసత్యమ్ము దాపకుము
ప్రబల మైనది కదా భవితవ్యతాశక్తి

కవి

నిర్దుష్టములు సుమీ నీచేతిలో రేఖ,
లప్రియం బగుఫలం బావంత యును లేదు.
ఆసన్న మైయున్న దమృత యోగము ప్రభా!
పట్టంపుదేవివై పాలించెదవు భూమి.

నరేంద్ర ప్రభ

(అతనిచేతులు కన్నుల కద్దుకొని)

అగును గాక అమోఘ మవనీసుర కవీశ
విమలవదనమునుండి వెలువడిన యాశీస్సు!

కవి

అగుగాక కల్యాణ! మస్మదాశీర్వచన
బల మొక్కటియె కాదు; ప్రభువుజాతకములో
సప్తమమ్మున బుధుడు చాల బలవంతుండు,
వైశ్యాంగనా వివాహమ్ము రేనికి ధ్రువము.

నరేంద్ర ప్రభ

(ససంభ్రమముగా)

అనుగ్రహింపుం! డంగుళీయకము
స్వామీ, వ్రేలికి సంధింపగవలె—
మారు చెప్పకుడు, మత్కృతజ్ఞతకు
అంకం బీ రత్నాంగుళీయకము.

(ఉంగర మాతని వ్రేలికి పెట్టును)

మీ విమలోజ్జ్వల మృదుహస్తమ్ములు
అధిపతికరముల కతిథు లైనయవి!

కావున నాకును కడుపవిత్రములు,
చుంబనార్హములు సుమ్ము కవీశ్వర!

(ముద్దు పెట్టుకుని, కన్నుల కద్దుకొనును)

కవి

ఆనంద మానంద! మాదరింపగవలయు
మా భవిష్యద్రాజ్ఞి మంజుహస్తమ్ములను!

(ఆ మెకరములు సగౌరవముగా ముద్దాడి)

దేవి, నీహస్తాలు దివ్యమంగళ లక్ష
ణాంచితమ్ములు సుమీ! అవని నేలుట నిజము

నరేంద్ర ప్రభ

ఎట్టివి మీ హృదయేశ్వరి కరములు?
కమలపత్ర సంకాశములేనా?

కవి

(మందహాసము చేసి)

ప్రాణేశ్వరీ పాదపద్మయుగళము దేవి,
కరసరోరుహాయుగ్మకముకన్న రుచిరమ్ము.

నరేంద్ర ప్రభ

తావక "ప్రేమలతా" కృతి కవివర,
రమణీయం బగు రసనదనంబే.
వ్రాసినాను మీవర్తమానకృతి
భాగమునకు నే ప్రతి కవిశేఖర!
కాదంబరివలె కవివరు ప్రేమము
చాల విశిష్టము, స్మరణీయమ్మను.

విభుని మానసము విదితంబే కద?
పంప రెండులకు పరివారమ్మను?
నాకు ప్రతిదినము - నమ్ముడు కవివర!
యుగప్రాయముగ నున్నది నిజమ్ముగ.
దిట్టతనమ్మున తిరుగుచు నున్నా
నింటను, వ్యథయే హృదయములోపల!

(దీనముగా జూచును)

కవి

నీధ్యానంబే నిరతము రేనికి,

సాహసమ్మునకు శక్తి నశించెను.
లోకభయమ్మున లోలమనస్కుడు
క్షితిపతి యేమియు చేయంజాలడు.
స్వయముగ నీవే చనునెడ భూపతి
వాలును నీపదవనజమ్ములపై!

నరేంద్ర ప్రభ

స్వయముగ నరుగుట సమంజసంబా?
ఉన్నతకులమున నుద్భవించితిని.

కవి

ప్రణయగాథ నీ భర్తకు దెలియునె?

నరేంద్ర ప్రభ

తెలియును శ్రేష్ఠికి: దేవుని బోలెడు
పతనకి వందన మాచరింప దగు!
పాప, మేమియును పరుషము పలుకడు.

కవి

నాకు వింత యగు నరేంద్ర దేవీ!
ఎట్లు త్యజించెద వింతటి యోగ్యుని?

నరేంద్ర ప్రభ

తగ నే నతనికి! దైవసమానుడు,
అగపడ నీయం డాందోళనమును.

కవి

అంతయుదారుని యర్ధాంగిగ నే
యుండుట మంచిది: యోజన చేయుమ!

నరేంద్ర ప్రభ

(కుడ్యముమీది రాజుపటము చూపి)

కవివరేణ్యా, రాణి కావలయు నను కాంక్ష
లేశమాత్ర మ్మయిన లే దన్న, సత్యమ్ము.
ఎట్టిలోపమ్ము లే దీ సౌధరాజమున,
కాని యుండుట యిచట కవిరాజ, యిక కల్ల!
కారణం బేమియో గ్రహియింపగా జాల.
దర్లభకు రూపంబు తొలిపీక్షణమునందె

ఆవరించినది నాయంతరంగము నార్య!
పట్టమహిషినె కాదు, పత్నినే కాకున్న
అతనిసేవాపరాయణ నైతినా చాలు!
సత్యమ్ముగా పునర్జన్మ మెత్తితి నార్య,
ప్రాణేశ్వరుం గాంచు ప్రథమక్షణమునందె.
అన్య లే మనుకొన్న,
ఆర్ద్రహృదయము గలుగు
కవిశేఖరులు ప్రేమ
గ్రహియింప గలుగుదురు.

కవి

(మందహాసముతో)

మంచిది! దేవీ, మంగళ! మెపుడో
పునర్దర్శనము, పోయి వచ్చెదను.

(కవి లేవగా, అతనిని కొంచెము సాగనంపి నరేంద్రప్రభ లోపలికి పోవును. అతడు నాలు గడుగులు వేయగానే వితస్త యెదురుపడి నమస్కారము చేయును)

కవి

ఏమి వితస్తా, ఇప్పటి దాకను
శ్రేష్ఠి కనబడడు, క్షేమంబేనా?

వితస్త

(ఆవేశముతో)

అన్నియు దెలిసియు అడిగెద రేలా?
శ్రేష్ఠికి నింకను సేమం బెక్కడ?
ఈయన్యాయం బెచటను గలదా!
తలచినకొలదిని దారుణమ్ము గద!
వ్యాపించిన దీవార్త లోకమున,
సిగ్గున మనసులు చితికిపోయినవి.
పాతివ్రత్యము భగ్నమ మండెను!
మానము పోయెను, మహాదారుణము!

నౌక శ్రేష్ఠి

(ఒకపార్శ్వమునుండి నెమ్మదిగా ప్రవేశించి)

శాంతింపుము వితస్త, సంభ్రమం బెందులకు?
వర్ధనస్వామి, ఈవైపు దయచేయుండు.

(ఇరువురు పీఠములపై నుపవేశింతురు)

ఎన్నినా ళ్లాయె మీ రిచ్చటికి దయచేసి ?
రాజకడనుండియా రాక? ఎటు లున్నారు?

కవి

రాజధానినుండియే రాక, మూడునా ళ్లాయె
వచ్చినాడ నిక్కడకు వార్తనంప ప్రభాదేవి.
కుశలమే నాకు; కాని కువలయేశ్వరుం డేదో
మనోవ్యథకు శరణమై మంచమే పట్టినాడు.

వితస్త

రాజచరిత్రము రానీయకు డిట !
కవిశేఖర, కడు గర్హ్యము గర్హ్యము !
అనాహూతుడై అభ్యాగతిగా
అరుగుదెంచి యిటు లాచరించునా !
కలికాలములో కలదా న్యాయము !
కంచెయె చేనిని కబళించు నౌకో !

కవి

(ఆమెను వారించి)

తొందర యేటికి ? దుర్మార్గుం డని
భావించెదవా ప్రభుని వితస్తా ?
పాతివ్రత్యము పత్నీవ్రతమును
సాంఘిక నియమాచారము లనుకో.
ప్రణయము వీనికి పైమెట్టనుకో
అంతరంగమున కయ్యది సహజము.

వితస్త

వివాహధర్మము వీడిపోవవలె
ప్రపంచకమ్మును భవిష్యత్తులో !

పాణిగ్రహణము పవిత్రవిధి యని
తలపనె తలపర ధర్మవేత్త లిక !

కవి

పాణిగ్రహణము పాతివ్రత్యము
పత్నీధర్మము, పవిత్రవిధులే.
వివాహబంధము విధింప దగినదె,
కాని శాశ్వతము కా దని యెంతురు.

వితస్త

దుర్లభక ప్రభుత్రోవను నడచెడి
మాన్యులు తలతురు ! మహాదారుణము !

కవి

ధర్మం బనునది తప్ప దెపుడు, మరి
మారు ధర్మములు మనుజలోకమున.

వితస్త

నా కివి తెలియవు; నరనాయకు డీ
విపరీతపథ విడిచిపెట్టవలె.

కవి

ఏమి చేసినా డింతకు నరపతి ?
పాప మెవ్వరిని బాధింపండే !

వితస్త

మంచిమాట స్వామి ! మామనస్సు లిట్లు
బాధ పొందుచుంట ప్రభువువలన కాద ?
అన్యపత్ని యెడల ననురక్తు డగుట
అందరకును దెలుపు టన్యాయము కాద ?

కవి

అతడు వ్యాప్తి చేయలేదు:
అనురాగోదంత మెపుడు
తనకు దాన వ్యాపించును
ధరణీధవుని తప్పు లేదు.

వితస్త

పంపినాడు మణిహారము
    పటముగూడ హారములును
చిత్రపటము లిచటినుండి
    స్వీకరించినాడు తాను.

కవి

అనురాగం బుభయనిష్ఠ
    మైనపుడే పరస్పరము
చిహ్నముగా బహుమతులును
    స్వీకృతమ్ము లగుచునుండు.

వితస్త

పాపకార్య మగున కాద
    పరస్త్రీకి బహుమానము
లిచ్చి, మహోత్సాహ మొసఁ,
    యింతవరకు దెచ్చు టార్య!

కవి

ప్రణయసరణి యెరుగనట్లు
    పలుకుచున్నదాన, వధిపు
డక్రమమ్ము చేయలేదె
    అనురాగప్రథను బట్టి.

వితస్త

అదియేమో నాకు దెలియ
    దార్య మా యజమానురాలు
కాపురమే చేయ ననుచు
    గట్టిపట్టు పట్టినదే.
విడిపింపగ సరళమైన
    విధము కానరాదు నాకు!
చేయ రేమి కట్టడి మా
    శ్రేష్ఠివారు పట్టనట్లు!

కవి

శ్రేష్ఠి దైవసముం డనియె-
    చెప్పె నిపుడె ప్రభాదేవి.
కాని యిచట కాపురంబు
    కల్ల యింకమీద ననియె.

వితస్త

ప్రభాదేవి కింతకు మును
    ప్రశస్త మా నదుపదేశ
మిచ్చుచుండ మీరు, వింటి
    నీవలనుండి కవిప్రవర!

కవి

పరులు రహస్యమ్ము లేవో
    భాషించెడి వేళ నీవు
మాటునుండి వినుచుండుట
    మంచికార్యమే వితస్త?

వితస్త

యాదృచ్ఛికమ్ముగా నాలకించితి నార్య!
అయిన మాయజమానురాలు విడిచెను సిగ్గు.

కవి

స్థిర మైన యనురక్తి సిగ్గొక్క టే కాక
సకలమ్ము ద్యజియింప జాలు నిష్కంపముగ

వితస్త

ఇంక నియ్యెడ చెప్ప నే మున్నది కవీశ!
యజమానులదె లోప మని యభిప్రాయమ్ము.

సోణక శ్రేష్ఠి

భావప్రపంచమే బంధింప నేర్తుమా?
అలవి కాలేదాయె అసురనృపులకు గూడ.

వితస్త

కులకాంతలకు కళలు
    కూడునా కూడవా,
అనుమాట యటు లుంచి
    అరయు డొక్కటి కవీ!
సంగీతములు నాట్యసమ్మేళనమ్ములును
గోష్ఠులును కవులతో కులకాంత కెందులకు?

భార్యపై తన కెంత ప్రణయ మున్నను, చండ
శాసనుడు కానిచో సౌఖ్య ముండునె పతికి ?

(ససంభ్రమముగా నిష్క్రమించును)

శోణక శ్రేష్ఠి

కవివరా, యెన్నాళ్ళు గడపితిరి రాజుకడ !
నిజముగా నతనిమతి మీ కెట్లు తోచినది ?

కవి

పక్షకాలము నన్ను ప్రభువు విడువనె లేదు.
పాప మాతడు మహాబాధ పడుచున్నాడు.

శోణక శ్రేష్ఠి

ప్రభమూలముననె యీ
బాధ యంతయు నతని
కందులో నటన మే
మైన కానం బడెనె?

(కవికన్నులలోనికి జూచును)

కవి

నటన యేమియు లేదు; నరనాయకుడు మహా
సరళహృదయుడె కాక సద్వర్తనుడు కూడ.

శ్రేష్ఠి

ఇంతవలపున మునుగుటేలనో భూనేత ?
మంచమ్ము పట్టె ననుమాట సైతము తెలిసె.

కవి

పట్టివలపుగ నెంచ వలనుపడదో సఖా !
నిర్మల మ్మది మహానిబిడానురాగమ్ము.
శ్రేష్ఠి. నీకు సఖుండ, చెప్ప మాటలు నమ్మ.
వహియించి ధైర్యమ్ము వ్యధ చెందబోకుమా!
ఆవిభావరి వేళ నవకాశమే యుండె
కువలయేశుడు ప్రభయు గుప్తమ్ముగా గూడ
కాని యాకస్మికముగా రాజు పయనమ్ము
ఏల చేసినవాడొ యిపుడు గ్రహియించితివ?

(శ్రేష్ఠి శిరఃకంపము చేయును)

ప్రభను దా వీక్షించు ప్రథమక్షణమునుండి
జననాయకుడు పునర్జన్మ మెత్తినయట్లు
తేఱిపోయుచున్నాడు తథ్యమ్ముగా సఖా !
పత్నిగా నే కాక పట్టమహిషిగ గూడ
చేకొందు నని రాజు చెప్పుచున్నాడోయి!

శ్రేష్ఠి

పాలపొంగును బోలు ప్రథమమోహతరంగ
మణగినంతనె నృపతి అంగనను త్యజియించు

కవి

నాను కామకలాప్రవీణత
నమ్మువాడవయేని శ్రేష్ఠీ,
నృపతియనురాగస్వరూపము నే గ్రహించితిని
పరిణయంబై ప్రభాదేవిని
పట్టమహిషిని జేసి దుర్లభ
దేవు డాయమకన్నునన్నల తిరుగుచుండు
సుమీ !

శ్రేష్ఠి

తనకు దక్కదు వైశ్యసుందరి
తథ్యముగ నని విదిత మగుచో
బలిమిమై కాశ్మీరనరపతి పట్టుకొని చనునా?

కవి

శివశివా ! ప్రభు వా విధమ్మున
చేయువా డని తలపబోకుము ;
భగ్నహృదయుండై క్రమమ్ముగ ప్రాణ
ములు విడుచున్.

శ్రేష్ఠి

వచ్చినది కాశ్మీరనృపతికి
వలపుచే ప్రాణములమీదికి !
ఏమి చేయునో నరేంద్రప్రభ యెరుక
గలదె సఖా ?

కవి

సప్తమస్థానమున సరపతి
జాతకమ్మున బుధుడు మిక్కిలి
శక్తిమంతుడు: వీరిమేళన జరిగితీరు సుమీ!
అదియు గాక మరొక్క, టీయమ
హస్తమున శుభలక్షణమ్ములు
స్పష్టముగ వెలుగొందు: రాజ్ఞీపదము నిశ్చయము.

శ్రేష్ఠి

ప్రభుని రాణిగ పేరు పడయగా వ్యామోహ
పడుట లేదందువా ప్రభ, వర్ధన కవీశ?

కవి

పాప, మాయమ కట్టిభావమే లేదు
పట్టపుదేవిగా ప్రభువు చేకొనును
అనెడివాక్యమ్మున, కనురాగబలము
కాశ్మీరవిభునకు కల దని తలచు.
అది యెట్టిదో గాని ఆమెకు గూడ
అనురాగమే ముఖ్య మనెడియాశయము.
శ్రీనరేంద్రప్రభా జీవితమందు
తేజరిల్లును ప్రేమదీపికాజ్యోతి.

సోణక శ్రేష్ఠి

కవిశేఖరా, యెదో కామమ్ము కాక
ఇది నిర్మలప్రేమమే యథార్థముగ?

కవి

నిస్సంశయమ్ముగా నిర్మలప్రేమ,
నాయింగితము బట్టి నమ్ముచున్నాను.

శ్రేష్ఠి

పరివారమును రాజు పంప రెందులకు?
అరుగ దేటికి ప్రభ అతనిసన్నిధికి?

కవి

నీమీద వారికి నిండుగౌరవము
కొంత లోకభయమ్ము కూడ నిర్వరకు.

శ్రేష్ఠి

సౌఖ్య మొదవునె వీరినమ్మేళనమున?
మాధుర్య సౌభాగ్య మాన్యత లున్న?

(కవి శిరఃకంపము చేయును)

వ్యాపారమే నాకు వర్ధనస్వామి,
ప్రాణప్రదం బని భావింపవలదు.
నమ్మెదువో లేదో నాకు నొకింత
విశద మహా కాముకవిమలానురక్తి.

కవి

సామాన్యుడవు కావు, సంగీత నాట్య
కవితాది సలలిత కళలలో నీవు
గాఢాభిమానంబు కలిగిన వాడ,
వమలినప్రేమ నీ కవిదిత మగునె!

శ్రేష్ఠి

(సాలోచనముగా)

గాఢానురాగంబు కలవారినడుమ
జవనికగా నుంట సరసమా స్వామి!

(కవి ఆశ్చర్యముతో చూచును)

పష్ఠ రంగము

(శ్రీనగర రాజప్రాసాదమున రాత్రి ప్రథమ యామము. సుసజ్జిత మైన విశాలకక్ష్యలో రాజు తల్పముపై శయనించియుండును. ఉభయపార్శ్వములలో ఉత్పలకను, హంసపదికయు నిలిచి యుందురు. గోడలమీద చిత్రపటములు కావచ్చును)

రాజు

(కన్నులు తెరచి)

ఉత్పలకా, ఉత్పలకా,
ఒక్కవేళ నోణకుండు
బాధ పెట్టుచుండు నేమొ
ప్రభా దేవి నీక్షణమున.

ఉత్పలకుడు

గుండె యుండు నొక్కొ ప్రభూ !
కువలయేశు దృష్టి పడిన
భార్యమీద చేయి వేసి
బ్రదుకగలడె నోణకుండు !

రాజు

వచ్చె జ్ఞప్తి నాకు, సాధు
వర్తనుండు శ్రేష్ఠి, కాని
వార్త లేదు ప్రభాదేవి
వద్దనుండి ఉత్పలకా !

ఉత్పలకుడు

అడుగు పెట్టె నెదురా
అతడు ప్రభాదేవి సరణి !
నంత సాహసంబె శ్రేష్ఠి !
కామె వెనుక దీయ నోపు.

రాజు

నరేంద్ర దేవీ, నరేంద్ర దేవీ,
మరుమరీచికయె మన సమాగమము !

హంస పదిక

కాదు మహాప్రభు ! కరబదరం బగు
దేవరయించుకదిటవు వహించిన.

రాజు

ఏమి చేయగల నీ యవస్థలో
సులభోపాయముచూపుము హంసా !

హంసపదిక

పంపుడు పరిమిత పరివారమ్మును
దేవి నిటకు గొనితెచ్చుటకై ప్రభు !

రాజు

పంపంజాలను పరివారంబును
అటు చేసినచో నప్రతిష్ఠ కద.
(నిట్టూర్పును)

ఉత్పలకుడు

వనిత గాని కవిత గాని
వచ్చుచుండు స్వయముగానె.
బలాత్కరించుపక్షమందు
ప్రమద మంతరించిపోవు.

హంస పదిక

పట్టమహిషి కానున్నది
బయలు వెడలి వచ్చు టెట్లు
సబహుమానపరివారము
సందేశము లేక ప్రభూ ?

రాజు

ప్రజలమాట నాకుభయము గొలుపుచుండు
రామభద్రునంత రాజుకూడ జంకె.

ఉత్పలకుడు

ఉభయపక్షములకు యుక్తమైనసరస
విధము తెలుపు మన్నవిన్నవింపగలను.

(రాజు శిరఃకంపము)

ప్రథమమందు దేవిబయలు వెడలవలయు,
పోవవలయు రాజపురుషు లెదురుగాను.
ప్రజలు నోరు విప్పిపలుకజాల రపుడు
పరువు దక్కు నన్నిపక్షములకు గూడ.

రాజు

సాంధివిగ్రహిక సచివపదమునకు
చాలినవాడవు, చాటుకారుడా !

ఉత్పలకుడు

చిత్తము దేవా, చేయంగలుగుదు
దయచేసినచో తన్మంత్రిత్వము.

రాజు

ప్రభాదేవియే పట్టపుదేవిగ
వచ్చునెడల నీవాంఛ ఫలించును.

(పటమువంక జూచి)

నాపై నెన్నడు నరేంద్ర దేవీ,
కరుణ వహింతువో కానంబడదే !

(శయ్యపై నొరగుచు)

హంస పదిక

దేవా, దేవా, తేరుకొనుడు మీ
ప్రభాదేవియే బయలుదేరినది.

రాజు

(లేచి చూచి)

నిజమే నిజమే? నీతో నెవ్వరు
అన్నవారలో హంసా, తెలుపుమ !

హంస పదిక

ప్రతిఫలించినది ప్రభు, నామానస
ముకురమునం దీ ముహూర్తమందే.

రాజు

(తెప్పరిలి)

నీవు నరేంద్రా నేపథ్యంబున
పాడుచు నాట్యము ప్రదర్శింపవే.

(హంసపదిక నిష్క్రమించును)

ఉత్పలకుడు

ఊహచేసినాడ నొక్క-
యుపాయమ్ము మహాప్రభూ !
పండుగనాడు శ్రేష్ఠి నిటకు
భార్యతోడ నాహ్వానించి
నిర్ణీతం బైనచోట నిద్ర పోవు శ్రేష్ఠి నొకనె
అర్ధరాత్రికాలమందె
అతని గృహమునందు దింపి,
ప్రభువున కర్పించినాడు
ప్రభాదేవి నతడే యని
వాడు వేయునెడల దేవ,
వాంచాఫలసిద్ధి యగును

రాజు

ఉత్పలకా, నీపలుకులు
యుక్తియుక్తములె యయ్యు
అతడు గాని, ఆమె గాని
అరుగుదేర రనుకొమ్మా!
సక్రమముగ నీ వన్నది
జరుగు ననియె భావింపుము :
అవల నిజము బయలుపడిన
అప్రతిష్ఠ ప్రబలిపోవు.

(ఉత్పలకుడు తల గోకికొనును. హంసపదిక ప్రవేశించి మెల్లగా నాట్యము చేయును. రాజు లేచి నర్తకిని కౌగలింపబోవును.)

ఉత్పలకుడు

నటియించితివే నరేంద్ర దేవిగ
భ్రమ గలిపించెడి భంగిని హంసా !
దైవవశమ్మున తథ్యముగానే
ప్రభవే యగుచో ప్రభు లేమందురో !

రాజు

(అడుగు వెనుకకు వేసి)

నా భ్రమమేనా ! నరేంద్రదేవివి
కావా కావా కావా ! హంసవ !

(పోయి శయ్యపై వాలును)

ఉత్పలకుడు

ప్రభువువారు పోయి బలిమి
ప్రభాదేవి బట్టి తెచ్చి
రాణి జేయునెడల సర్వ
రణవీరులు మోదింతురు.
రాక్షసపాణిగ్రహణము
రాచపాడి: రుక్మిణీ
దేవిని శ్రీకృష్ణ మూర్తి
తెచ్చికొన్న దీ విధమే.

రా జు

రాక్షసు డన్నట్టిపేరు
రాకతప్ప దల్లొనర్ప—
దేవాంశా సంభూతుల తీరు
మనకు జెల్ల దోయి !

(కన్నులు మూసుకొని)

నను రక్షింపగ నరేంద్ర దేవీ,
రాగదవే యిటు రంహానగతితో !

హంస పదిక

స్వయముగా నొక్క వేళ
చక్క వచ్చు నేని ప్రభా
దేవి యిటకు చిత్రముగా
దేవేరిగ గ్రహియింతుర ?

రా జు

నా యదృష్టమున నరేంద్ర దేవియె
ఈప్రదేశమున కేగుదెంచు నెడ
అసంశయమ్ముగ నందరిమ్రోలను
వ్రాలెద తత్పదవనజయుగ్మమున !

(లేచి నరేంద్రదేవీపటముకడ మోకరిల్లును. హంస పదిక, ఉత్పలకుడు నిష్క్రమింతురు. ఒకపార్శ్వము నుండి నిశ్శబ్దముగా ప్రవేశించి)

కవి

ఏమి కారణమొ, ఇటు లున్నారే
ముకుళిత నేత్రమ్ములతో దేవా !

రా జు

(లేచి, కవిని కౌగిలించుకొని శయనముపై గూరుచుండ బెట్టుకొని, మందహాసము చేసి)

"తా మిందుసుందరముఖీం సుచిరం విభావ్య
చేతః కథం కథ మపి వ్యపవర్తతే మే;
లజ్జాం విజిత్య, వినయం వినివార్య, ధైర్య
మున్మథ్య, మంథర వివేక మకాండ ఏవ !"

కవి

నిండుకుండవలె నృపు డితరులకడ
చిక్కబట్టవలె చిత్తము దేవా !

రా జు

దూర్వాంకురశ్రేణి తురిమి యున్నకచంబు,
లలితగోరోచనా తిలకపాటల నిటల,
మాలోల మణికుండ లాసక్తితప్రభా
మకరికారేఖికా మంజుగండద్వయము,
దరదోళితస్థూల తారహారద్యుతి
గ్రహిళస్తనాభోగ కంచుకోన్నతసీమ,
దివ్యకాంచీనియంత్రిత జఘనదేశంబు,
మణికదంబస్థగిత మంజీరరుచిపుంజ
శబలితారుణపాద జలజాతయుగళంబు,
త్రిభువనస్తవనీయ దివ్యలక్షణమహిత
మంగళాకారమ్ము మరచు టెట్లు కవీంద్ర !

కవి

విస్మరింప నేల దేవ? వేగమే మనోరథమ్ము
ఈడేరెడిమధురక్షణమిాయామినివేళవచ్చు.

రాజు

కార్తాంతికుడవు కవివరేణ్యుడవు
నీ వాడినయది నిజ మగు సఖుడా !

"పశ్యామి తా మిత ఇతః పురతశ్చ పశ్చా
దంత ర్బహిః పరిత ఏవ వివర్తమానామ్
ఉద్బుద్ధ ముగ్ధకనకాబ్జనిభం వహంతీ
మాసంగి తిర్యగపవర్తితదృష్టి వక్త్రమ్!"

కవి

బాగు బాగు! మరి ప్రభు వాక్రుంచుక
కాంతించిన కృషి సంపన్నం బగు.
తొలుత నోణకునితో మహాప్రభువు
సల్లాపంబులు సలుపగవలయును.

రాజు

(చేయి త్రిప్పుచు)

ఆతనివదనం బవలోకింపగ
ధైర్యము చాలదు! ...తప్పద సఖుడా!

(కవి కరతాళము వేయగా నోణకుడు తొంగి చూచును)

రాజు

(ససంభ్రమముగా పన్నని గొంతుతో)

నాలుగుమూలల నరేంద్ర దేవీ
చిత్రపటములను శీఘ్రము తీయుడు.

(కవి వెనుకటిద్వారమున నిష్క్రమించును)

నోణక శ్రేష్ఠి

(అగ్రగామియై రాజునకు నమస్కరించి)

దేహ మస్వస్థమని తెలిసి దేవరవారి
సందర్శనార్థమై చనుదెంచియున్నాను.

రాజు

(లేచి, అతనికి ఎదురు వచ్చి)

స్వాగతము స్వాగతము! సఖుడ, ఆ పీఠమున
ఆసీనుడవు కమ్ము...

(ఉభయులు నిజస్థానములలో గూరుచుందురు)

అస్వస్థముగ నున్న
దొక్కింత యీనడుమ..

(అవనతవదను డగును)

నోణక శ్రేష్ఠి

ఒడలుశుష్కించినది:
పాలిపోయినవారు, ప్రభు వేదియో మనో
వ్యథకు పాలైనట్లు వదనమ్ము సూచించు....
తెలిసికొంటిని నేను దేవా, భవద్వ్యాధి
కేది వాస్తవమైన హేతువో యీనడుమ

(రాజు ముఖము పైకెత్తి సురల వాల్చును)

నేను వచ్చినవాడ నిక్కమ్ముగ చికిత్స
చేయగలుగుదు నన్న స్థిరబుద్ధితో ప్రభూ!
బాధ పడుచున్నారు ప్రభమీది శక్తిచే...

(రాజు ఉలికిపడును)

ప్రాకిపోయినది యీ ప్రణయవృత్తాంతంబు...

రాజు

పెరవారితో నేను ప్రేమమాటనుగూర్చి
నోరు విప్పనె లేదు, నోణకా, నమ్మవలె.
తొలుత ప్రేమించు టేదోషమ్ము, క్షమియించు!

నోణక శ్రేష్ఠి

సహజమ్ముగా ప్రేమ సంజాతమగుచుండు-
దుర్లభ ప్రభు, భవద్దోషంబు లేదిందు...
స్వీకరింపుడు దేవ, శ్రీనరేంద్రప్రభను...

రాజు

అల మలం ప్రియసఖా! అనబోకుమామాట!
వేరు తన్నిన రాగవృక్షమ్మును వివేక
పరశుధారాహతిం బడగొట్ట యత్నించి
బహువిధంబుల నేను, భగ్నక్రియుడ నైతి
సిగ్గుపడుచున్నాను శ్రేష్ఠి, చూచితివిగా.
ప్రజల నెల్లర ధర్మపథమున నడిపింప
వలయువాడను దుష్టవాంఛాహతుండనై
పరదారనాసింప పాతకం బగుగదా!
అందు, మిత్రునిభార్య కాసపడు టక్కటా!
ఆంతరంగికయుద్ధమందు విజయము లేని
పతనాన విడిచెదను ప్రాణాలు ప్రియసఖా!

శ్రేష్ఠి

శివశివా! దేవర క్షేమమ్ముగా నున్న
సేమమ్ము కాదె కాశ్మీర రాష్ట్రమ్మునకు?
సంతరింప కనేకసత్కార్యముల్ దేవ,
పంచత్వ మొందుచో ఫలమేమి ప్రాయమున?

రాజు

(మందస్వరముతో)

కాకున్న పరిణీత గ్రహణయోగ్యం బగునె?

శ్రేష్ఠి

పాణిగృహీత యన్ భయ మున్నచో దేవ,
దేవదాసిగ విడుతు దేవళమ్మున ప్రభను.

రా జు

దేవిగౌరవమునకు తీరనట్టి కళంక,
మట్టికార్యము చేయు,కనుచితము ప్రియసఖా!

శ్రేష్ఠి

అన్నింటికి ప్రధాన మైన దున్నది ప్రభూ!
కలదు మీపై ప్రభకు గాఢానురాగంబు.
ప్రతిదినమ్ము నరేంద్ర పడుచున్న బాధలో
ప్రభు వెరుంగరు గాని- ప్రత్యక్షమే నాకు.
మీకున్ నరేంద్రపై మేదుర ప్రేమమ్ము,
ఉభయాభినిష్ఠమై యొప్పుచున్నది రక్తి.
పరికించితిని మీరు పడుచున్న బాధలను

(రాజు తల వంచును)

ప్రభ పత్ని యనుతలపు పరిగతం బయిపోయి
క్రొత్తభావం బొకటి కుదురుకొనె నాలోన.
గాఢానురాగంబు కలవారలకు నడుమ
నిలువగా రా నంచు నిశ్చయించితి వాడ.
నిష్కల్మషమ్ముగా నే నొసంగుచునుండ
ప్రజలు మీయెడ తప్పు పట్టజాలరు దేవ!
చివరపర్యాయమ్ము- స్వీకరింపుడు ప్రభను!
పోయివచ్చెద దేవ! భూయా చ్ఛుభం వామ్!

(నిష్క్రమించును)

రా జు

(తెప్పరిలి)

రమ్ము కవీశా, రయమున నిచటికి!

(కవి వచ్చును)

ఐంద్రజాలికుడ వగుదువు సఖుడా!
ఈజన్మంబున నెన్నడు మరవను
నీ యుపకారము నిజము సఖుండా!
అమలోదారుం డైన నోణకుడు
దివ్యపూరుషుని తెరగున దోచును!

క వి

కదలక యిచటనె కనుగవ మోడిచి
పద్యము పాడిన ప్రభ యరుదెంచును.

(పార్శ్వద్వారమున నిష్క్రమించును)

రా జు

(కన్నులు మూసికొని)

"అతిముక్తకగ్రథిత కేసరావలీ
సతతాధివాస సుభగార్పిత స్తనమ్
అపి కంఠజాహ వినివేశితాననః
ప్రియయా తదంగపరివృత్తి మాప్నుయామ్!"

(పాడుచుండగా, నరేంద్రప్రభ తలుపు తెరచుకొని యెదుటికి వచ్చునప్పుడు కలిగిన పాదధ్వనికి రాజు కన్నులు తెరచి ససంభ్రమముగా)

నరేంద్ర దేవీ,
నను పాలింపవె!

(అనుచు పోయి, ఆమెపాదములమీద వాలును. ఆమె రాజును లేవ నెత్తుచు, దస్తుతితో)

వచ్చితి జీవన
వల్లభ! దుర్లభ!

(అని యతనియురమున పై వాలి, కన్నులు మూసికొనును. ఉభయుల గాఢాలింగనము.)

ఎత్తుపల్లాలు

[కథానిక]

'హితశ్రీ'

రాట్నం తిప్పటం ఆపి పొద్దు ఎంతయిందో నని గుమ్మంబయటికి వొచ్చి పడమటివైపు ఆకాశంలోకి చూసింది రమ. సమయం ఉజ్జాయింపుగా ఊహించి, లోపలికి వెళ్ళేముందు రోడ్డు చివరిదాకా ఓసారి అలవాటుగా విసిరిన ఆమె చూపు, ఎదురుగా వొస్తున్న ఓ జట్కాలోని స్త్రీ మీద నిలిచిపోయింది. అదే సమయంలో ఆమె కూడా రమవైపు చూసింది. ఇద్దరి మనస్సుల్లో గడిచిపోయిన రోజుల్లో మరుగుపడ్డ కొన్ని దృశ్యాలు తటిల్లతల్లా మెరిశాయి.

రమ ఇంటిముందు ఆ జట్కా ఆగింది. లోపలి నుంచి దిగిన స్త్రీవైపు చూసి రమ ఆనందంతో కేకసింది.

"జ్యోతీ!"

"రమా! నువ్వేనా! చూసీ చూడటంతోటే నువ్వే అయివుంటా వని అనుమానించాను."

"నువ్వింకా అనుమానించావు. నేను చూడటంతోటే పోల్చుకున్నాను. అబ్బ! ఎన్నాళ్లయింది జ్యోతీ, మన మిద్దరం కలుసుకుని!"

"నాలుగేళ్లు." చిరునవ్వుతో ప్రశ్నకి సమాధానం చెప్పే ధోరణిలో అంది జ్యోతి.

"ఇంతే! ఎన్నో ఏళ్లు గడిచిపోయినట్టుగా ఉందినుమా నాకు."

"నాకు నలభయిఎనిమిది నెలలు గడిచినట్టుగా ఉంది - ఏమి టనుకున్నావో! అంటే, నాలుగూ ఇంటూ, మూడువందల అరవైఅయిదూ - పధ్నాలుగు వందల అరవై ప్లస్ ఒకటి"—

"ఒక టేమిటి?"

"లీపియర్. పధ్నాలుగువందల అరవై ఒక్క రోజు - అంటే..." రమ విరగబడి నవ్వింది.

"రూపు కొంచెం మారినా నీధోరణి మాత్రం ఏమీ మారలేదు జ్యోతీ." ఇద్దరూ నవ్వుతూ లోపలికి వెళ్లారు.

"చరఖా కూడా తిప్పుతా వన్నమాట నువ్వు."

"ఊరికే కూచుని ఏం చెయ్యను; ఏదో ఉబుసు పోకకి." పైకి నవ్వుతూనే అన్నా, రమమనస్సులో కొంచెం కలతపడ్డది.

"ఈకుట్టు మిష నేమిటి? మిా దేనా?"

"అవును."

"గుడ్డలు కూడా స్వయంగానే కుట్టుకుంటా రన్నమాట."

"అవును. ఎవరిపని వాళ్ళు చేసుకోటంలో తప్పేముంది?"

"అబ్బే, అది కాదు. అయితే రోజూ నీకు చేతి నిండా పనే."

"ఆ దాని కేం లోటు లేదు." రమ పొడిగా నవ్వింది.

"మిా ఆయన కేం ఉద్యోగం, ఇందాకటినుంచీ అడగటం మర్చిపోయాను."

"ఆయనకి ఉద్యోగం చెయ్యటం ఇష్టం లేదు జ్యోతీ. ఒకరికింద బానిసగా బతకటం నాకు గిట్టదని అంటుంటారు."

"మంచి ఆదర్శమే. కాంగ్రెస్ మెంబ రను కుంటాను.

"కాదు. ఏదో ఓ సంస్థకి కట్టుబడి ఉంటే యుక్తాయుక్త విచక్షణజ్ఞానం నశిస్తుందని ఆయనవాదం"

"అయితే మరి ఏంచేస్తుంటారు?"

"పత్రికల్లో వ్యాసాలూ, అవీ, రాస్తుంటారు తీరికసమయాల్లో. అదిగాక వ్యవసాయం ఓ టుందిలే,"

"ఓహో స్వంతవ్యవసాయమా! ఇంకేం, మీ రిద్దరూ స్వయంపోషకు లన్నమాట." జ్యోతి నవ్వింది. రమ కూడా మందంగా శ్రుతికలిపింది.

ఆ గదిలోని ప్రతివస్తువూ వెలిబుచ్చే నిరాడంబర త్వాన్ని చూసి జ్యోతికి ముచ్చటవేసింది.

"ఇంత నిరాడంబరంగా ఉండగలగటం చాలా అదృష్టం రమా."

"ఎంత నిరాడంబరంగా ఉండగలిగితే ప్రకృతికి అంత సన్నిహితంగా ఉంటాము. అంతకంటె కావా లిసిం దేముంది?" రమ ఈ మాటలు అనిన తరవాత, అవి తనహృదయంలోంచి వొచ్చినవేనా అని ప్రశ్నించు కుంది.

జ్యోతి సాలోచనగా కిటికీలోంచి ప్రకృతి రామణీయకతను పరికిస్తోంది. ఆ కిటికీలోంచి కనిపించే ప్రకృతిదృశ్యం చాలా సుందరంగా ఉంది. సూర్య కాంతిలో స్ఫుటంగా కనిపించే కొండల అంచులూ, కొండలవరసకి ఇవతల వెండినీరులా ప్రవహిస్తున్న పంటకాలువ, పచ్చని చెట్లగుబురూ—జీవితంలో చూడ దగినవి ఇంకేమైనా ఉన్నాయా అనిపిస్తున్నాయి.

"నువ్వు చాలా అదృష్టవంతురాలివి రమా."

అకస్మికంగా వొచ్చిన ఈ మాట విని రమ తలెత్తి జ్యోతివైపు ప్రశ్నార్థకంగా చూసింది.

"మీరు ఇంత చిన్న ఇంట్లో ఎందుకు నివసిస్తున్నారో నాకు తెలిసింది. ఇంత కళామయజీవితం గడుపుతున్న నీకంటె అదృష్టవంతురాలు ఎవరున్నారు?"

రమకి ఈమాటలు మొదట అర్థం కాకపోయినా జ్యోతి కిటికీలోంచి చూస్తున్న దృశ్యం చూసి, ఆమె ఏం ఉద్దేశించి అలా అన్నదో తెలుసుకుంది.

"ఆ దృశ్యం నిజంగా చాలా గొప్పది జ్యోతీ. నే నెప్పుడూ సాయంత్రంవేళల్లో నీలాగే అలా చూస్తూ ఆనందిస్తూంటాను." నిజానికి రమకి ఆ దృశ్యం చూడటం అంత ఇష్టం లేదు, అలవాటూ లేదు. పైగా, ఎండ వస్తుందని విసుక్కుంటూ, ఆ కిటికీతలుపులు సాయంత్రంకాగానే మూసేస్తూండేది.

"నువ్వు హాయిగా రోజులు వెళ్లబుచ్చుతున్నం దుకు నాకు చాలా సంతోషంగా వుంది రమా"

'హాయిగా రోజులు గడపగలగటం ఈ జీవితంలో సాధ్యమా?" అని తనలో తాను ప్రశ్నించుకుంది రమ.

"సరే నేను వెళ్లొస్తాను. చాలాసేపైంది."

"వొచ్చినప్పటినుంచి నాగొడవలోపడి నీ సంగ తులే అడగలేదు, నేను. అన్నట్లు నువ్వుకూడా ఈ ఊళ్ళోనేనా ఉండటం?"

"కాదు, మద్రాసులో. పనిమీద మే మిద్దరం వొచ్చాము."

"అయితే ఇటు ఎక్కడికి వెడుతున్నావు?"

"ఈ ఊళ్ళో మాచుట్టా లున్నారులే. వాళ్లింటి కెళ్లి చూసి వొస్తున్నాను."

"ఉండటం ఎక్కడ?"

"హోటల్లో. సరే, ఇహ నేను వెళ్లొస్తా మరి."

"ఎక్కడికి వెళ్లటం? ఈ పూట నువ్వు మా ఇంట్లో భోంచేసి వెళ్లాలిసిందే."

"భోజనం ఇప్పుడు కాదులే రమా, ఈసారి."

"ఊహుం— అలా వీల్లేదు. రాకరాక వొచ్చి తుర్రుమని పోదామనుకున్నావా?"

ఇద్దరూ నవ్వారు.

"సరే, అలా అయితే హోటలుకి వెళ్లి వాళ్లకి

చెప్పి వొస్తాను. లేకపోతే వాకోసం అనవసరంగా కనిపెట్టుకు కూర్చుంటారు."

"త్వరగా రావాలి. మర్చిపోవుగద."

"వస్తానన్నానుగా!'

జ్యోతి బండి ఎక్కి వెళ్లిపోయింది. రమ ఆమె వెళ్లినవైపే చూస్తూ అలాగే నిలబడిపోయింది. జ్యోతి అన్నమాటలు ఆమెకి ఒక్కొక్కటే జ్ఞాపకం వొస్తున్నాయి. తను ఎంతో హాయిగా ప్రశాంతంగా, చీకూ, చింతా లేకుండా రోజులు గడుపుతోందని ఆమెఅభిప్రాయం. బియ్యం ఇంటికి వొచ్చేదాకా గ్యారంటీలేదని ఆమె కేం తెలుసు. పొద్దున లేచినప్పటినుంచీ సాయంత్రం దాకా ఇద్దరూ అవస్థ పడితేగాని రోజులు గడవవని ఆమెకి తెలియదు. ఏమిటో కళామయ జీవితంట! తిండి ఉంటేగద కళా, గిళానూ! దృశ్యాలు చూస్తుంటే కడుపు నిండుతుందా? ఆ ఇంట్లో వాతావరణం చూసి, జ్యోతి, నిరాడంబరత్వం అనుకుంది పాపం. అయినా తను, వాస్తవం ఆమెకి ఎందుకు చెప్పలేదో తనకే ఆశ్చర్యంగా ఉంది. అదేమిటో తను దారిద్ర్యం అనుభవిస్తోందని ఎవరికైనా తెలిస్తే తనకి ఎంతో చిన్నతనంగా ఉంటుంది, తమాషా. దారిద్ర్యంలో తప్పేముంది?

ఇంట్లో ఏదో చప్పుడైంది. పిల్లి ఏమూతో పడేసి ఉంటుందని "ఛీ" అని అరుస్తూ లోపలికి పరిగెత్తింది రమ.

"నువ్వు "ఛీ" అన్నా "ఛా" అన్నా కొంప వొదిలిపెట్టి పోటం వొట్టిది," అన్నాడు శ్రీధరరావు నవ్వుతూ.

"మీరా, పిల్లేమో ననుకున్నాను."

"అనుకోవ్రూ! సరేగాని ఆకాఫీ ఏదో ఉంటే ఇయ్యి కాస్త."

"అటూ,ఇటూ తచ్చాడకపోతే పిలవకూడదూ?"

"పిలిస్తే పలికేట్టున్నావా నువ్వు. ప్రకృతిలో లీనమై పోతివి."

"ప్రకృతి, పాడు. ఏదో ఆలోచిస్తూ నిలబడిపోయానుగావును." కాఫీఫ్లాస్కు తీసి గ్లాసులో పోస్తూ అంది రమ.

"ఏమిటబ్బా, అంత దీర్ఘాలోచన?"

"ఇవాళ మా పక్కింటివాళ్ల జ్యోతి వచ్చింది. చిన్నప్పటినించీ ఎంతో కలిసి మెలిసి ఉండేవాళ్లం. పాపం, అది వొస్తే కాఫీకూడా ఇవ్వటానికి లేకపోయె."

"ఏం, ఇవ్వకపోయావు?"

"ఉన్నది కాస్తా దానికిచ్చేస్తే మీకో?"

"అక్కడికి మహా భక్తి ఉన్నట్టు నామీద!"

"సరేగాని, బజారుకు పోయి రావాలి."

"నాకేం అభ్యంతరం లేదు. వెళ్లి రావొచ్చు, నిరాఘాటంగా."

"నేను కాదు, మీరు."

"నేనా? నేను వెళ్లేవొస్తున్నాను."

"సరేలెండి, హాస్యం కాదు. ఈరాత్రికి జ్యోతిని భోజనానికి పిలిచాను."

"చంపావు. బియ్యం ఉన్నయ్యేమో చూసు కున్నావా?

"అందుకనే బజారుకు వెళ్లాలనటం."

"బజారుకి వెడితే ఎవడన్నా బియ్యం ధర్మం చేస్తాడనా నీ అభిప్రాయం?"

"ఏలాగో తిప్పలు పడక తప్పదు. ఏంచేస్తాం."

"ఏం చేసే దేమిటి? అసలు ఆవిడగారిని భోజనానికి పిలవమని ఎవ డేడిచాడు."

"ఏదో మాటవరసకన్నా అనకుండా వుండలేకపోయాను. తీరా అది వొస్తానంటే వొద్దని ఎలా అంటాము?"

"ఆవిడకి పరిస్థితులు తెలియవ్రూ? ఈ కొంపలో ఏమూల చూసినా దారిద్ర్యం విశ్వరూపం ధరించి చిందులు తొక్కుతూంటే ఆమాత్రం గ్రహించుకోలేదా ఆమె?"

"ఇదంతా చూసి, అది మనం నిరాడంబరులం అనుకుంది."

"అనకుండా! లేకపోతే నువ్వు సొంతడబ్బా వాయించావా?"

"అదే ఊహించుకుంది. అయితే నేను కొంచెం శాశం వేసిన మాట నిజమే లెండి."

"ఇంకేం, అలా బయటపెట్టు. రమా, నిన్నే మనాళో నాకేం అర్థం కావటం లేదు. ఎన్నిసార్లు చెప్పాను. నువ్వలా ఎందుకు నటిస్తావో నాకు ఆశ్చర్యంగా ఉంది."

రమ ఏమీ మాట్లాడలేదు.

"దారిద్ర్యం పాపం కాదు; దుర్గుణం అంతకంటే కాదు. మహాములాలే ఈమాటలు అన్నారు. ఇప్పటికి ఏ లక్షసార్లో చెప్పిఉంటాను ఈ మాటలు. నువ్వు మనం బీదవాళ్లమనే సంగతి దాచటానికి ఎందుకు ప్రయత్నిస్తావో నాకు ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థం కావటం లేదు."

"నాకూ కష్టంగానే ఉంది, ఏం చెయ్యను."

"పీకమీదికి తెచ్చి ఏంచెయ్యనంటే ఏం లాభం?"

రమ కొంచెం చిన్నబుచ్చుకుంది. ఆ సంగతి గ్రహించి శ్రీధరరావు కోపం దిగమింగుకుని లేచి ఉత్తరీయం అందుకున్నాడు.

"సరే, తప్పేదేముంది? ఆ సంచీ ఇలా పడెయ్యి. ఎవడన్నా అప్పిచ్చే మూర్ఖుడు ఇంకా ఉన్నాడేమో చూస్తాను."

రమ చేతిసంచీ తెచ్చి ఇచ్చింది. భర్తకోపం పోగొట్టే ఉద్దేశంతో "కొంచెం తొందరగా రండేం" అని లేనినవ్వు తెచ్చుకుని అతని ముఖంలోకి చూసిందామె.

'ఇందులో సిగ్గూ నామోషీ ఏంలేదు. రమా. ఈ దారిద్ర్యం చూసి నువ్వు భయపడి పక్కకి తొలగవొద్దని మాత్రమే నే ననేది. మనం ఈ స్థితిలో ఉన్నామంటే దానికి కారణం మనుష్యసమాజమే. అయినప్పుడు వాళ్ల నించి మనం మన స్థితిని దాచుకోటంలో అర్థంలేదు. సమాజంలోని ప్రతివ్యక్తికీ మనం మన పరిస్థితులు పాఠంగా చెప్పాలి. చెవుల్లో ఇల్లుకట్టుకుని అరవాలి. నిజం తెలిస్తేనే మోక్షం. మన స్థితికి మనం కారణం కానప్పుడు మనం సిగ్గుపడాలిసిం దేమీ లేదు."

ఇంకా ఏదో చెబుదా మనుకుని "ఇప్పుడు సమయంకాదులే" అని మనసు మార్చుకుని బయలు దేరాడు శ్రీధరరావు.

అడుగుదా మనుకున్న వాళ్లందర్నీ అడిగేసి, వాళ్ల చేత లేదనుపించుకుని చిరాగ్గా బజార్లో వడుస్తున్న శ్రీధరరావు, తన భుజంమీద ఎవరిదో చెయ్యి బరువుగా పడటంవల్ల అదిరిపడి పక్కకి తిరిగి చూశాడు. ప్రకాశరావు!

"ఏరా శ్రీధర్, చెవులు చిల్లులుపడేట్టు అరిచినా నీకు వినపడదా ఏం?"

"ఏదో పరాకుగా ఆలోచిస్తున్నాలే. అవును గాని, ఈ మధ్య ఐపులేకుండా పోయావు, ఏమిటి కథ?"

"ఓ, మన కథ కేం, చాలా ఉందిలే. అదంతా తీరిగ్గా చెబుతాను, తరవాత. ముఖ్యవిషయాలు ఏమిటంటే - ఒకటి పెళ్ళికావటం - ఏం అలా చూస్తున్నావు. శుభలేఖ రాలేదనా? నీ అడ్రసు ఎవడికీ చెప్పకుండా ఉంటే, శుభలేఖ ఎలా వొస్తుం దనుకున్నావు? నీ పాతఅడ్రసుకి పంపితే అది కాస్తా తిరిగొచ్చింది. సరే, రెండోది - ఒకానొకప్పుడు పూటకి గతిలేని ప్రకాశరావు ఇవాళ మూడులక్షల డిపాజిటరు - హాస్యంకాదు. అంత తెల్లబోవాలిసిన అవసర మేం లేదులే. లాటరీ, గుర్రపుపందాల లాటరీ- తెలిసిందా? పద, కూల్ డ్రింక్సు రెండు తీసుకుందాం."

శ్రీధరరావు నోరు తెరుచుకుని వింటున్నాడు. మూడు లక్షలు! ప్రకాశరావు సోడాఫౌంటెన్ లోకి దారి తీశాడు.

"నీ సంగతేం చెప్పవేం? ఎంతసేపటికీ కబుర్లు వినటమేగాని చెప్పే అలవాటు లేదుగా నీకు. నువ్వు వొట్టి స్వార్థపరుడివిరా. ఇంకోడు వాగుతుంటే ఆనందించటమేగాని నోటి ముత్యాలు రాలనీయవు."

"ఓ, నాకథే కావలసినంత ఉంది. చెబుతాలే. ముందు ఓ పదిరూపాయ లుంటే ఇలా పారెయ్యి."

"ఏం, కూల్ డ్రింక్స్ పార్టీ చాలలేదా?"

"పార్టీ, గీర్టీ! బజార్లో కొనాలిసిన సామగ్రి బోలెడుంది. ప్రతివాడూ లేదనేవాడే. సమయానికి నువ్వు కనపడ్డావు. బతికాను."

సోడాఫౌంటెన్‌నించి బయటికి వొచ్చారు ఇద్దరూ. శ్రీధరరావు బజార్లో కావలసిన సామగ్రి కొన్నాడు. డబ్బు ప్రకాశరావే ఇచ్చాడు.

"ఏరా, నీ పరిస్థితి ఏంబాగుపడలేదన్నమాట?"

"అతి తెలివిగా మాట్లాడకు. నీలా అకస్మాత్తుగా అందరికీ లక్షలొస్తాయా యేమిటి? అసలే అంతంతమాత్రంగా ఉంటుంటే ఇవాళ్లో శ్రీమతి గారు దిగారు భోజనానికి. నువ్వు సమయానికి ఎదురుపడ్డావుగాని లేకపోతే ఆవిడగారి ముఖం చూడటానికే తలవంపులుగా ఉండేది."

"ఎవరేమిటి ఆ శ్రీమతి?"

"ఎవరోలే, ఎవరైతే నేం. మా శ్రీమతిగారి స్నేహితురాలంట. సరేగాని, నీకథ మొదలుపెట్టు."

ప్రకాశరావు, తను కొన్నాళ్లు ఎలా కష్టపడ్డదీ, తరవాత అకస్మాత్తుగా ధనలాభం ఎలా కలిగిందీ వివరాలతో సహా ఏకరువుపెట్టటం సాగించాడు. కబుర్లతో, నవ్వులతో శ్రీధరరావు ఇంటిదాకా వొచ్చేప్పటికి అప్పుడే సూర్యాస్తమయ మవుతోంది. అంతకి ముందే వొచ్చిన జ్యోతి శ్రీధరరావుఇంట్లో అడుగు పెట్టటం చూసి లోపలిగదిలోకి వెళ్ళిపోయింది. శ్రీధరరావుతో ఇంకో పురుషుడు రావటం చూసి రమకూడా అతని చేతిలో సంచీ తీసుకుని లోపలికి వెళ్లిపోయింది. శ్రీధరరావు తెచ్చిన సంబారాలతో రమ మనసుని అప్పటిదాకా ఆవరించిన ఆందోళన తొలగిపోయింది.

ఆ గదిలో ఉన్న ఒకే ఒక బల్లమీద ప్రకాశరావు ఆసీనుడయాడు. శ్రీధరరావు పెట్టెమీద పరుపు చుట్ట వేసుకుని కూర్చున్నాడు."

"ఇహ నా కథ విను. ఆ రాట్నం ఈ సింగర్ మిషన్. ఇవి రెండూ అహోరాత్రాలు గిరగిర తిరిగితేనే మా డొక్కలాడటం. తెల్లబోతా వెందుకు? నీ స్నేహితుడు శ్రీధర్, టైలర్ కావటం, నీకు అవమానకరంగా ఉందా?"

ప్రకాశరావు ఏమీ మాట్లాడలేదు. అతను కొంచెం ఆశ్చర్యంతో శ్రీధర్ వైపు చూడసాగాడు.

"ఇదికాక ఓ శెట్టిపుట్టినాయనదగ్గిర, ఓ ఎకరం కౌలుకి తీసుకున్నాను. ఇదీ జీవనోపాధి. ఇందులో నువ్వు ఆశ్చర్యపడాలిసిందేమీ లేదు. ట్యూషన్లు ఎందుకు మానేశా నంటావా? కనీసం స్కూల్ ఫైనలయినా ప్యాసుకాని ట్యూటర్‌కి నెలకి ఇద్దరు ముగ్గురికి కలిసి నాలుగు రూపాయలకంటె ఎక్కువివ్వటం అనవసరం అని ఆ పిల్లల తాలూకు తండ్రులు తీర్మానం ప్యాసు చేసుకున్నారు. అంతకంటే ఊరికే నే చెబుతాను. ఇంటికి పంపించమన్నాను. సరే అక్కడికో ఉద్యోగానికి తిలోదకం. ఇహ- ఎస్. ఎస్. ఎల్. సి. కనీసం కంప్లీషన్ సర్టిఫికెట్టయినా లేకపోతే నీ కెవ డుద్యోగం ఇస్తాడయ్యా పొమ్మన్నారు మూర్ఖులు. ఎకనమిక్స్, పాలిటిక్స్ సబ్జెక్టులలో నేను చదివినన్ని పుస్తకాలు ఈ లెక్చరర్లు కాదుగదా, ప్రొఫెసర్లుకూడా చదవలేదని వాళ్లకేం తెలుసు? మొన్న ఐ. ఏ. ఎస్ పరీక్షల్లో ఇచ్చిన ప్రశ్నలకి ఈ గ్రాడ్యుయేట్లు పోస్టుగ్రాడ్యుయేట్లు కూడా తెల్లమొహాలు వేశారట. ఈ శ్రీధరరావు-డిగ్రీలు లేని వీడు-ఒక్కొక్క ప్రశ్నకి ఆ పరీక్షకి వెళ్ళి వొచ్చిన వాళ్లకి సమాధానం చెబుతుంటే వాళ్లకి హడలెత్తి మీరు ఏ యూనివర్సిటీలో ప్రొఫెసరండీ అనడిగారు. అటువంటి వీడికి గుమాస్తాఉద్యోగం చెయ్యటానికి కూడా అర్హతలేదు.

సరే, అదంతా ఎందుకులే ఇప్పుడు. కారణం మైతేనేం ఇప్పుడు నేను చేస్తున్నదిదీ. ఇందుకు కారణ! నీలాంటి లక్షాధికారులే."

"కావొచ్చు."

"కావొచ్చేమిటి, అంతే. ఈ కొంప చూశావా! మనుష్యులు నివసించే కొంపేనా ఇది? నీలాంటి పెద్దమనిషి వొస్తే కూచోమనటానికి ఆ స్టూల్ తప్ప ఇంకోటి లేదు. పడుకోటానికి మంచంలేదు.

"నిజమే."

"ప్రతిమనిషీ, ముఖ్యంగా ప్రతిభవంతుడూ ఈ పరిస్థితి చూసి సిగ్గుపడాలంటావా, లేదా!"

"అవుననుకో, కాని నువ్వలా సహనం విడిచి ఊరికే శోకలు పెడితే లాభమేమిటి? చేసేదేదో నిర్మాణాత్మకంగా ఉండాలి కదా!"

"ఇంకేం, నువ్వుకూడా వాళ్ళలోనే చేరావు. ఒకే, నాలుగుడబ్బులు రాగానే ఉద్దేశాలుకూడా మారతా యేమిటి?"

"నా ఉద్దేశాలుగాని ఆదర్శాలుగాని ఏమీ మారలేదు."

"కబుర్లు చెప్పకు."

ప్రకాశరావు ఏమీ మాట్లాడకుండా చిన్నగా నవ్వి ఊరుకున్నాడు. వీరి సంభాషణంతా లోపల జ్యోతీ, రమా కూడా విన్నారు. రమ సిగ్గుతో తల వొంచుకుంది. జ్యోతి ఆశ్చర్యంతో రమవైపు దృష్టి నిలిపింది. కాని ఆమె రమని ఏమీ అడగలేదు. సంభాషణ మరీ సహించలేకపోయినప్పుడు రమ లేచి వంట ప్రయత్నం చేయసాగింది. జ్యోతికూడా ఆమె వెనకాలే వెళ్ళి సహాయం చేయసాగింది.

"నీ కన్నీ అబద్ధాలు చెప్పాను జ్యోతీ."

"రమా, నువ్వింత కష్టంలో ఉన్నా వనుకోలేదు." రమ మ్లానవదనం చూసి అంది జ్యోతి జాలిగా.

"అయినా, ఆయన మరీ గోరంత కొండంతలుగా చెబుతారు లే, అంత పెద్దగా కొంపలేమీ మునిగిపోలేదు."

జ్యోతి కొనసాగి అంది.

"ఆ వొచ్చినాయన ఎవరో తెలుసా ?"

"ఊఁహూఁ, నువ్వు ఎరుగుదువా ఏమిటి ?" రమ ఆశ్చర్యంతో జ్యోతివైపు చూసింది.

"ఊఁ"

"ఎవరు ?"

"మా వారే."

"ఏమిటీ !" వింతగా చూసింది రమ జ్యోతి ముఖంలోకి.

"అవును. ఆశ్చర్యమేముం దిందులో. మొదట గొంతు వినగానే అనుమానించాను. తరవాత తలుపు సందులోంచి చూశాను."

"అయితే జ్యోతీ, నువ్వు లక్షాధికారిణివా ?" అపనమ్మకంగా ప్రశ్నించింది రమ.

"అవును రమా, లాటరీలో వొచ్చింది."

రమ జ్యోతిదుస్తులవైపు చూసింది.

"మరి ఇంత సామాన్యమైన దుస్తులు కట్టుకున్నా వేం ?"

"నాకు నిరాడంబరంగా ఉండటం చాలా ఇష్టం. ఇప్పుడైతే డబ్బు వొచ్చింది గాని మొదటినించీ ఎక్కడిది ? నేను డబ్బుకి నామనసుపై అధికారాన్ని ఇవ్వదలుచుకోలేదు రమా. ఆయన కూడా అంతే."

ఈ మాటలకి రమ కొంచెం చిన్నబోయింది.

"సరే, మనమందరం కావలసినవాళ్ళమే గనక మనకి తెరచాటు అక్కర్లేదు. మా ఆయనతో పరిచయం చేస్తాను, రా, నీకు."

రమ మొదట సంకోచించినా, తరవాత జ్యోతి ఏమనుకుంటుందో నని ఒప్పుకుంది. గది సుమ్ముంలోకి వొచ్చిన జ్యోతిని చూసి ప్రకాశరావు ఉలిక్కిపడ్డాడు.

"జ్యోతీ! నువ్వా, ఇక్కడా ? అయితే ఆ శ్రీమతివి నువ్వేనన్నమాట."

శ్రీధరరావు ఏమీ అర్థం గాక ప్రకాశరావు వైపూ, జ్యోతివైపూ చూడసాగాడు.

"అయితే మా డబ్బుతో మాకే విందు చేస్తావుట్రా నువ్వు ?"

నవ్వాడు శ్రీధరరావు ప్రకాశరావు మాటల్లో అర్థం గ్రహించి. "చాలా తమాషాగా ఉందే. మా భార్యాభర్తలు మీ భార్యాభర్తల్ని సినిమా కథలోలాగా కలుసుకున్నాం. అయితే ఆ భోజన మేదో నాకు కూడా ఏర్పాటు చేయిస్తావా, ఏ మమ్మా"

"ఓ, నాకథ కావలసినంత ఉంది. చెబుతాలే. ముందు ఓ పదిరూపాయ లుంటే ఇలా పారెయ్యి."

"ఏం, కూల్ డ్రింక్స్ పార్టీ చాలలేదా?"

"పార్టీ, గీర్టీ! బజార్లో కొనాలిసిన సామగ్రి బోలెడుంది. ప్రతివాడూ లేదనేవాడే. సమయానికి నువ్వు కనపడ్డావు. బతికాను."

సోడాఫౌంటెన్‌నించి బయటికి వొచ్చారు ఇద్దరూ. శ్రీధరరావు బజార్లో కావలసిన సామగ్రి కొన్నాడు. డబ్బు ప్రకాశరావే ఇచ్చాడు.

"ఏరా, నీ పరిస్థితి ఏంబాగుపడలేదన్నమాట?"

"అతి తెలివిగా మాట్లాడకు. నీలా అకస్మాత్తుగా అందరికీ లక్షలొస్తాయా యేమిటి? అసలే అంతంతమాత్రంగా ఉంటుంటే ఇవాళో శ్రీమతిగారు దిగారు భోజనానికి. నువ్వు సమయానికి ఎదురు పడ్డావుగాని లేకపోతే ఆవిడగారి ముఖం చూడటానికే తలవంపులుగా ఉండేది."

"ఎవ రేమిటి ఆ శ్రీమతి?"

"ఎవరోలే, ఎవరైతే నేం. మా శ్రీమతిగారి స్నేహితురాలుట. సరేగాని, నీకథ మొదలుపెట్టు."

ప్రకాశరావు, తను కొన్నాళ్లు ఎలా కష్టపడ్డదీ, తరవాత అకస్మాత్తుగా ధనలాభం ఎలా కలిగిందీ వివరాలతో సహా ఏకరువుపెట్టటం సాగించాడు. కబుర్లతో, నవ్వులతో శ్రీధరరావు ఇంటిదాకా వొచ్చేప్పటికి అప్పుడే సూర్యాస్తమయ మవుతోంది. అంతకిముందే వొచ్చిన జ్యోతి శ్రీధరరావుఇంట్లో అడుగుపెట్టటం చూసి లోపలిగదిలోకి వెళ్ళిపోయింది. శ్రీధరరావుతో ఇంకో పురుషుడు రావటం చూసి రమకూడా అతని చేతిలో సంచీ తీసుకుని లోపలికి వెళ్లిపోయింది. శ్రీధరరావు తెచ్చిన సంబారాలతో రమ మనసుని అప్పటిదాకా ఆవరించిన ఆందోళన తొలగిపోయింది.

ఆ గదిలో ఉన్న ఒకే ఒక బల్లమీద ప్రకాశరావు ఆసీనుడయాడు. శ్రీధరరావు పెట్టెమీద పరుపు చుట్ట వేసుకుని కూర్చున్నాడు."

"ఇహ నా కథ విను. ఆ రాట్నం ఈ సింగర్ మిషన్. ఇవి రెండూ అహోరాత్రాలు గిరగిర తిరిగితేనే మా డొక్కలాడటం. తెల్లబోతా వెందుకు! నీస్నేహితుడు శ్రీధర్, టైలర్ కావటం, నీకు అవమానకరంగా ఉందా?"

ప్రకాశరావు ఏమీ మాట్లాడలేదు. అతను కొంచెం ఆశ్చర్యంతో శ్రీధర్ వైపు చూడసాగాడు.

"ఇదికాక ఓ పెట్టిపుట్టినాయనదగ్గిర, ఓ ఎకరం కౌలుకి తీసుకున్నాను. ఇదీ జీవనోపాధి. ఇందులో నువ్వు ఆశ్చర్యపడాలిసిందేమీ లేదు. ట్యూషన్లు ఎందుకు మానేశా నంటావా? కనీసం స్కూల్ ఫైనలయినా ప్యాసుకాని ట్యూటర్‌కి నెలకి ఇద్దరు ముగ్గురికి కలిసి నాలుగు రూపాయలకంటె ఎక్కువివ్వటం అనవసరం అని ఆ పిల్లల తాలూకు తండ్రులు తీర్మానం ప్యాసు చేసుకున్నారు. అంతకంటే ఊరికేనే చెబుతాను. ఇంటికి పంపించమన్నాను. సరే అక్కడికో ఉద్యోగానికి తిలోదకం. ఇహ- ఎస్. ఎస్. ఎల్. సి. కనీసం కంప్లీషన్ సర్టిఫికెట్టయినా లేకపోతే నీ కెవ డుద్యోగం ఇస్తాడయ్యా పొమ్మన్నారు మూర్ఖులు. ఎకనమిక్సు, పాలిటిక్సు సబ్జెక్టులలో నేను చదివినన్ని పుస్తకాలు ఈ లెక్చరర్లు కాదుగదా, ప్రొఫెసర్లుకూడా చదవలేదని వాళ్లకేం తెలుసు! మొన్న ఐ. ఏ. ఎస్ పరీక్షల్లో ఇచ్చిన ప్రశ్నలకి ఈ గ్రాడ్యుయేట్లు పోస్టుగ్రాడ్యుయేట్లు కూడా తెల్లమొహాలు వేశారట. ఈ శ్రీధరరావు-డిగ్రీలు లేని వీడు-ఒక్కొక్క ప్రశ్నకి ఆ పరీక్షకి వెళ్ళి వొచ్చిన వాళ్లకి సమాధానం చెబుతుంటే వాళ్లకి హడలెత్తి మీరు ఏ యూనివర్శిటీలో ప్రొఫెసరండీ అనడిగారు. అటువంటి వీడికి గుమాస్తాఉద్యోగం చెయ్యటానికి కూడా అర్హతలేదు.

సరే, అదంతా ఎందుకులే ఇప్పుడు. కారణం మైతేనేం ఇప్పుడు నేను చేస్తున్నదిదీ. ఇందుకు కారణ, నీబోటి లక్షాధికారులే."

"కావొచ్చు."

"కావొచ్చేమిటి, అంతే. ఈ కొంప చూశావా! మనుష్యులు నివసించే కొంపేనా ఇది! నీబోటి పెద్దమనిషి వొస్తే కూచోమనటానికి ఆ స్టూల్ తప్ప ఇంకోటి లేదు. పడుకోటానికి మంచంలేదు.

"నిజమే."

"ప్రతిమనిషీ, ముఖ్యంగా ప్రతిభావంతుడూ ఈ పరిస్థితి చూసి సిగ్గుపడాలంటావా, లేదా!"

"అవుననుకో, కాని నవ్వలా సహనం విడిచి ఊరికే కేకలు వేస్తే లాభమేమిటి? చేసేదేదో నిర్మాణాత్మకంగా ఉండాలి కదా!"

"ఇంకేం, నువ్వుకూడా వాళ్ళలోనే చేరావు' ఒకే, నాలుగుడబ్బులు రాగానే ఉద్దేశాలుకూడా మారతా యేమిటి?"

"నా ఉద్దేశాలుగాని ఆదర్శాలుగాని ఏమీ మారలేదు."

'కబుర్లు చెప్పకు."

ప్రకాశరావు ఏమీ మాట్లాడకుండా చిన్నగా నవ్వి ఊరుకున్నాడు. వీరి సంభాషణంతా లోపల జ్యోతీ, రమా కూడా విన్నారు. రమ సిగ్గుతో తల వొంచుకుంది. జ్యోతి ఆశ్చర్యంతో రమవైపు దృష్టి నిలిపింది. కాని ఆమె రమని ఏమీ అడగలేదు. సంభాషణ మరీ సహించలేకపోయినప్పుడు రమ లేచి వంట ప్రయత్నం చేయసాగింది. జ్యోతికూడా ఆమె వెనకాలే వెళ్ళి సహాయం చేయసాగింది.

"నీ కన్నీ అబద్ధాలు చెప్పాను జ్యోతీ."

"రమా, నువ్వింత కష్టంలో ఉన్నా వనుకో లేదు." రమ మ్లానవదనం చూసి అంది జ్యోతి జాలిగా.

"అయినా, ఆయన మరీ గోరంత కొండంతలుగా చెబుతారు లే, అంత పెద్దగా కొంపలేమీ మునిగిపో లేదు."

జ్యోతి కాసేపాగి అంది.

"ఆ వొచ్చినాయన ఎవరో తెలుసా?"

"ఊఁహూఁ, నువ్వు ఎరుగుదువా ఏమిటి?" రమ ఆశ్చర్యంతో జ్యోతివైపు చూసింది.

"ఊఁ."

"ఎవరు?"

"మా వారే."

"ఏమిటీ!" వింతగా చూసింది రమ జ్యోతి ముఖంలోకి.

"అవును. ఆశ్చర్యమేముం దిందులో. మొదట గొంతు వినగానే అనుమానించాను. తరవాత తలుపు సందులోంచి చూశాను."

"అయితే జ్యోతీ, నువ్వు లక్షాధికారిణివా?" అపనమ్మకంగా ప్రశ్నించింది రమ.

"అవును రమా, లాటరీలో వొచ్చింది."

రమ జ్యోతిదుస్తులవైపు చూసింది.

"మరి ఇంత సామాన్యమైన దుస్తులు కట్టుకున్నావేం?"

"నాకు నిరాడంబరంగా ఉండటం చాలా ఇష్టం. ఇప్పుడైతే డబ్బు వొచ్చింది గాని మొదటినించీ ఎక్కడిది! నేను డబ్బుకి నామనసుపై అధికారాన్ని ఇవ్వదలుచుకోలేదు రమా. ఆయన కూడా అంతే."

ఈ మాటలకి రమ కొంచెం చిన్నబోయింది.

"సరే, మనమందరం కావలసినవాళ్ళమే గనక మనకి తెరచాటు అక్కర్లేదు. మా ఆయనతో పరిచయం చేస్తాను, రా, నీకు."

రమ మొదట సంకోచించినా, తరవాత జ్యోతి ఏమనుకుంటుందో నని ఒప్పుకుంది. గది గుమ్మంలోకి వొచ్చిన జ్యోతిని చూసి ప్రకాశరావు ఉలిక్కిపడ్డాడు.

"జ్యోతీ! నువ్వా, ఇక్కడా? అయితే ఆ శ్రీమతివి నువ్వేనన్నమాట."

శ్రీధరరావు ఏమీ అర్థం గాక ప్రకాశరావు వైపూ, జ్యోతివైపూ చూడసాగాడు.

"అయితే మా డబ్బుతో మాకే విందు చేస్తావ్రా నువ్వు?"

నవ్వాడు శ్రీధరరావు ప్రకాశరావు మాటల్లో అర్థం గ్రహించి. "చాలా తమాషాగా ఉందే. మా భార్యాభర్తలు మీ భార్యాభర్తల్ని సినిమా కథలోలాగా కలుసుకున్నాం. అయితే ఆ భోజనమేదో నాకు కూడా ఏర్పాటు చేయిస్తావా, ఏమమ్మా"

"రమ" అంది జ్యోతి అందిస్తూ.

"ఏమమ్మా, రమా. మీ ఆయన ఇప్పటికే గుని కాడు. అయినా వాడి ఇష్టంతో నాకేమీ నిమిత్తం లేదనుకో."

"నీ డబ్బుతో నీకు తిండి పెట్టటానికి నా కభ్యంతర మేమి టోయ్. చేసేది రమకనుక రమని అడగటమే సమంజసం లే."

రమ సిగ్గుగా నవ్వింది.

"మా జ్యోతి కూడా పని చెయ్యటానికి సంకోచించదు లే."

అంతా నవ్వారు. రమ, జ్యోతి వంటపనిమీద లోపలికి వెళ్ళిపోయారు. శ్రీధరరావు మళ్ళీ తన ఉపన్యాసం ప్రారంభించాడు. "కానీలే, ఇంకో గంట సేపు ఎలాగో ఓపికపడతాలే." అన్నాడు ప్రకాశరావు.

భోజనా లయిపోయాయి. ప్రకాశరావూ జ్యోతీ సెలవు తీసుకున్నారు. శ్రీధరరావు తీరిగ్గా పడుకున్నాడు.

"మీ దారిద్ర్యంగురించి ఉపన్యాసం ఇవ్వటానికి జ్యోతి ఉన్నప్పుడే సమయం దొరికింది కాబోలు." కోపంగా అంది రమ, ఇందాక తనకి జరిగిన పరాభవాల నెమరు వేసుకుంటూ.

"జ్యోతి వింటుందనే ఊహ పోలేదు నాకు."

"అయినా ప్రతివాళ్ళతో ఎందుకీ గొడవ! ఊరికే రభసపడి నలుగురి నోళ్ళలో పడితే ఒరిగే దేమిటి?"

"లక్షసార్లు చెప్పాను. దారిద్ర్యం పాపం కాదు; దుర్గుణం అంతకంటె కాదని. నువ్వు వినిపించుకోవు కదా ఖర్మం."

"అసంతృప్తిపడితే దానికి తగిన విరుగుడు చూడాలి గాని, రభసపడటం అనవసరం. వాళ్ళకీ వీళ్ళకీ మేం ఇలా బతుకుతున్నాం అని ప్రదర్శించుకోటం ఎందుకంట"

"నీవాదన నీది, నావాదన నాది. నువ్వు నేను చెప్పే దాన్నర్థం చేసుకోటానికి ప్రయత్నించవు. నేను ధనికసమాజం చేసిన రోగిని అని ఎలుగెత్తి అరిస్తేకాని నాకు తృప్తిలేదు. ఈ ఆర్థికవ్యవస్థ మారాలంటే, గుప్పుచప్పుగా మనఖర్మ ఇంతేలే అని సరిపెట్టుకుంటే ఎలా మారుతుంది?"

"అది సరే లెండి. దారిద్ర్యం ఎక్కడపడితే అక్కడే ఉందని అందరికీ తెలుసు. దాన్ని తెలియబరచటానికి ప్రయత్నించటం అనవసరం. కాగా, పరిస్థితులు చక్కబరచటానికి తగిన కృషి— ఇప్పుడు కావలసింది." శ్రీధరరావు మాట్లాడలేదు.

"ఓ విషయం మీతో చెప్పాలని చాలా రోజుల్నించీ అనుకుంటున్నాను."

"ఏమి టది?"

"దారిద్ర్యం పెట్టిన పరీక్షకి మనం ఆగలేక పోతున్నామేమో ననిపిస్తుంది నాకు ఒక్కొక్కప్పుడు."

"మనం కాదు, నువ్వు. నేనా సంగతి నీ కిదివరకే చెప్పాను."

"జ్యోతి కూడా మాటలసందర్భంలో ఈ అభిప్రాయం వొచ్చేట్టే అంది. మొదట్లో ఈ దారిద్ర్యం భరించటం దుస్సహం అనుకుందట. కాని అది రాను రాను, ప్రతివిషయాన్నీ నిర్లక్ష్యంగా చూడటం మొదలు పెట్టిందట. ఒక్కొక్కపూట పస్తు కూడా ఉండేవాళ్ళట వాళ్ళు. కాని అది ఏమీ తొణికేదికాదుట. అది ఓ లెక్కలోని విషయం కానట్టుగా ఉండేదిట. రానురాను దానికి ఓ విధమైన ధైర్యం స్థైర్యం, దారిద్ర్య మంటే నిర్భయం కలిగా యంటుంది."

"సరేలే, ఇహ పడుకో," అన్నాడు శ్రీధరరావు ముఖం చిట్లించుకుని.

ఆ రాత్రంతా రమకి ఏవేవో ఆలోచనలొచ్చాయి. ఆమెకి లోకంలోని ధనవంతు లందరిమీదా చెప్పలేనంత కోపం వొచ్చింది. అసలు ఈ డబ్బనేది కొంతమందిదగ్గిరే ఎందుకు కుప్పలుగా పడి ఉండాలి? ప్రభుత్వం బీదవాళ్ళందరికీ ఎందుకు ధనసహాయం చెయ్యకూడదు? అసలు బీదవాళ్ళు అనే

వాళ్లు ఎలా ఏర్పడ్డారు? ఇలాంటి ప్రశ్నలు వేసుకుంటూ వాటికి సమాధానాలు చెప్పుకుంటూ ఆమె నిద్రని దూరం చేసుకుంది. ఈ ఆలోచనల్లో ఆమెకి హఠాత్తుగా ఓ ఆశ కలిగింది. తనకికూడా జ్యోతి, ప్రకాశరావులకి మల్లే ఏ లాటరీలోనో ఓలక్ష, పోనీ యాభై వేలు, కనీసం పాతిక వేలైనా వొస్తే...

కుట్టుయంత్రం చప్పుడుకి రమ పక్కనుంచి లేచింది కళ్లు నలుపుకుంటూ. బారెడు పొద్దెక్కింది. బర్రున ధ్వనిచేస్తూ తిరిగే ఆ మిషన్ చక్రం వైపూ, శ్రీధరరావువైపూ చూసి ఓ నిట్టూర్పు విడిచిందామె.

"సూర్యారావు వొచ్చాడు, లే, ఇంకా నిద్రేమిటి?"

రమ గబుక్కున లేచి ద్వారంవైపు చూసింది. ఎవరూ కనపడలేదు.

"ఏరీ, ఎవరూ లేరే?"

"ఇక్కడికి వొచ్చాడని ఎవరన్నారు?"

"మరెక్కడికి, అసలు సూర్యారావెవరు?"

"సూర్యభగవానుడు. గడియారాలు కొనుక్కోలేని మనబోటి వాళ్లకి టైము చెప్పే మహానుభావుడు."

రమ మొదట నవ్వింది. కాని శ్రీధరరావుఅన్న చివరిమాటలు ఆమెకి మళ్లీ తన దారిద్ర్యం జ్ఞప్తికి తేగా, ఆమెనవ్వు అంతలోనే అంతరించింది.

శ్రీధరరావు ఆమెవైపు నవ్వుతూ ఓసారి చూసి మళ్లీ తనపనిలో నిమగ్నుడయాడు.

"పొద్దున్నే ఈపాడుమోత మొదలు పెట్టారేమిటి?"

"రెక్కలాడితేనే డొక్కలాడటం."

శ్రీధరరావు టైలర్‌వృత్తిలో ప్రవేశించటం కొంచెం చిత్రమైన సంగతే. చిన్నప్పుడు వాళ్లవూళ్లో కొంతమంది చేరి, నేర్చుకునేవాళ్లందరికి ఉచితంగా కొన్ని చేతిపనులు నేర్పారు. ఉత్సాహం కొద్దీ శ్రీధరరావు రాట్నం వొడకటం, బట్ట నేయటం, మిషన్ కుట్టుపని, వడ్రంగంలాంటి గృహపరిశ్రమలు కొన్ని నేర్చుకున్నాడు. ఆర్థికపరిస్థితులవల్ల అతనికి స్కూల్ ఫైనల్ చదువుతూ మధ్యలోనే మానేసి స్వయంకృషివల్ల తిండి సంపాదించుకోవలసిన అగత్యంకలిగింది. ఆ ఊరు విడిచేసి పక్కన ఉన్న బస్తీలో చేరి ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. కాని ఏమీ దొరక్కపోవటం వల్ల ట్యూషన్లు చెప్పి పొట్ట పోసుకోసాగాడు. ఆ సమయంలోనే అతనికి వివాహమైంది. ట్యూషన్ల వల్ల వొచ్చేడబ్బు ఒక్కడికే సరిగా సరిపోయేదికాదు. ఈ స్థితిలో అతనికి అదృష్టంవల్ల ఓ లాటరీలో కుట్టుమిషన్ వొచ్చింది. లాటరీలు వేయటం అతనికి అలవాటు లేకపోయినా అతను చదువుచెప్పే ఓ కుర్రవాడి తండ్రి ఈ లాటరీ నిర్వహించటంవల్ల అతను బలవంతం చేసి శ్రీధరరావుకి ఓ టిక్కట్టు అంటగట్టాడు. కుట్టుమిషన్ అమ్మేసి ఆ డబ్బుతో కొన్నాళ్లు హాయిగా గడిపేద్దామని అతను మొదట అనుకున్నాడు. కాని మళ్లీ అభిప్రాయం మార్చుకుని టైలర్‌వృత్తి సాగించాడు. ఆ ఊళ్లోనే ఉన్న ఓ రెడీమేడ్ డ్రెస్ షాప్‌లో ఆర్డర్లు తీసుకునేవాడు. ఆ ఆర్డర్లే అతనికి పూర్తిపని కలిగించటంవల్ల మరోచోటికి ఆర్డర్లకోసం వెతుక్కోవలసిన అవసరం కలగలేదతనికి.

శ్రీధరరావు చదివింది స్కూల్‌ఫైనలే అయినా, లైబ్రరీలో చాలా పుస్తకాలు చదివి మంచి విజ్ఞానం సంపాదించుకున్నాడు. అతనికి తనచుట్టూ ఉన్న వాతావరణంవల్ల తీవ్రమైన అసంతృప్తి కలిగింది. ఒక్కొక్కప్పుడు ఆలోచిస్తూ, ఈ టైలర్‌వృత్తి వల్ల తనకి ఓ విధమైన మానసికతృప్తి కలుగుతున్నదని అనుమానించేవాడు; ఏదో కసి తీరుతున్నట్లుగా భావించేవాడు.

ప్రకాశరావు వొచ్చి వెళ్లి నాలుగు రోజులైంది. ఐదోరోజు అతనిదగ్గరనుంచి శ్రీధరరావుకో ఉత్తరం వొచ్చింది.

"శ్రీధర్, ఈ ఉత్తరంతో పాటు అయిదువేలకి ఓ డ్రాఫ్టు పంపుతున్నాను. నీ కెలాగో రెడీమేడ్ డ్రెస్‌వ్యాపారంలో అనుభవం ఉందిగనుక, ఈ డబ్బుతో ఓ కొట్టు తెరవొచ్చు. ఓ అరడజను కుట్టుమిషన్లకి ఆర్డరిచ్చాను. అవి సరాసరి నీ అడ్రసుకే

వొస్తాయి. స్వంతంగా కుట్టించి అమ్మితే మంచిలాభం ఉండొచ్చు. నా కెలాగా హోల్‌సేల్ బట్టలషాపు ఉందాయె. నీకు అరేట్లకే వాటిని పంపుతాను. నువ్వు సమర్థంగా నిర్వహించగల వని నాకు నమ్మకం ఉంది. వెంటనే పని మొదలుపెట్టు—నీ, ప్రకాశరావు."

ఆ ఉత్తరం చదివి శ్రీధరరావు హుషారుగా రమమీదికి విసిరేశాడు. ఆమె ఉలిక్కిపడి, తిప్పుతూన్న రాట్నంచక్రం వొదిలి వెనక్కి తిరిగి చూసింది.

"ఆ ఉత్తరం చదువు. ఇంకా రాట్నమెందుకు? అవతల పారెయ్యొచ్చు."

రమ ఉత్తరం చదివింది. ఆమెకి సంతోషంగానే ఉన్నా, తనస్నేహితురాలిదగ్గిర్నుంచి తీసుకోటం తనహోదాకి భంగం అని కొంచెం సిగ్గుపడ్డది.

"జ్యోతి ఇటువంటి పనేదో చేస్తుందని అనుకుంటూనే ఉన్నా. ఇంతకీ ఏంచేస్తారు ఈ డ్రాఫ్టు"?

"బ్యాంకుకి తీసుకెళ్లి మారుస్తాను. ఏం చేసేదేమిటి?"

"ధర్మం తీసుకోటం, మన కేమంత ఘనం?"

"ధనవంతుడు డబ్బిస్తే అది ధర్మం కాదు. తను చేసిన దోపిడీలోంచి కొంత మళ్లీ తిరిగివ్వటం మాత్రమే."

"ప్రకాశరావు ఎవరిదగ్గిర్నుంచి దోపిడీ చేశాడు?"

"డబ్బు కూడబెట్టినవాడు దోపిడిగాడే. ఎలా కూడబెట్టినా సరే."

ఇహ కాలం వృథాచెయ్యకుండా వెంటనే లేచి ఉత్తరీయం తీసుకుని బ్యాంకువైపు హుటాహుటిగా వెళ్లాడు శ్రీధరరావు.

ఒక్కొక్కటిగా నాలుగేళ్లు గడిచిపోయాయి. శ్రీధరరావుకి ఇప్పుడు పెద్ద డ్రెస్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ ఉంది. దానికి రాజధాని అంతటా బ్రాంచీలు ఉన్నాయి. ఇప్పుడు శ్రీధరరావు ఉంటున్నది ఓ పెద్ద మేడలో. అతని కింద ఎంతోమంది పనివాళ్లున్నారు.

అత నీ స్థితికి రావటానికి ప్రకాశరావు చాలా సహాయం చేశాడు. రొక్కరూపంగా పదిహేను వేల రూపాయలు అతనికి శ్రీధరరావు బాకీ ఉన్నాడు. తిరిగి ఇస్తానంటే "ఇప్పుడేం తొందరలే, ఉంచు" అనేవాడు ప్రకాశరావు.

ఈ నాలుగేళ్ళలో ప్రకాశరావు, జ్యోతీ శ్రీధరరావుఇంటికి నాలు గైదుసార్లు వొచ్చి వెళ్లారు. రమకి ఇప్పుడు ఇద్దరు పిల్లలు. ఒక మగపిల్లవాడు, ఒక ఆడపిల్ల; జ్యోతికి ఒక మగపిల్లవాడు.

దసరాపండక్కి వొచ్చి రెండు రోజు లుండి పొమ్మని రమ ఉత్తరం రాస్తే, జ్యోతి ప్రకాశరావు వొచ్చారు.

ఆరోజు బజారుకి ఏవో కొంటానికి వెడదామని ముస్తాబవుతూ తన ఆభరణాలు, చీరలు జ్యోతికి చూపించడం మొదలుపెట్టింది రమ.

"ఈ సిల్కుచీర చూశావా జ్యోతీ, ఎంత బావుందో! ఇది ఎంత చేస్తుందో చెప్పు చూద్దాం."

"ఎందుకు రమా, ఇంతింత ఖరీదులు పెట్టి ఇటువంటి చీరలు కొన్నావు? అనవసరపు ఖర్చు కదూ?"

"నీక్కూడా ఆయనకి పట్టిన పిచ్చే పట్టినట్టుంది. నా కంతేలే, ఏది కొందామన్నా, ఎందుకు! డబ్బు దండగ, అనటమే గాని, ముచ్చటగా ఫలానిది కొందామా అని అడగటంలేదు గదా!"

జ్యోతి నిశ్చలంగా రమవైపు చూసింది. జ్యోతి దగ్గిరనుంచి ఉత్సాహకరమైన నవ్వుగాని, సమాధానంగాని రాకపోవటంవల్ల రమ కొంచెం నిరుత్సాహపడ్డది.

"నీతో ఓ విషయం చెప్పాలి రమా. నాకు ఇటువంటి చీరలు కట్టుకోటమంటే తగని భయం."

"భయ మెందుకు?" వింతగా చూసింది రమ.

"ఇవి కట్టుకుంటే నాకు ఏదో తప్పు చేస్తున్నట్టుగా ఉంటుంది."

రమకి కొంచెం విసుగు పుట్టింది. "అయినా, అర్హత ఉండొద్దూ కట్టుకోటానికి, పుట్టుకతో రావాలి గాని..." అనే ఊహ రమ మనస్సుకి తట్టింది.

కాని జ్యోతినిగురించి అటువంటి చెడ్డ ఊహ తనకి కలిగినందుకు తరవాత సిగ్గుపడ్డది.

"ఓ సారి నేను పట్టుచీర కట్టుకుని బజారుకి వెళ్ళివచ్చి బద్ధకంతో దానితోనే పడుకున్నాను. ఆరాత్రి నాకు ఓ పీడకల వొచ్చింది. ఎంత భయంకరంగా ఉందనుకున్నావు!"

రమ నిరుత్సాహంగానే వింటున్నది.

"కలలో ఎన్నో వేల పురుగులు కనిపించాయి. ఎంత వికృతంగా ఉన్నాయనుకున్నావు! తలుచుకుంటే ఇప్పటికీ భయమేస్తోంది. తరవాత ఆ పురుగులు మనిషితలకాయల్లా మారాయి. అవి నావైపు ఉరిమిచూస్తూ కటువుగా, గట్టిగా అరవటం సాగించాయి."

"ఏమని?" రమ, కాస్త భీతితో ముడుచుకొని, ప్రశ్నించింది.

"'నీకు సిగ్గు లేదా? నీ సౌఖ్యంకోసం, నీ ఆనందంకోసం, నీ స్వార్థంకోసం మేం కష్టించి ఉత్పత్తి చేసినపట్టును దొంగిలించటానికి, కాదు, బందిపోటు వెయ్యటానికి—నీకు చేతు లెలా వొచ్చాయి. మా సమాధులమీదనే నీ భవనం నిర్మించుకుంటే గాని నీకు తృప్తి లేదా? నువ్వు సిల్కుచీర కట్టుకుని కులకాలంటే మాబోటివాళ్లు ఎంతమంది నశించాలో నీకు తెలియదా, నీకు హృదయం లేదా, ఛీ' ఇలా."

రమమనస్సు కదలబారింది. ఆమె ఆ సిల్కుచీరలన్నీ మడిచి మళ్లీ పెట్టెలో పెట్టేసింది. సాదా చీర తీసి కట్టుకుని జ్యోతితోసహా బజారుకు వెళ్లింది. ఇద్దరూ ఓ నగలకొట్లోకి వెళ్లారు. కొన్ని ఉంగరాలు పరీక్షించింది రమ.

"ఈ ఉంగరాలు బావుండలేదు. ఇంకా రకాలుంటే చూపించండి."

నగలకొట్టువర్తకుడు ఇంకా కొన్ని నమూనాలు చూపించాడు. రమకి అవేవీ నచ్చలేదు. ఆమె దృష్టి అద్దాలలోంచి మెరుస్తున్న ఓ ఉంగరాల సమూహంమీద పడ్డది.

"అవి తియ్యండి."

నగలవర్తకుడు ఓ చిన్న నవ్వు నవ్వి అన్నాడు.

"అబ్బో! అవి చాలా ఖరీదువి లెండి, అవి మీరెక్కడ కొనగలరు."

రమకి అభిమానం ముంచుకొచ్చింది. అతని మాటలు ఆమెకి ఎంతో అవమానకరంగా, హేళనగా తోచాయి.

"అవే కావాలి, తియ్యండి." దృఢంగా, గర్వంగా అంది ఆమె. నగలవర్తకుడు ఆమెవైపు ఓ సారి ఆశ్చర్యంగా చూసి ఆమెకోరిన ఉంగరాలు తీసి చూపించాడు. రమ వాటిలోంచి ఓ ఉంగరం ఏరి ఖరీదడిగింది.

"పదిహేను వందలు."

రమకి ముచ్చెమటలు పోశాయి. శ్రీధరరావు ఏమంటాడో? అయినా ఇప్పుడు వెనక్కి తగ్గటంకంటె ఆత్మహత్యచేసుకోటం నయం అనుకుం దామె. ఆ వర్తకుడి నడిగి ఓ కాగితం, కలం తీసుకుని శ్రీధరరావుకి ఉత్తరం రాసింది ఓ పదిహేనువందలకి చెక్కు పంపమని.

"మీ గుమాస్తాచేత ఈ అడ్రసుకు ఈ కాగితం పంపండి కాస్త. చెక్కు వొస్తుంది.'

అడ్రసు చదివి నగలవర్తకుడు కొంచెం పశ్చాత్తాపపడ్డట్టు ముఖంపెట్టి అన్నాడు.

"మీరు శ్రీధరరావుగారి తాలూకా? ఎవరో అనుకున్నాను. క్షమించండి. ఇదిగో ఉంగరం తీసుకు వెళ్లండి. మా గుమాస్తాని మీతో పంపుతాను. దయచేసి చెక్కు ఇప్పించండి."

ఈమాటలు విని రమ కాస్త సర్దుకుంది. ఇందాకటి అవమానం కొంచెం తీరినట్టు ఆమె తలచింది. అయినా, అసలు ఇదంతా జ్యోతివల్లే జరిగింది. అది అడ్డుపెట్టకపోతే తను శుభ్రంగా సిల్కుచీర కట్టుకుని వొచ్చేది. అప్పుడు వర్తకుడు తనని చూసి అలా

అనగలిగే వాడా ? జ్యోతిమీద ఓ క్షణం రమకి కొంచెం కోపం తోబాటు ఏహ్యం కూడా కలిగింది. కాని మరుక్షణమే తన భావాలకి ఆమె పశ్చాత్తాప పడ్డది. మొదటినించీ చివరదాకా జ్యోతి ఈ వ్యవహారం చూస్తూనే ఉన్నది కాని ఏమీ మాట్లాడలేదు; అలాంటి పరిస్థితిలో తను ఏమి మాట్లాడినా విలువ ఉండదని ఆమె గ్రహించింది.

ఇంటికి వెళ్ళే దారిలో కూడా జ్యోతి, అంత విలువైన ఉంగరం ఎందుకు కొన్నావని రమని అడగలేదు. కాని రమ, జ్యోతి అలా తప్పకుండా అడుగుతుందని అనుకుంది. అలా అడిగిఉంటే రమకి ఓవిధమైన సంతృప్తి కలిగిఉండేది.

ఇంటికి వెళ్ళేప్పటికి శ్రీధరరావు ఎక్కడికో బయలుదేరబోతున్నాడు. సంకోచిస్తూనే రమ అతనికి ఉంగరం చూపించి పదిహేనువందలకి చెక్కు రాసివ్వమని మెల్లిగా అడిగింది. ఖరీదు వినేసరికి శ్రీధరరావు ఉలిక్కిపడ్డాడు.

"పదిహేను వందలా ? నీ కేమైనా మతి పోతోందా ఏమిటి రమా ?"

రమ, జ్యోతి ఈ మాటలువింటుందేమో నని భయపడుతూ వెనక్కి తిరిగి చూసింది. కాని జ్యోతి అక్కడ లేకపోవటంవల్ల తన గదిలోకి పోయివుంటుందని ఊహించి స్థిమితపడి, అంది.

"ముందు ఆ చెక్కు రాసి ఇచ్చి అతనిని పంపించెయ్యండి. ఎందుకు కొనవలసి వచ్చిందో తరవాత చెబుతాను."

శ్రీధరరావు బయటికి ఏమీ అనలేక చెక్కు రాసిచ్చి ఆ గుమాస్తాని పంపేశాడు.

"అయినా నీకు మరీ అతిశయం ఎక్కువైంది రమా." కోపంగా అన్నాడతను. రమకి కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.

"నీకు రోజురోజుకీ పీనాసితనం ఎక్కువై పోతోంది. ఏది కొన్నా ఇంతే. ఎందుకు డబ్బు వుండి, ఉపయోగపడకపోయిం తరవాత !"

"ఇటువంటి ఖర్చు లన్నీ చేస్తే మనం మళ్లీ మొదటి స్థితికే వొస్తాం." పూర్వపు దారిద్ర్యం తలపుకొచ్చి శ్రీధరరావు భుజాలు ఎగరవేశాడు. ఇప్పటికి ఆరోజులు జ్ఞాపకం వొస్తే అతనికి ఎందుకో చెడ్డ భయంగా ఉంటుంది. మళ్లీ ఆ నరకంలో పడితే సహించటం దుస్సాధ్యం అనుకుంటాడతను.

అనవసరపు ఖర్చుల్ని గురించి రమకీ, శ్రీధరరావుకీ చాలాసార్లు వాగ్వాదం జరిగింది. రమ కారు కొనాలని చాలా రోజులనించి పంతం పట్టింది. అతనికిమాత్రం ఈ ఖర్చు ఇష్టంలేదు. ఇప్పుడతని మనస్తత్వం, బ్యాంకులో అకౌంటు పెరుగుతూ ఉండాలిసిందే గాని తగ్గరాదనీ, తగ్గటం మొదలుపెడితే, త్వరలోనే సున్నా చేరుకుంటుందని. అదిగాక ఇప్పుడతనికి వారసు లున్నారు. తనని తన తండ్రి చేసినట్టుకాక, వాళ్లకి తను కాస్తో కూస్తో నిలవచేసి చూపించాలి !

ఇటువంటి మనస్తత్వం బలపడ్డంచేత, శ్రీధరరావు తను పేదవాడుగా ఉన్నప్పుడు ధనవంతులను గురించి రూపొందించుకున్న అభిప్రాయాలను మార్చుకోక తప్పలేదు. పనివాళ్లపట్లకూడా అతను తన ఉద్దేశాలు మార్చుకున్నాడు.

రమ వెళ్ళిపోగానే ప్రకాశరావు వొచ్చి బాతాఖానీ వేశాడు శ్రీధరరావుతో. మాటల సందర్భంలో అన్నాడు ప్రకాశరావు,

"మీ పనివాళ్లకి ఎంతెంత వాటా లిస్తున్నావేమిటి లాభాల్లో?"

"వాటా లేమిటి? జీతాలే."

"అయితే బోనస్ ఇస్తున్నావు గావును."

"ఊఁహూఁ."

ప్రకాశరావు ఆశ్చర్యంగా చూశాడు శ్రీధర్ వైపు.

"అయితే..."

ఏమిటన్నట్టు తలెత్తి చూశాడు శ్రీధరరావు.

"లాభాలు బాగానే వొస్తున్నాయి కదూ?"

"ఆఁ. నేను వాళ్లకి జీతాలుకూడా బాగానే ఇస్తున్నాను."

"మిగతా దంతా స్వంతానికి తీసుకుంటున్నావు."

"అవును. అందులో తప్పేముంది."

"నువ్విలా మాట్లాడడం ఆశ్చర్యంగా ఉంది. నీకు లాభాలు రావటానికి కారణం ఎవరో నీకు తెలియదని ఎలా నమ్మగలను."

"థియరీ వొదిలెయ్యి. ఇప్పుడు ప్రాక్టికల్ లో కొద్దాము."

"డబ్బు కూడబెడుతున్నావా? నువ్వు, సరిగా నేననుకున్నట్టుగానే ప్రవర్తిస్తున్నావు శ్రీధర్."

"నువ్వు వాటాలు ఇస్తున్నావు కాబోలు."

"ఆc, కష్టపడి పనిచేసేవాళ్లందరికీ నా కంపెనీలో వాటా లున్నాయి."

"అర్థణా వాటాలా అణా వాటాలా పేరు కోసం. హ్హ, హ్హ, అంతేనా?"

"నాది ఒక్కడిదే అణా వాటా. మిగతాదంతా పంచుకుంటారు". శ్రీధరరావు కొంచెం ఆశ్చర్యంగా చూశాడు.

"నీ కసలు లాభా లెందుకురా? మూడులక్షల మూలధనం ఉన్నవాడివి."

"ఇప్ప డంత లేదు. సరేగాని ఇహానించీ శ్రద్ధగా పనిచేసేవాళ్ళకి వాటా లియ్యి. నేను కొన్ని బాధాకరమైన సంగతులు విన్నాను మీ పనివాళ్లదగ్గర్నించి. కాని అంతగా నమ్మలేకపోయాను."

"వెధవలు. చాటుమాటు ఏడుపు లెందుకు? నాతో చెప్పరాదూ! అందుకే వాళ్ళని చూస్తే నాకు మంట."

ప్రకాశరావు నిశ్చలంగా చూశాడు శ్రీధరరావు వైపు. అతని కళ్ళలో బాధ ద్యోతకమైంది.

"నువ్వు నాకు పదిహేను వేలు బాకీ ఉన్నావు. జ్ఞాపకం ఉందా?"

శ్రీధర్ నమ్మకం లేని కళ్లతో చూశాడు ప్రకాశరావువైపు. ఈ మాటలు అంటున్నది ప్రకాశరావే!

"అవును."

"ఇస్తావా?"

"ఎందు కియ్యను?" శ్రీధర్ కోపంతో అన్నాడు. తను ఇదివరకు ఇవ్వబోతే వొద్దని ఇప్పుడు ఇలా అకస్మాత్తుగా అడగటంలో అర్థ మేమిటి?

"చెక్కు రాసియ్యి." వ్యవహారధోరణిలో మాట్లాడాడు ప్రకాశరావు.

"నేను వాటాలు పనివాళ్ళకి ఇవ్వలేదని నీకు కోపం, అంతేనా?"

"అవును."

"అంటే, నాకంటే నీకు పనివాళ్లే ఎక్కువన్న మాట."

"కావొచ్చు" ప్రకాశరావు స్థిరంగా అన్నాడు. "నా డబ్బు అనర్హుడికి ఉపయోగపడటం నా అభిమతం కాదు. అది ఏ ఒక్కడికోసమో పిల్లలు పెట్టి వాడి ఖజానాలో శాశ్వతంగా బంధించబడాలని నేనుకోరను. అన్నింటికంటె ముఖ్యం నా డబ్బువల్ల ఎవరికీ అపకారం జరగటం నేను సహించలేని విషయం."

ఈ ఉపన్యాసం విన్న శ్రీధర్ కి ఎక్కడలేని కోపం వొచ్చింది. గభాలున డ్రాయరులోంచి చెక్కు పుస్తకం తీసి పదిహేను వేలకి ప్రకాశరావుపేర చెక్కు రాసి అతనికిచ్చి కోపంగా అన్నాడు.

"నాకంటే నీకు వాళ్లే ఎక్కువైతే నువ్వు పోయి వాళ్లదగ్గిరే ఉండొచ్చు."

ప్రకాశరావు చెక్కు మడిచి జేబులో పెట్టుకున్నాడు, కాని కదలలేదు.

"తమరు ఇంకా దయచెయ్యరేం?"

'ఎక్కడికి? నేను ఇక్కడ ఇంకా రెండు రోజు లుండాలి."

"హోటల్లో ఉండు కావాలంటే. ఇహ నువ్వు నీ మొహం నాకు చూపించక్కర్లేదు."

'ఈ ఊళ్ళో నీ కొంప ఉండగా హోటలుతిండి ఏంఖర్మం? నువ్వు ఏడ్చినా, మొత్తుకున్నా మనపీఠం ఇక్కడే."

ప్రకాశరావు తాపీగా సిగరెట్టు వెలిగించాడు.

"వెళ్లి భోజనం రెడీ అయిందేమో కనుక్కో, ఏ సినిమాకైనా పోదాం."

శ్రీధర్ ప్రకాశరావువైపు రెప్పవాల్చకుండా చూశాడు. తన దుడుకుతనానికి అతనికి పశ్చాత్తాపం కలిగింది.

"నన్ను క్షమించు ప్రకాశ్. అనవసరంగా తొందర పడ్డాను."

"ఏడిచావులే పోరా, తిండి అయిందేమో కనుక్కో. పెద్దవగొడవ చెయ్యక." పొగ ఉప్ఫుమని ఊదుతూ అన్నాడు ప్రకాశరావు.

భోజనాలు పెందరాళే ముగించుకుని సినిమాకి బయలుదేరారు అంతా. రమ, ఇందాక తనకి కలిగిన అనుభవం జ్ఞప్తికి తెచ్చుకొని మళ్లీ అటువంటి అవమానం జరగకుండా ముందు జాగ్రత్తగా విలువైన దుస్తులు, ఆభరణాలు ధరించింది. అందరికీ శ్రీధరరావే టిక్కెట్లు తెచ్చాడు.

మొదటి తరగతిలో కూర్చున్న రమకి తన ముందున్న జనసమూహం చూసి ఓవిధమైన గర్వం కలిగింది. వాళ్లందరికన్నా తను గొప్పది; వాళ్ల అంతస్తు కన్నా తన అంతస్తు ఔన్నత్యం గలది. అంతమంది జనం పొందలేనిది ఏదో తను పొందగలిగిందని రమకి ఒకరకమైన సంతృప్తి కలిగి, హాలంతా గర్వం ఉట్టిపడే కళ్లతో కలయచూడసాగింది. జ్యోతి ఆమెవాలకం కనిపెడుతూనే ఉంది. ఇంతలో ఎవరో కొందరు స్త్రీలు వొచ్చి రమప్రక్కనే కూర్చుంటూ ఆమెని చూసి పలకరించారు. వాళ్లు ధరించిన దుస్తుల్ని బట్టి చాలా గొప్పవాళ్లని తేటతెల్ల మౌతుంది. సంభాషణ సాగింది. వాళ్ల మాటల్లో ఆస్త్రీలు తనకంటె ఆర్థికంగా చాలా ఎక్కువ వాళ్లని గ్రహించవలసిరావటంవల్ల రమకి కొంచెం కష్టం వేసింది. అయితే, ఆమె తన శక్తివంచన లేకుండా ఆ స్త్రీలకంటె తనే ధనికురాలని నచ్చచెప్పటానికి ప్రయత్నించింది. తనకి ఎంత గొప్పవాళ్లతో పరిచయం ఉన్నదీ, తనకి డబ్బంటే ఎంత నిర్లక్ష్యం ఉన్నదీ మొదలైన విషయాలు వాళ్లు నమ్మేట్టు చెప్పటానికి, పాపం చాలా శ్రమపడ్డది. ఈ ప్రయత్నంలో ఆమె అనుకోకుండా ఓ పొరపాటు చేసింది. రమపక్కన కూచున్న జ్యోతిని చూసి ఆ స్త్రీలలో ఒకామె ఎవరని ప్రశ్నించగా, అతిసామాన్యమైన దుస్తుల్లో ఉన్న జ్యోతిని తన స్నేహితురాల్నిగా ఒప్పుకోటానికి రమకి కొంచెం తటపటాయించవలసివచ్చింది.

"మా ఇంటిదగ్గిర ఉండే ఆమె లెండి.—"

ఈమాటలు ఆమె నోటినుంచి వొచ్చీరాగానే, రమకి తనమీద ఓవిధమైన కోపం వొచ్చింది. అంతకంటే కూడా, ఈమాటలు తను నెమ్మదిగానే అన్నా, జ్యోతి విన్నదేమో, వింటే ఏమనుకుంటుందో నని భీతి ఆమెని బాధించింది. "...అంటే, మాఇంట్లోనే ప్రస్తుతం ఉంటోంది. నా స్నేహితురాలే." చివరి మాటలు అని రమ కొంచెం సిగ్గుపడ్డది. ఒక క్షణం ఆమెకి జ్యోతిమీద కోపంకూడా వొచ్చింది. "అయినా, ఈజ్యోతికి మరీ, ఎక్కడ ఎలా మసులుకోవాలో తెలియకపోతే ఎలా. తన హోదాకి తగ్గట్టుగా ఆమె ప్రవర్తించవొద్దూ! ఏమిటో పిచ్చిఊహాలు మూఢ నమ్మకాలు. కాలానికి తగ్గట్టుగా ప్రవర్తించాలి గాని..." అని రమ జ్యోతిమీద తనలో తాను విసుక్కుంది. అయితే, ఒక నిమిషం తర్వాత తన మాటలు జ్యోతి విన్నదేమో, తను తటపటాయించి మాట్లాడటం విని ఆమె తననిగురించి ఏమనుకుందో నని ఆందోళన రమకి ఎక్కువైంది. ఆమెకి జ్యోతిముఖం చూడటానికి చిన్నతనం కూడా వేసింది.

కాని జ్యోతి ఈ ప్రసక్తి అసలు తీసుకురాలేదు సినిమానుంచి బయటికి వొచ్చింతరవాత కూడా. రమ మాటలు ఆమె విన్నది కాని మనసులో కష్టపడటానికి మారుగా ఆమె విషాదంగా ఓ చిరునవ్వు నవ్వింది. తరవాత తను రమఇంట్లో ఉన్న రెండురోజుల్లో కూడా ఆమె ఈవిషయం గురించి మర్మంగా గాని బహిరంగంగా గాని రమతో ఏమీ అనలేదు. అంచేత తనమాటలు జ్యోతికి వినపడలేదని రమ సులభంగా అర్థం చేసుకుంది. ఆమెకి హృదయం తేలికపడ్డది. తనంత తానే ఈ ప్రసక్తి తెచ్చి జ్యోతిని క్షమించమని అడుగుదామని ఆమె మొదట అనుకుందిగాని, తరవాత అలా చేయటంలో గల తెలివితక్కువతనం

ఆమె గ్రహించింది. జ్యోతి అసలు తను అన్నది వివనిపత్నంలో అనవసరంగా ఆమెకి ఈ విషయం చెప్పి ఆమె మనసుకి కష్టం తనంతట తాను కలిగించట మవుతుం దేమో నని ఆమె సంకోచించింది.

జ్యోతి, ప్రకాశరావులు మద్రాసు వెళ్లిపోయారు. క్రమంగా ఓ నెలరోజులు గడిచిపోయాయి. రమబలవంతంవల్ల శ్రీధరరావు ఓ మోటారుకారు కొన్నాడు. ఈ విషయం రమ ఎంతో ఆనందంతో జ్యోతికి తెలియజేసింది. తిరుగుటపాలో జ్యోతి ఉత్తరం రాసింది రమకి.

"రమా!

(నిన్ను ఎప్పుడూ నేను 'రమా' అనే సంబోధిస్తాను. నువ్వు నా కెంత సన్నిహితురాలవో మాటల్లో చెప్పలేను గనక.) మీరు కారు కొన్నారని విని సంతోషించాను.

,, ఈమధ్య నాకు వొంట్లో అంత బాగా ఉండటం లేదు. రాత్రిళ్లు ఏమిటో పిచ్చి కలలు వొస్తున్నాయి. ఈకలల్ని తలుచుకుంటుంటే నాకేమిటో మనసులో అశాంతి ఎక్కువౌతోంది. కలలకి అర్థం లేదని తోసెయ్యటం తెలివైన పనికాదని నా నమ్మకం. నీకంటే నా కెవ్వరూ స్నేహితులు లేరు కనుక ఆ గోడంతా నీకు రాయాలని నాకు ఆవేదనగా ఉంది. అదిగాక నీ బుద్ధికుశలతలో నాకు ఎంతో నమ్మకం ఉంది. నువ్వు ఈకలల అర్థం నాకు చెప్పగలవనే విశ్వాసంతో నిన్ను కాస్త శ్రమపెడుతున్నాను. ఓపికతో చదువుతావు గదూ!

ఓ కల చాలా చిత్రంగా ఉంది. ముందు ఏవో చిన్నచిన్న సెలయేరులు కొండలమీంచి ప్రవహిస్తూ అన్నీ కలిసి ఓనదిలోకి ప్రవహించటం కనిపించింది. ఆనది ఎంతో ఉత్సాహంతో ఈ నీరంతా గ్రహించి మహావేగంగా పోతూ ఈనీళ్లని సముద్రంలో దాస్తున్నట్టుగా కనిపించింది. తరవాత సెలయేళ్లన్నీ ఎండిపోయినట్టు, అవి బక్కచిక్కిన మనుష్యుల పక్కఎముకల్లోకి చర్మం చొచ్చుకుపోయి ఏర్పడిన గుంటల్లా కనిపించాయి. అన్నింటికంటే ఈ చిత్రం చూడు—ఆ ఎండిపోయిన సెలయేళ్లన్నీ నదితో ఏమిటో అంటున్నట్టుగా వినిపించింది నాకు. కలల్లో సంభవమూ, అసంభవమూ అనే మాటలకి అర్థం ఉండదుగా.

"మా నీళ్లన్నీ నీ కిచ్చేశాము. ఇప్పుడు ఎండలకి మాపత్తువ పోయింది. కొండలమీంచి నీళ్లు తీసుకు రాలేకుండా ఉన్నాము. మా నుంచి తీసుకున్న నీళ్లు కొన్ని మళ్లీ మాకు ఇవ్వాలి నువ్వు."

నది వికటంగా నవ్వింది.

"నేనూ ఇంచుమించు మీకుమల్లేనే ఉంటినిగా. కనిపించటం లేదూ?

సెలయేళ్లకి కోపం వొచ్చింది.

"నీళ్లన్నీ సముద్రంలో దాచుకుని ఏవో కల్లబొల్లి కబుర్లు చెబుతావేం! దాచిన నీళ్లని తీసుకురా మళ్లీ."

నది గట్టిగా నవ్వింది.

"సముద్రంలో పొయ్యటమే గాని మళ్లీ అక్కణ్నించి నేను తీసుకురాలేను."

"తీసుకురాలేవూ!?" కోపం పట్టలేక సెలయేళ్లు ఒక్కుమ్మడిగా అరిచాయి.

"ఊఁహూఁ." నది నిర్లక్ష్యంగా జలజల ముందుకు పోసాగింది.

"నీకు సిగ్గులేదా ? మేం ఇచ్చినపుడు దొంగా తీసుకోగలిగావు. మే మంతా ఇలా కాస్తా దానం చేస్తేనేగా నీ బతుకు. ఎందుకు నీ కంత గర్వం. నీకే మహా చల్లని నీ ళ్లున్నాయనేగా నీగర్వం. మాకు లేకపోటానికి నువ్వేగా కారణం. ఇందుకు నువ్వు సిగ్గుపడాలిసింది పోయి గర్వంగా ఠీవిగా గలగల ప్రవహిస్తూ నీ గొప్పతనం ప్రదర్శించు కుంటున్నావా, ఛీ."

నది ఏదో అనబోయింది గాని ఇంతలో నాకు మెళకువ వొచ్చింది.

ఏమిటో దీని అర్థం!

ఇంకో కల. నేను ఓ వనంలో తిరుగుతూ రోజూ తేనెపట్టుల్ని కొట్టి వాటిలో తేనె తాగుతూ రోజులు గడుపుతున్నానట. కొన్నాళ్లకి నేను ఓ

అద్దంలో చూసుకుని నా అందానికి నేనే ఆశ్చర్య పోతున్నాను. ఆసమయంలో హఠాత్తుగా ఓ భీకర మైన కంఠం వినిపించింది.

"సిగ్గు లేదా ?"

నేను బిత్తరగా చూశాను. ఎవరూ కనపడలేదు. కాని మళ్లీ ఆగొంతు ఇలా అరిచింది.

"దేహదార్ఢ్యం, అందం చూసుకొని మురిసి పోతున్నావు. ఎక్కడిది నీ కా బలం, యౌవ్వనం. చూడు. ఎన్ని జీవులు నీ మూలంగా మలమల మాడి పోతున్నయో !"

తలెత్తి చూశాను. ఎన్నో లక్షుల లేపెటీగలు దీనంగా ఆకాశంలో తిరుగుతూ రొదచేస్తున్నాయి.

మరో రోజు ఇంకో తమాషా కల వొచ్చింది. నేను చూస్తూ, చూస్తూ ఉండగానే నేలమించి కొన్ని చెట్లు మొలిచి పెరిగి పెద్దవై మహావృక్షా లయినాయి. తరవాత ఆకాశం మేఘాలు కమ్మి వర్షం కురిసింది. వర్షం వెలిసింతరవాత ఆచెట్లు ఇంకా పెద్దవై విశా లంగా వ్యాపించాయి. ఆచెట్లనించి వొచ్చే హోరు గాలిలోంచి ఈ విధంగా మాటలు వినిపించాయి.

"భూమివల్ల పుట్టాము, భూమివల్ల పెరిగాము. భూమిమేలులోనే మా మేలు ఉంది. ఓ వరుణదేవుడా మా భూమిని ఎప్పుడూ చల్లగా ఉండేలా చేయటానికి నిన్ను మేము ఆహ్వానిస్తున్నాము."

అన్నీ ఇటువంటి కలలే రమా. వీటిభావం ఏమిటో నా కేమీ తెలియకుండా ఉంది.

త్వరలో ఉత్తరం రాస్తావని ఎదురు చూస్తు న్నాను.

నీ,
జ్యోతి."

రమ ఉత్తరము చదివి కొంచెం ఆందోళనపడ్డది. ఆమె ఇటువంటి కలల్ని గురించి వినటం ఇదే మొదటి సారి. ఆ కలల్లో ఏదో హెచ్చరికలాంటిది ఇమిడి ఉన్నదని, ఇటువంటి కలలు జ్యోతికి రావటంవల్ల ఆమె మనసు ఎందుకో క్షోభించి ఉండాలనీ ఆమె నిర్ణయించు కుంది. కాగా, ఇవన్నీ పిచ్చికలలు, వీటికి అర్థమూ లేదు, ఏమీ లేదు, నువ్వు అనవసరంగా మనసు చెడ గొట్టుకోకు." అని ఆమె జ్యోతికి ఉత్తరం రాసింది. కాని జ్యోతి తన ఉత్తరాల్లో ఇటువంటి కలల్ని గురించి తరుచు రాస్తూనే వుంది. కలలు కల్లలు కావు. వాటిలో ఏదో హెచ్చరిక, లేక ఉపదేశంలాంటిది ఏదో ఉంటుందని తన నమ్మకమని నచ్చచెప్పటానికి ప్రయత్నించేది జ్యోతి. ఇటువంటి కలల్ని గురించి, తన అభిప్రాయం తెలిసి ఉండీ కూడా ఇంకా జ్యోతి తనకి ఎందుకు రాస్తుందో నని రమ ఆలోచించింది. ఆమె తనకి అన్యాపదేశంగా ఏమైనా చెప్పదలచు కుందా ? ఈ విషయంగురించే రమ చాలాసార్లు దీర్ఘంగా ఆలోచించింది కాని స్పష్టంగా ఏ నిర్ణ యానికీ రాలేకపోయింది.

రోజులు ఒక్కొక్కటిగా గడిచిపోతున్నాయి. ఇప్పుడు దురదృష్టవశాత్తూ శ్రీధరరావువ్యాపారం అంత మంచిస్థితిలో లేదు. అతనికి రాబడికంటె వ్యయం ఎక్కువ కాసాగింది. వ్యాపారంలో పోటీ కంపెనీలు బయలుదేరాయి. వాటితో పోటీకి శ్రీధర రావు తన వస్తువుల ధరలు తగ్గించాలిసి వొచ్చింది. ఇప్పుడు ప్రకాశరావు అతనికి హోల్ సేలురేట్లకి సరుకులు పంపించటం లేదు. మిగతా వర్తకు లందరి దగ్గిర తీసుకునే రేట్లకే శ్రీధరరావుకీ కూడా అమ్ము తున్నాడు. ఇదిగాక, శ్రీధరరావుపనివాళ్లు తమ జీతాలు సరిపోవటం లేదని, వాటిని హెచ్చించకపోతే సమ్మె చేస్తామని బెదిరించటంవల్ల, తప్పనిసరిగా వాళ్ళ జీతాలు హెచ్చించవలసివచ్చింది. ఈ అన్ని కారణాల మూలంగా శ్రీధరరావుకి వ్యాపారంలో పెద్ద దెబ్బ తగిలింది. ఇదే సమయంలో అతనికి ఏజంట్ల దగ్గి ర్నించి రావాలిసిన బాకీలు కూడా సరిగా అందటం లేదు. పోటీకోసం చవకసరుకులు సంపాదించి వాటిని మార్కెట్టులో పెట్టటంవల్ల ఆ కంపెనీపరపతికూడా తగ్గింది.

పరిస్థితులు ఇలా ఉండగా శ్రీధరరావుబుణ దాత ఒకడు తన బాకీఅర్జంటుపరిష్కారం నిమిత్తం కోర్టులో దావా చేశాడు. అప్పుడు శ్రీధరరావుకి

బాకీలు తీర్చుగల స్తోమత ఉన్నది కాని అతనిమీద ఉన్న ద్వేషం తీర్చుకోటంకోసం ఈ దావా జరిగిందని వినికిడి. ఈ దావాసంగతి తెలియగానే ఋణదాత లందరూ ఎగబడ్డారు. సరుకు తెగనమ్మవలసి వొచ్చింది. అన్ని బాకీలూ తీరాయిగాని ఇప్పుడు శ్రీధరరావుపని మొదటికి వచ్చింది. కాస్తో, కూస్తో మిగిలిందిగాని దానితో మళ్లీ వ్యాపారం ప్రారంభించటం అసంభవం. ఇహ రమసంగతి చాలా అన్యాయంగా ఉంది. ఆమెకి పూర్వం ఉన్న ధనగర్వం కూకటివేళ్లతో పెరికివేయ బడ్డది. ఆమె ఏం చేయగలదు? జరిగిందానికి తనకూడా చాలావరకు కారణ మని ఆమె తీర్మానించుకుంది.

ఈ స్థితిలో జ్యోతిదగ్గిర్నించి రమకి ఓ ఉత్తరం వొచ్చింది. శ్రీధరరావుపరిస్థితి వాళ్లకి ఏమీ తెలియ లేదు. జ్యోతికి తనవిషయం ఉత్తరం రాద్దామని, మళ్ళీ అభిమానం చంపుకోలేక రమ ఆమెకి విషయం తెలియబరచనే లేదు. శ్రీధరరావుకూడా ప్రకాశ రావుని సహాయం చేయమని రాయలేకపోయాడు. ఒకవేళ రాసినా, ప్రకాశరావు తనకి ధనసహాయం చేస్తాడని శ్రీధరరావుకి గట్టినమ్మకం లేదు. జ్యోతి, రమకి రాసిన ఉత్తరం ఇలా ఉంది.

"రమా !

నా కలల విషయాల్లో నీకు చిరాకు కలిగిస్తున్నా నని నాకు తెలుసు. అయినా ఈ ఒక్క కలగురించి నీకు రాయకుండా ఉండలేను. ఇహ నిన్ను ఈ విషయాల్నిగురించి బాధపెట్టను. కాని నువ్వు ఈ కలల్ని తేలిగ్గా తోసేస్తున్నావు. ఒక విషయం చెబుతాను. ఈ కలలన్నీ నీకే వొస్తున్నాయని నువ్వు ఊహించుకుని వీటి అర్థం ఏమై ఉంటుందో గాఢంగా ఆలోచించు.

మొన్నరాత్రి వొచ్చిన కల ఇది. నేను ఆకాశాన్నంటే ఓ మహోన్నత భవనం శిఖరాగ్రంమీద నుంచుని కిందకి చూస్తున్నాను. కింద ఎంతోమంది జనం చీమల్లా పాకిపోతున్నారు. వాళ్లని చూడగానే నాకో విచిత్రమైన స్వాతిశయం జనించింది. వీ ళ్ళందరి కంటె నేను ఎంత ఉన్నతశిఖరంమీద నుంచున్నాను! వీళ్లంతా నాకంటే ఎంత అల్పులు!

కింద పాకిపోయే జనం కొందరు తల లెత్తి నా వైపు ఆశ్చర్యంగా చూస్తున్నారు. నాకు చాలా గర్వం వేసింది. ఈ మనుష్యు లందరికీ దుర్లభమైనది నాకు లభ్యమైంది. వాళ్లందరికంటె నా ఘనత ఎంత ఎక్కువైంది!

నా కీ ఊహ రాగానే ఓ వికటాట్టహాసం విన పడ్డది. ఉలిక్కిపడి చూశాను. ఎవరూ కనిపించలేదు. నేను భయకంపితనై మళ్లీ జనంవైపు దృష్టి మరల్చాను.

"నువ్వీ శిఖరంమీదికి ఎలా వొచ్చావు;" మళ్ళీ ఆ గొంతు వినపడ్డది. చూస్తే మనిషి ఎవరూ కనపడ లేదు. భయంతో నిరుత్తరనై పోయాను.

"నువ్వు అధికురాలి వని అనుకుంటున్నావు. నువ్వు ఇక్కడికి ఎక్కి వొచ్చిన మెట్లు కట్టింది ఆ జనమే నని తెలియదూ? వాళ్లకంటే నీ గొప్పతన మేమిటి? వాళ్లు కట్టిన మెట్లమీంచి ఈ ఉన్నతప్రదేశానికి వొచ్చి వాళ్లని తక్కువగా చూస్తున్నావా? ఇంత అజ్ఞాను రాలివా? "

నేను భయవిహ్వలనై వింటున్నాను. మళ్లీ ఆ కంఠం అంది.

"నీకు వాళ్లెంత దూరంలో ఉన్నారో, వాళ్లకి నువ్వూ అంత దూరంలోనే ఉన్నావు. వాళ్లు నీకు అల్పులుగా కనబడితే నువ్వూ వాళ్ళకి అంతే! తెలి సిందా? "

నాకు తెలియకుండానే నేను తలకాయ ఊపాను.

"అసలు ఇంత పెద్దమేడ కట్టించడానికి నీకు మన సెలా ఒప్పింది. ఈ ఇటుకలూ, ఈ డబ్బూ పెడితే ఇంకా ఎంత మందికి నివాసం దొరుకుతుందో గ్రహించ లేని మందబుద్ధివా? ఈ శిఖరంమీద నుంచోటానికి నువ్వు తగవు, దిగు, దిగు. "

నే నేదో చెబుదా మనకున్నాను గాని గంభీ రంగా మళ్ళీ "దిగు." అని ఆ కంఠంనుంచి అరుపు విన బడ్డది. ఆ అరుపుకి నేను మేలుకున్నాను.

నువ్వు బాగా ఆలోచించి దీని అర్థం రాస్తావు కదూ?

నీ, జ్యోతి."

ఈ ఉత్తరం చదివి రమ తల పైకెత్తి కిటికీ లోంచి ఆకాశంలోకి శూన్యంగా చూసింది. ఆమె మనసులో ఏవేవో భావాలు దొర్లిపోతున్నాయి. కాసేపటి తరవాత ఆమె దీర్ఘంగా నిట్టూర్చి తనలో తాను అనుకుంది.

"ఆహా ఇటువంటి ఉత్తరాలు రాయాలిసిన అవసరం నీకు కలిగించను జ్యోతీ. నీ కలల— అవి కలలు కావని గ్రహించటానికి నాకు ఎన్నాళ్లో పట్టింది!— అంతరార్థం గ్రహించాను. కాని, ఏం లాభం! సమయం మించిపోయింది."

రమకి కళ్ల వెంబడి అశ్రువులు కారాయి.

"ఏడుస్తున్నావా, రమా!"

రమ హఠాత్తుగా వెనక్కి తిరిగింది. శ్రీధరరావు ఓదార్చే స్వరంతో అన్నాడు.

"నాలుగైదేళ్ల కిందట నేను ఎప్పుడూ అదే పనిగా అన్నమాటలు మళ్లీ అంటున్నాను రమా. దారిద్ర్యం పాపం కాదు, దుర్గుణం అంతకంటే కాదు. అయితే అప్పటి మాటలు అనటంలో, ఇప్పుడు అనటంలో చాలా తేడా ఉంది. అది నీకు కూడా తెలిసే ఉంటుంది."

రమ ఏమీ బదులు చెప్పలేదు. తను ఏడవటానికి కారణం తమకి కలిగిన విపత్తువల్ల కాదని ఆమె చెబుదా మనుకుంది కాని, ఎంచేతో ఏమీ చెప్పలేక పోయింది. ఆమెహృదయంలో ఏదో ఆవేదనగా ఉంది. అంతా బయటికి వెళ్లగక్కి మనసు తేలిక పరుచుకోవాలని ఆరాటపడ్డది, కాని ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియక లోపల్లోపలే అణుచుకుంది.

ఇంతలో బయటినించి, "శ్రీధర్" అనే కేక వినపడ్డది. కాసేపటిలో ప్రకాశరావు వొచ్చాడు. అతనికి శ్రీధర్ సంగతి ఆ కిందటి రోజే తెలిసింది. తన కంపెనీకి శ్రీధర్ ఇచ్చిన ఆర్డర్లన్నీ రద్దు చేశాడని ప్రకాశరావుకి తెలిసింది. ఎందుకా అని ఆశ్చర్య పడ్డాడు. తరవాత అతనికి పరిస్థితులన్నీ పూర్తిగా తెలిశాయి. వెంటనే వొచ్చేశాడు. "ఏరా, శ్రీధర్, ఏమిటి, ఇంత పని జరిగితే నాకు ఉత్తరమైనా రాయలేదు."

శ్రీధరరావేమీ జవాబు చెప్పలేదు. అతను కుర్చీలో కూర్చుని చేతుల్లో తల ఇముడ్చుకుని బల్లకి ఆనుకున్నాడు. కాసేపటితరవాత ప్రకాశరావే అన్నాడు మళ్లీ.

"ఏమిటి సంగతి?"

"అలా జరగాలని ఉంది, జరిగింది. ఇప్పుడదంతా తవ్వుకుని విచారిస్తే లాభ మేమిటి?" శ్రీధరరావు నిర్లిప్తంగా అన్నాడు. కొంచెంసేపటిదాకా ప్రకాశరావేమీ మాట్లాడలేదు. "మన చేతుల్లో ఏం ఉంది?" శ్రీధరరావు తనని తను ఓదార్చుకుంటూ అన్నాడు.

ప్రకాశరావు అతనివైపు ఓసారి తీక్షణంగా చూసి అన్నాడు, "నీకో విషయం చెప్పదలుచుకున్నాను శ్రీధర్."

"ఒక టేమిటి, ఎన్నైనా చెప్పొచ్చు. వినటాని కిప్పుడు నాకు కావలసినంత తీరిక."

"ఇదివరకే చెప్పిఉండేవాడిని, కాని నీవైఖరి చూసి నిష్ప్రయోజన మని మానేశాను. ఏమైనా, ఇటువంటి సమయంకోసం నే నెదురు చూడకపోయినా, అలా విధికృతంవల్ల జరిగిందిగనుక చెబుతున్నాను. ఆ విషయం చెప్పటానికి ఇంతకంటె మంచి సమయం లేదు."

"ఈ ఉపోద్ఘాతా లేమిటి? సూటిగా చెప్పరాదూ?" విసుగ్గా అన్నాడు శ్రీధర్. రమ ఆసక్తిగా చెవులు రిక్కించింది.

ప్రకాశరావు ఓ కుర్చీ శ్రీధర్‌కి దగ్గరగా లాక్కుని మొదలుపెట్టాడు.

"నువ్వు దారిద్ర్యం చేసిన సవాలునీ, సంపద చేసిన సవాలునీ కూడా ఎదుర్కోలేకపోయావు. దారిద్ర్యం అంటే భయం లేనట్టు నటిస్తూ దానినించి ఎంతో దూరంగా పారిపోవాలని ప్రయత్నించావు. పారిపోయే సైనికుడిని చూస్తే గెలిచినవాడికి చెర

లాటం; పారిపోతున్నకొద్దీ వెంట తరుముతాడు. నువ్వు దారిద్ర్యం ముఖంలోకి చూసి ధైర్యంగా, ఏమీ లెక్కలేనట్టు నవ్వేసి ఉండలేకపోయావు. అంటే నా అభిప్రాయం నువ్వు దారిద్ర్యంతో బాధపడుతూనే ఉండాలని కాదు; బాధపడుతూకూడా బాధపడనట్టు ప్రవర్తించాలనీ కాదు. భయపడినకొద్దీ భయపెట్టబడటం ప్రకృతిలో సహజం. కావలసింది ఎదురు తిరగటం. నువ్వు ఎదురుతిరగలేదు. భయపడ్డావు. భయపడనట్టు నటించావు. సంపద వొచ్చిం తరవాత కూడా నువ్వు దారిద్ర్యాన్ని చూసి భయపడుతూనే ఉన్నావు. ఆ భయం నీలో స్వార్థానికి ఉన్నతమైన స్థానం ఇచ్చింది. అంచేత నువ్వు ఎదుటివాళ్ల దారిద్ర్యం మనసుకి పట్టించుకోలేదు. సంపద చేసిన సవాలును నువ్వు ఎదుర్కోలేకపోటానికి కూడా కారణం అదే. దానికి బానిస వయావు. నువ్వు కాంక్షించినకొద్దీ నిన్ను తృణీకరించింది. సంపద, దారిద్ర్యం ఈ రెంటి కుట్రనీ నువ్వు తెలుసుకోలేకపోయావు. ఫలితం ను వ్విప్పుడ నుభవిస్తున్నావు.

రమ కూడా ఈవిషయంలో నీకు తోడు ఉంది. జ్యోతి అనేది- 'రమకి దారిద్ర్యంగురించి రెండు దృక్పథాలున్నాయి. తన దృక్పథంలోంచి చూసి రమ దారిద్ర్యాన్ని చూసి సిగ్గుపడేది. కాని మరొకళ్లకి దారిద్ర్యం ఆపాదించి చూస్తే ఆ దృక్పథంలో రమకి దారిద్ర్యమంటే చిన్నతనం లేదు-' అని. ఇది ఎంతవరకు నిజమో రమకే తెలియాలి."

శ్రీధరరావు రెప్ప వేయకుండా ప్రకాశరావు వైపు చూడసాగాడు. రమ హఠాత్తుగా అంది.

"అన్నయ్యా, జ్యోతితో చెప్పండి. దాని ఉత్తరాలన్నీ అద్దం కట్టించి గోడకి తగిలిస్తానని."

"అదేమిటమ్మోయ్, మళ్లీ అకో ఖర్చా, మన వాడి పరిస్థితి అసలే మొదటి కొస్తే." నవ్వుతూ అన్నాడు ప్రకాశరావు.

"మొదటికి రావటమే మంచిది ప్రకాశ్."

శ్రీధరరావు ఏం ఉద్దేశించి ఇలా అన్నాడో గ్రహించి ప్రకాశరావు స్వేచ్ఛగా గాలిపీల్చి ఉల్లాసంగా వొదిలేశాడు.



విజయ రాఘవ పదములు

★

శ్రీ తిమ్మావజ్ఝల కోదండ రామయ్య

శ్రీకృష్ణరాయలకాలమున ప్రోదిగొని తీగసాగిన ప్రబంధకవిత విద్యానగరమునుండి తంజావూరున కెగబ్రాకి మాధుపూవులు వారు కాయలు కాచినది. రాయలనాటి ప్రబంధములలోని శృంగారము రసికులకు వెఱ్ఱి పుట్టించినది. ప్రజాహృదయముల జక్కగ గుఱుతించిన తంజావూరుకవులు తమ కావ్యములలో శృంగారమును బచ్చిదేర బిచ్చిగేర వర్ణించినారు. అవి చదివి నాటి ప్రజ రసతన్మయ మైనది. ప్రజల మనఃప్రమాణస్థితికి దిగివచ్చిన యా యా కవీశ్వరులను హృదయములలోనే కొండాడినది. అంతటితో నాగలేదు. అంతటితో వారికి దనివి కలుగలేదు. పండితమాత్రైక వేద్యముగా నున్న యీ ప్రబంధకవిత వారి కందుబాటులో లేకుండినది. శృంగారోన్ముఖ మయిన నాటి ప్రజాహృదయము దీనిని గాదని యింక దేనినో వదకసాగినది. ఇంక నేదో వచ్చి దీని చోటున పీఠము వేయవలె నని దాని తలపు. సాహిత్యములో నొక ప్రశాంతపరిణామము దాని వాంఛితము. సాహిత్యములో నొక నవయుగమున కది యెదురుచూచుచుండినది.

శ్రీపదమున గొండకొమ్మన నిలిచి కోయని యెలుగెత్తి యన్నమయ్యకలకంఠము పాడిన పదములింకను ప్రజాశ్రవణకుహరములయందు బ్రతిధ్వనించుచునే యుండినవి. సాహిత్యమాకందపు లేజివుళ్లమెక్కి వగరెక్కిన యా కలకంఠముకలస్వనము వారికి రుచింపలేదు. అందులో వగ రెక్కువ యని వారి తలపు. వారికి గావలసినది తీయందనము. తత్ఫలితముగా సాహిత్యపు బలుపు తగ్గించుకొని పదకవిత తీయదనముతో బలచబాఱినది. తమ యభిరుచిప్రమాణమునకు గవితను దింపుకొని ప్రజ పరితృప్తి నందినది. రాజాస్థానములలో బండితజనసమక్షమున నభినయవిద్యావిశారదుల యంగబలముతో గవిజనాశీర్వాదముతో బదకవితకు బట్టాభిషేకము జరిగినది. తన తోడబుట్టువులు తన క్రిందిగి బరాబరు లొసగుచు దొలగి నిలుచుండగా పదకవిత కవితాసింహాసన మెక్కి రసికజనహృదయసామ్రాజ్యముల జనరంజకముగా నేలినది.

అది క్రీస్తుశకము పదునేడవశతాబ్దము. పుణ్యలోపముచేత భూమిపై నవతరించిన దేవతలు— నాయకరాజులు దక్షిణకాశ్మీరమును జోళమండలమును బరిపాలించుచుండిన కాలమది. తెలుగుపదకవిత యీ నాయకరాజుల కాలమున వీరి యాదరణమున జాలగా బెంపొందినది. నాయకరాజులు సంగీతసాహిత్యముల యందు నిష్ణాతులు. అందులో నచ్యుతప్పనాయుని కుమారుడు రఘునాథనాయకుడు సంగీతశాస్త్రమును లక్ష్యలక్షణసహితముగా నేర్చిన మహాపండితుడు. జయంతసేనాది రాగములకు, రామానందాది తాళములకు నితడు సృష్టికర్త. 'రఘునాథమేళ' యను వీణ నితడు నిర్మించినాడు. విజయరాఘవనాయకు డితని కుమారుడు. మహారసికుడు, మహాపండితుడు. సంగీతసాహిత్యనిధి ఇతడు—

'తనతండ్రియే కులదైవం బటంచు
ననిశంబు గొల్చు మహారాజయోగి
శతసహస్రాధిక సకుటుంబ విప్ర
సతతాన్నదానదీక్షా ధురంధరుడు
జీర్ణకర్ణాటక సింహాసనంబు
బూర్ణించి నిలిపిన పురుషరత్నంబు
కమనీయ రుక్మిణీకల్యాణముఖ్య
సమధిక నాటికా సంధాయకుండు'—

మఱియు,

'చతురంభోధిపరీత భూవలయ వ్యా
ప్తవ్యాపనీదేవతా
తతు లభ్యంజన భోజనాదులను మో
దం బందగా బ్రహ్మపం
తతి బాలించు నృపాలు' —దీతండు, —
ఇతని కవిత్వము,—
ఒక్కొకయెడ జీనిచక్కెరపాకం
బానిన ట్లాహ్లాద మావహిల్ల
నొక్కొకయెడ దాని నెక్కొన విరవాది
సరము లెత్తినరీతి బరిమళింప
నొక్కొకయెడ జవు లుప్పతిల్లగ మంద
మారుతంబులు వీచు మహిమ వెలగ
నొక్కొకయెడ వేన జొక్కు సంపాదించు
జలదివెన్నెల తేటవిధము మించు'—నంశును.

శృంగారరసతరంగిత పదకవిత్వమహనీయ మతిస్ఫూర్తియు, విజయరాఘవమహీపాలవిరచిత కవకాభిషేకయు, మిగుల శృంగారంబు గన్పట్ట బదములు మృదురసాస్వాదము లగుచు రాణింప' రచియించినదియు నగు పసపులేటి రంగాజమ్మ, భారతికిం బ్రతివచ్చునది యితనికి గూర్చు ప్రేయసి. మహారసికు డెయిన యా మహారాజు సదాకాలము ఆమెతో వినోదించుచుండువాడట! పతివ్రతయయిన పట్టపురాణి యీమెను నిందించుచు దాసీమూలమున నేదో కబురు పంపినది. అపు డీమె చెప్పిన పద్యము. *

ఏ వనితల్ మముం దలప
నేమిపనో; తమ రాడువారు గా
రో; వలపించునే ర్పులుగ
రో; తమకౌగిలిలోన నుండగా
రా వది యేమిరా విజయ
రాఘవ! రాం చిలు దూఱే బల్మిపై
దీవరకత్తెనై పెనగి తీసుకవచ్చితివా తలోదరి!

ఇతని రసికతను సౌకుమార్యమును తేర్కొనునది మఱొక పద్యము:—

"రాజనిభాననా! సరకు
రాలవు జబ్బుగ నల్లినా వదే
మేం"- "జడ యింతకం టెవలె
నే" -"వలెనే, బిగియించి యల్ల వే
రెయా జవరాల! వేరె పని
యున్నది"- "దోసమె దోసమే మహా
రాజగుహట్టి యవిజయ
రాఘవు పై చిగురాకె కోమలీ!"

చెంగల్వకాళయ యను కవీశ్వరు డితని పేర ననేక కావ్యములు రచించినాడు. విజయరాఘవచంద్రికావిహారమును రచించిన కామరుసు వెంకటపతిసోమయాజి యితని 'పట్టంపుకవి'- గురురాజపట్టభద్రుడు శతక్రతు శ్రీ కుమారతాతాచార్యులవారు ఇతని గురువు. చంద్రరేఖ, కృష్ణాజమ్మ, రంగాజమ్మ యితని యాస్థాన కవయిత్రులు.

పదకవిత కితని కాలములో లభించినంత యాదరణ మంతకు మునుపుగాని, తరువాతగాని లభింపలేదు. నాడు గజ్జెకట్టి పదము పాడనివారిది పాపము! రసికుడైన యితడు తన కవీశ్వరులచే యక్షగానముల రచింప జేసి, వానిని తంజావూరి నాటకశాలలో ప్రదర్శింపజేసి, బిరుదుపాత్రలకు శారదాధ్వజాదు లొసగి సత్కరించువాడు. తెలుగులో జక్కని కవిత చెప్పనేర్చిన కవులం కూడ బదకవితకు నాడు లభించుచున్న సన్మానమువిని పదకవిత్వరచనమునకు దొడగిరి. విజయరాఘవుడు స్వయముగా ననేకపదముల విరచించినాడు.
ఇతని ప్రేయసి రంగాజమ్మ శృంగారరసతరంగిత పదకవిత్వమహనీయమతిస్ఫూర్తి. పదకవితాచక్రవర్తి క్షేత్రయ, తన పదములచే నితని యాస్థానిని రసప్లావితము గావించినాడు.

క్షేత్రయ కృష్ణామండలములోని 'మొవ్వ' గ్రామవాస్తవ్యుడు. 'మొవ్వ' లోని గోపాలస్వామి పేర నీతడు పదముల విరచించినాడు. తంజావూరులో బదకవితకు గలుగుచున్న యాదరణము విని, యితడు 'మొవ్వ' నుండి బయలుదేరి మార్గమున బుణ్యక్షేత్రములు దర్శించుచు, నాయా క్షేత్రదైవతములమీద బదములు రచించి పాడుచు, తంజావూరును జేరికొనినాడు. తంజావూరిలో నాడు రఘునాథనాయకుని యేల్బడి సాగుచుండినది. క్షేత్రయ రఘునాథనాయకుని

* చాటుపద్యమణిమంజరి ప్రథమభాగము.

దర్శించి, యీ పద్యము జెప్పినట్లు ఆంధ్ర కౌముదిలో నిట్లు కలదు.

'మువ్వగోపాలభక్తిన క్షేత్రకవినా ఉక్తత్వాచ్చ'—

'తము దామె వత్తు రర్థులు
క్రమ మెఱిగిన దాతకడకు రమ్మన్నారా
కమలంబు లున్న చోటికి
భ్రమరంబుల నచ్యుతేంద్రు రఘునాథనృపా!'

రఘునాథనాయకు డితని జేరదీసి యాదరించినాడు. మట్లవారి సంస్థానమునం దుండిన కొంటె కోణంగి కవిచౌడప్పయు దంజావూరున కరుదెంచి రఘునాథనాయుని దర్శించినాడు. అప్పు డతడు చెప్పిన పద్యము—

సేరుతు నని మాటాడను
వారిజభవునంతవానినవలెమా తంజా
వూరి రఘునాథనాయుని
వారిసభః సుందరపు గవిచౌడప్పా!

రఘునాథనాయుని యాస్థానము నాడు కవితా కళాస్థానము! చేమకూర వెంకటకవి రఘునాథాంకితముగా విజయవిలాసమును రచించి సభాస్థలిలో వినిపించినాడు. వెంకటకవిపద్య మిది నాటి రాజపురుషుల కెల్లగకు సుపరిచితము.

ఎసబుజంబులవాడు మృగరాజమధ్యంబు
పుడికి పుచ్చుకొను నెన్నడుమువాడు
నెఱిచంద్రుకలవాడు నీలంపునికరంపు
మెఱుగు జామనచాయ మేనివాడు
గొప్పకన్నులవాడు కోదండగుణకిణాం
కము లైన ముంజేతు లమరువాడు
బవిరిగడ్డమువాడు పన్నిదం బిడి డాగ
వచ్చు నందపు వెన్నుమచ్చవాడు
గరగరనివాడు నవ్వుమొగంబువాడు
చూడగలవాడు మేలైన సొబగువాడు

వాని మేన త్తకొడుకు గావలయు నాకు
నర్జునుండు పరాక్రమోపార్జునుండు—

అన్నమయ్యసతి తిమ్మక్క రచించిన* సుభద్రా పరిణయములోని మంజరి పాదము లీక్రిందివి పైవెంకటపతిపద్యముతో సంవదించుచున్నది.

'ఎసబుజమ్ములవాడు మృగరాజా నడుము
నడచి పుచ్చుకొనునెన్నడుము గలవాడు
గరగరనివాడు చక్కనివాడు నతడు
గొప్పకన్నులవాడు కోదండగుణకి
ణాంకంబు లాజాహు-లమరినవాడు
వెన్నున మచ్చ గల విభవంబువాడు
బవిరిగడ్డమువాడు పన్నిదం బిడిన
వెన్ను పగడపాల వెస నాడవచ్చు
చిగురొత్తు చెంద్రిక చెలగు పాదములు'...

'విజయవిలాసము'ను రచించుచున్న వెంకటకవి యంతకు బూర్వమే తిమ్మక్కచే రచింపబడి స్త్రీజనపాఠ్యముగా నున్న "సుభద్రాకల్యాణము"ను జూచియేయుండు ననుటకు సందేహము లేదు. తిమ్మక్క రచితము లగు నీమంజరిపాదములను వెంకటకవి విజయవిలాసమున నుపయోగించుకొనియుండు నని తలచుటలో దోష ముండదు. వెంకటకవిపద్యమును వినిన క్షేత్రయ యట్టిదే యొకపదమును రచించినాడు. ఇది చూడుడు-

యదుకులకాంభోజిరాగము-ఆదితాళము.

పల్లవి.

ఎంత చక్కనివాడే – నాసామి వీ
డెంత చక్కనివాడే

అనుపల్లవి.

ఇంతి మువ్వగోపాలుడు సంతతము నామదికి
సంతోసము చేసనే ॥ఎంత॥

చరణములు.

మొలకనవ్వులవాడే – ముద్దుమాటలవాడే
తళుకారు చెక్కుట – ద్దములవాడే
తలిరాకుజిగిదగడ – దసమోవి గలవాడే ॥ఎంత॥
చిలుతప్రాయమువాడె – చెలువొందు విదియచం
దురు గేరు నొసలచే – మెఱయువాడే

* దీని నిటీవలనే శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య విద్యాపరిశోధనాలయములో శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు ప్రకటించిరి.

చెఱకువిల్తుని గన్న - దొరవలె నున్నాడే
మెఱుగు చామనచాయ - మేనమరువాడే ॥ఎంత॥
పాదపుకెందామర పెం - పొదవు పదములవాడే
కొదమసింగపు నడుము - కోమ రమరువాడే
మదకరి కరముల-మఱపు చేతులవాడే
సుదతి మువ్వగోపాలు డెంత-సొగసుగలవాడే॥ఎంత॥

రఘునాథ నాయకుడు క్రీ. శ. ౧౬౩౩ లో బరమ పదించిన వెనుక నతని కుమారుడు విజయరాఘవనాయకుడు ఏలిక కాగా నిత డాతని దర్శించి యతనిపై జలువ చప్పరములో నుండి వేయి పదముల రచించి యతనిచే బహుమతి పడసినాడు. క్షేత్రయపద మిది చూడుడు-

మేరుపదము.

యదుకులకాంభోజిరాగము - ఆదితాళము.

పల్లవి.

వేడుకతో నడచుకొన్న విటరాయడు
ఏడు మూడు తరములనుండి - యేదున్న కోణాచట

అనుపల్లవి.

కూడుకొని మువ్వగోపాలుడు-కృపగల్గ నావిభుడు.
వేడుక॥

చరణములు.

మధుర తిరుమలేంద్రుడు-మంచిబహుమాన మొసగి
యెదుట గూర్చుండు మని - యెన్నిక లిమ్మనెనే
యిదుగో రెండువేలపదము-లెంచుకొమ్మనగ
చదురుమీద నున్నసామికి-సంతోష మింతింత గాదె.
వేడుక॥

వాసి మీఱ తంజావూరి - అచ్యుతవిజయరాఘవేంద్రుని
పాలు మనుజుల వెంబడిని - పరప బొడగాంచి
చలువచప్పరములో - చక్కగ వేయి పదముల
సలుకరించగానె - బహుమాన మిప్పించె నావేళ
వేడుక॥

గోలకొండపహాదుషా - కొక వేళ నిలిచి
తోళసిమూర్తివారు - పిలిచినవేళ
వెలయ మువ్వ గోపాలుడు - వెయ్యిన్నూరుపదములు
నలువది దినములలోగ నను - గలసి వినిపించెనే వేడుక॥

ఈ పదమువలన క్షేత్రయకవి మధురతిరుమలేంద్రునిమీద రెండువేల పదములను, తంజావూరి విజయరాఘవునిపై వేయిపదములను, గోలకొండపహాదుషావారిపై వెయ్యిన్నూఱుపదములను మొత్తమున నాలుగువేల యయిదువందల పదములను రచించినట్లు తెలియుచున్నది. ఇందు దంజావూరి విజయరాఘవ నాయకునిపై నితడు రచించిన వేయి పదములలో బది పదములు మాత్రమే నేడు లభించుచున్నవి.

క్షేత్రయ విజయరాఘవనాయకుని రసికతను వర్ణించిన పద మిది—

కాంభోజి - చాపు

పల్లవి.

సామాన్యము గాదే వానిపొందు
సామాన్యము గాదే

అనుపల్లవి

యేమి సేరని భామలు వాని కాసించేరె
యేమందు విజయరాఘవుడే సామి సుమ్మీ
భూమియందు వాని గుణము లెన్న
రామలకు వీనుల విందు - ఓ చెలియ సామా॥

చరణములు

పాయపుహొంతకారి గావలె - వాని ముద్దు
పదము వ్రాయ జదువ నేరవలె - కవితారచన
సేయ నుత్తర మీయవలె - ఆ వగలయందు
గాయకురాలై యుండవలె - ఓ చెలియ. సామా॥
ఆటకు మేటియు గావలె - తంబుర
గోట మీటి రాగ మాలాపించవలె-వానిపై సొగసు
పాటలు వినికి చేయవలె - మనసు దెలిసి
మాటాడనేరవలె - ఓ చెలియ. సామా॥
కప్పురపు బాగా లియ్యవలె - వాతెర తేనె
చిప్పిల్ల నగమా కియ్యవలె - తమి హెచ్చు వేళ
తప్పక కెమ్మోవి నొక్కవలె - విజయరాఘవు
నప్పుడే పైకొని కూడవలె - ఓ చెలియ! సామా॥

కడపటిచరణమునకు పాఠాంతరము.

చక్కెరకెమ్మోవి నొక్కవలె - అంతవానికి
దక్కి దక్కించుకోవలె - తమి హెచ్చేవేళ
గ్రక్కున వాని గూడవలె - వా డలిగితే
మ్రొక్కి వేడుకొనగావలె - ఓ చెలియ. సామా॥

విజయరాఘవనాయకునిపై క్షేత్రయ రచించిన యితరపదము లివి శృంగారరసగుళికలు. రసికుల కాస్వాద్యములు.*

కాంభోజి - త్రిపుట

పల్లవి

గజరాజగమన యీ - కపటము సేసే మెలఁగ

అనుపల్లవి

విజయరాఘవేంద్రుని - వితము లీలాగే. గజరాజ॥

చరణములు

జీనిగజనిమ్మపండ్లు - చిలుకముక్కు నొక్కులచే
కానుక పంపించినందుకు - కారణ మేమే
కానుక గాదే నీగుబ్బ - లూని పట్టి చందమామ
కూన లుంచే నన్న - గురుతు లీలాగే. గజరాజ॥

కొండొక చవి చూచి - కొఱికిన తియ్యమామిడి
పండు కానుక చేసిన—భావము దేమే
పండు కానుక గాదె నీ - కండచక్కెర మోవి
పండు గంటి చేసినని - పలికిన లాగే. గజరాజ॥

పిరాధిపుడు డచ్యుతే - విజయరాఘవేంద్రుడు గంట
బారి మొలనూ లంచిన - భావ మదేమే
బారి మొలనూలు గాదె నీ—భావజ సామ్రాజ్య మెల్ల
తోరణము గట్టుకొన్న—దొరతన మింతే ॥గజరాజ॥

భైరవి - త్రిపుట

పల్లవి.

ఇటువంటివాడు రాడేలె - యీలాగైతే
యేటి వేడుకతన మే

అనుపల్లవి.

విటరాయ డచ్యుత - విజయరాఘవు డింకో
వెలదు నమ్మ దానికి - ఓ చెలియ ఇటువంటి॥

చరణములు.

అలివేణిరో ఈ[illegible]రాక చూచి చిలుక -
అయ్య వచ్చినా డంటేను - అందు
కలికిని సాయిల్లు దానింటి పోరుగని
చిలుకను దండింతువా
ఇలలోన నిటువంటి మగవారి వనితలు -
ఎందైన కనుగొంటివా - ఓ చెలియ ఇటువంటి॥

ఈ రాతిరి మాయింట పావురము -
హెచ్చుతమి గలిగియుండ
సారె నా యుపరతి సద్దైతే పలుకక -
యూరకుండు నటే
ఆ రతికూజిత మాపె వినీ నని -
అలిగే నే నేమి సేతునే - ఓ చెలియ ఇటువంటి॥

కలికిరో అచ్యుత విజయరాఘవేంద్రుడు -
కంతుకేళి కూడగా
పలుమారు చప్పర గిలకల పట్టెమంచము -
ఘలు ఘలు ఘలు మనగా
మెలతరో ఆపద్దు ఆపె వినీవని -
మెల్లనే నను గూడెనే - ఓ చెలియ ఇటువంటి॥

కాంభోజి - ఆది†

పల్లవి

సుదిన మాయెనే యీ ప్రొద్దు - సుదిన మాయెనే యీ

అనుపల్లవి

మదనావతారునిసేవ - మనకు గలిగెనే సుదిన॥

చరణములు

ప్రొద్దున నిలువుటద్దము - జూడగన్న ఫలము - ఈతని
ముద్దుమోము జూడగలిగె - ముద్దులగుమ్మ సుదిన॥
ఈ ప్రొద్దు పూర్ణకుంభము - ఎదురైన ఫలము - ఈ
భూపాలకుంజరుని నే - జూడగంటి నమ్మ సుదిన॥
ద్విజరాజుల సేవించిన - దివ్యశకునము అచ్యుత
విజయరాఘవేంద్రుని యీ-విడిదిలో గంటి సుదిన॥

కాంభోజి - త్రిపుట

పల్లవి

బాల చంద్రుడెండ్ల - గోల సుమీ యిక
తాళదు గానికి - దయ లూరదు

అనుపల్లవి

లాలించుమీ మద్ద - రాలిది గాయకు
గాలు గాదు విజయ - రాఘవ సామి. బాల॥

---

*పయిపదము లన్నియు మదరాసు ప్రాచ్య లిఖితపుస్తకశాలలోని వ్రాతప్రతులనుండి సేకరింపబడినవి.

† ఈ పదము ముద్రితము.

చరణములు

కోమిరె మరుని చేతి - కూన సుమీ - నీకు
అమరినచిత్రపు - అతివసుమీ
సమరతి యుపరతి - చౌశీతి బంధముల
క్రమము నేర్పెదవో కాక - కొసరేవో గనుక.
బాల ॥

తొయ్యలి బంగారు - తునుక సుమీ - మరు
కయ్యాన గొసరకు - నెయ్యముతో
తియ్యని మోవిచ్చి - దిద్దుకొందువు గాని
కయ్యపట్ల రారాపు - సలుపకుమీ జాణ.
బాల ॥

తరుణులలో మేలు - తరము సుమీ నిన్ను
మరుకేళి జొక్కించు - మగువ సుమీ
కరియాన విజయరా-ఘవ యెట్టి దొరకైన
దొరకని యీయింతి - దొరకె నెఱజాణ.
బాల ॥

కాంభోజి - త్రిపుట

పల్లవి

ఇంతా నా పొరుగింటనె - తావు లేనట్ల
యింతా నాపొరుగింటనె

అనుపల్లవి

ఇంతి! విజయరాఘ - వేంద్రుని వేడుకతన
మింత ॥

చరణములు

ప్రొద్దుపోదు గా-జోలు చాలు నమ్మ దాని
యొద్ద నున్న సుద్దులే - అందుచేత-
నిద్దుర బట్టక - నే నుంటే దానికి
ముద్దుమీద ముద్దులే - అది
కద్దో లేదో మా - కలికి వడిగద నని
సద్దు వినలేకను - సకియ; యీరేయుండితి.
ఇంతా ॥

వారిజాక్షిరో! నే విన - వలె నంటను
కేరడంపు నవ్వులే - దానింట న
వ్వారికుంకుమ క-స్తూరి గాక మితి
మేర లేని పూవులె - సారె
సారెకు దానింటి వా-సన లిందు వచ్చె నె
యోరువజాలక - యీవిధ యింట నుండితి.
ఇంతా ॥

భావజుకేళి వా-పడతి గూడెడు వేళ
పావురంపు బలుకులె - అది యేమి గాక
ఆవేళ వనమీద - వని నమ్మక లిమ్మని
యీపై కొంత కులుకులే - యికమీద
నావద్దికి రాదో - నాతో మాటలాడదో
యీ విజయరాఘవు - డెలమితో నుండేది ఇంతా ॥

కాంభోజి - త్రిపుట

పల్లవి

గిలిగింత లయ్యెరా - చక్కని సామి - చ
క్కిలిగింత లయ్యెరా

అనుపల్లవి

గిలిగింత లయ్యెరా - కలికి విజయరాఘవ
నెలకచన్నులు పంటి - నొనను నొక్కకు మెల్ల
గిలిగిం ॥

కురులు గూడని చిఱుత - పరువాన నన్ను నీ
వరులు మరులు రేచి చాల - నలయింపుచు
విరవాజికెయ్యపై - మరుని మంత్రములచే
పరిపరివగ బలుకు - పలుకు నా చెవిసోక ॥గిలిగిం॥

వలువ నేరని లేత - వయసున నన్ను నీ
పలుకు లను చొక్కపొడి చల్లి - కళ రేచుచు
మొలనూలు దూసి పోక - ముడిలోపల చేయి వేసి
జిలిబిలి చేతలు నీవు - సేయకు మయ్యలు ద్రొక్క
గిలిగిం ॥

అక్కల దెలియని - యెరవిరిపాయాన
దక్కన వానివలె - తప్ప క్రొంబుక్కలు క్రొంబుక్కచు
పక్కలోనె పవ్వళించి - బాస లెన్నైన జేసి
యెక్కన జేర్చి లోదొడ - లందు నొక్కకు మెల్ల
గిలిగిం ॥

సైంధవి - చాపు *

పల్లవి

దొంతరవిడెముతో నా - చెంత రాకుర నీకు నాయాన

అనుపల్లవి

ఇంతకు నే దాళగలనా - యేర విజయరాఘవజాణ!
దొంతర ॥

చరణములు

జగ్గు గులుకు మైబుక్కాతావి - చప్పరించిన నీదు
కెమ్మోవి

---

* ఇది ముద్రితము -

నిగ్గు నొసలి లత్తుకకేవి - నీటుతోడనూ
యొగ్గు చేసి నాయెదుర-యీలాగు నాతో బొంకుదుర
దగ్గర నిల్వకు పదర - దాని కేను తాళ గదర
॥దొంకర॥

నీ చెంపు గుబ్బలపోటు - చిమ్మ రేగిన కీల్జడ వేటు
మబ్బు మీరిన నిద్దురపాటు - మఱపుతోడను
దబ్బరలాడేవు చాల - దానిదే గదర యీ శాల
గబ్బితనము నీకేల - కలికితో మాటాడు మీ వేళ
దొంకర॥

చక్కని విజయరాఘవ ధీరా - సామిగా నన్నేలితి
వౌరా
తప్పులాడింటికి పోరా - దయతోడనూ
ఎక్కడి పీవాడిన విరులు - చిక్కుబడెను నీకంఠ
సరులు
నిక్కము దానిపై మరులు - నీవు దానింటికే తరలు
దొంకర॥

సైంధవి - ఆది తాళము

పల్లవి

మేర గాదుర నీవిసిదికి - పోరా క్రొంక్కరా
మేర ॥

చరణములు

మంటమారి మామకు నన్నంటే మిగుల రోషము
ఒంటి వెడల నీదు బావ - వింటే చాల మోసము
వెంట వెంట తిరిగేవు నా విభుడింటనే నివాసము
కంటకుడు నామఱది - కంటేను ప్రయాసము.
మేర ॥

కుదతి రైన మాయత్త యీ - సుద్ది నా తో విన్నది
వదినె నమ్మజాలకు తల - వాకిటనే యున్నది
పదర వల దీ ప్రొద్దు నీ-పద్దు చెల్లుచున్నది
అదిగో యీ నీ ధికోనను - అరుదూరొచున్నది.
మేర ॥

పల్లకి దొర నైతే నా-పయటలో చెయి వేతురా
ఇల్లాలనక కలసి మెలసి - యింతి గాసిచేతురా
యిల్లు వెడల నీదు సవతి - యింత రట్టు సేతువా
తెల్లవారెను విజయరాఘవ-ధీరా యేమి సేతురా.
మేర ॥

సావేరి - త్రిపుట

పల్లవి

హితవైన చోటనే - హిత వింతే కాని నే
నింపొందు నటర

అనుపల్లవి

వితరణగుణశూర - విజయరాఘవధీర
విందురా నామాట - లోకోరి జాణ. హిత ॥

చరణములు

ముచ్చటై నే నొక్క - ముద్దు పెట్టెద నంటే
మోమెఱ్ఱ జేసితివి
పచ్చి చేరగ వది - పలుకెంపు లుంచితే
బాగాయె నని యుంటివి - ఓకోరి జాణ. హిత ॥
ఇందు నే చెయి బట్టి - యింటికి రమ్మంటే
యెంతనో కసరితివి
సందిట గోరు లా - సకియ యుంచితే చాల
సంతోషపడి యుంటివి - ఓకోరి జాణ హిత ॥
ఇనుమంతసేపు న - న్నేలి విజయరాఘవ
యింటికి పొమ్మంటివి
రసికుడా దానింట - రాత్రి నాలుగుజాలు
రమ్యముతో నుంటివి - ఓకోరి జాణ. హిత ॥

* * *

రాగములలో తోడిరాగముపై క్షేత్రయకు మక్కువ యెక్కువ. తోడురాడి పాడుటకు తోడి రాగ మెత్తిన దని యతని యభిప్రాయము. ఈ పదము జూడుడు—

కాంభోజి - త్రిపుట

పల్లవి

ఎన్నటికో నే నా కొమ్మను జూచేది
ఎన్నటికో నామనసు చల్ల నయ్యేది

అనుపల్లవి

వన్నెలాడి బన్న సరులు నాయురముపై
నూగాడగా సుపరతి గలసేది ॥ఎన్నటి॥

చరణములు

మేటి చందురకావిపావడపై బసిడి
పట్టుచేలము చాల పస మీఱ గట్టి
కోటిచేలకు గొన్న తాటంకముల నొప్పు
కోమలిచెక్కిళ్లు - కొసరి ముద్దాడేది ఎన్నటి॥

మోము మోమున జేర్చి మోవి తేనియ దేల్చి
వేమారు నామనసు నొకటిగా జేర్చి
కామశాస్త్రము చదివి కథలు చెప్పుచు నేను
కామినిని నెమ్మది గలసి కౌగిట జేర్చేది ఎన్నటి||
జోడు గూడి తోడిరాగము పాడుచు
మేడపై నుండి మేలుమే లనుచు
వేడుకలతో దాని విడువక యెప్పుడు
తోడ బంగారు తూగుటుయ్యాల లూగేది ఎన్నటి||
చెలియతో మా మువ్వగోపాలరాయుడ
యెలమి నేల రాడని పలుకరించిన
చెలియ లందఱు గూడి నలినాక్షి నెత జూచి
నేడు రేపని రాక కెదురు చూచేది ఎన్నటి||

* * * *

పదరచనములకు బదరచయితలకు మొన్నటిదాక తెలుగుసాహిత్యచరిత్రములో దగిన యాదరము లభింపలేదు. పదముల సారస్యము గుర్తించి సాహిత్యములో వానికి సముచితస్థాన మొసగబడవలయు నని తొలుత గుఱుతించిన మహాపండితులు శ్రీ బహుజనపల్లి సీతారామాచార్యులవారు. ఆచార్యులవారు క్షేత్రయపదములను మరల మరల బాడించుకొని విని యానందించుచుండువారట! క్షేత్రయ పలుకు బాంకముకు ముగ్ధులై వారు వానికి ప్రామాణికతను జేకూర్చిరి. శబ్దరత్నాకరములో అన్నెకారి, అక్కఱకాదు, అన్నెము, కన్నెఱికము ననుపదములకు క్షేత్రయపదములనుండి ప్రయోగముల జూపి వానికి బండితాదరణము లభింపజేసినారు. తమ ప్రౌఢవ్యాకరణములో క్షేత్రయప్రయోగములకు సాధుత్వము సిద్ధింప జేసినారు. తమ నిఘంటువులో క్షేత్రయపదములలోని ప్రయోగముల నొసగుట నెవరో పండితు లాక్షేపింపగా నాచార్యులవారు *క్షేత్రయ యక్షరాక్షరమును బ్రమాణమే. క్షేత్రయ కవి గానివాడు తెలుగులో నిక కవీశ్వరులు కవీశ్వరులు కా రనిరట! ఆచార్యులవారికి క్షేత్రయపై గల యాదర మట్టిది' క్షేత్రయపదముల యెడ గల కవితాగౌరవ మట్టిది!†



* ఈ పేరిట శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 'ఆంధ్రపత్రిక'లో రచించిన వ్యాసము జూడుడు.

† ఈ వ్యాసమునందలి చారిత్రక విషయములు 'తంజావూరు ఆంధ్రరాజుల చరిత్రము' నుండియు 'కొందఱు తంజావూరు కవులు - పండితులు' - అను గ్రంథమునుండియు గ్రహింపబడినది.

రాజశిల్పి

మూలం : కన్నడ కథానిక
శ్రీ అ. న. కృష్ణరాయలు

అనువాదం
శ్రీ పి. వెంకోబాచార్లు

రాజశిల్పి స్వగ్రామం మరలివచ్చాడు. ఊరంతా అదేమాట. అతన్ని చూద్దామని ఆ ఇంటి ముందు ఊరంతా గుమిగూడింది. శిల్పిదర్శనం లేదు.

ఆ మూకకు సేవకులు సరియైన సమాధానం చెప్పలేకపోయారు.

"ఇంతకీ శిల్పి వచ్చాడా, లేదా !"

"అరే! ఇదే ఇంత సమస్య అయిందేం" అని ఆక్షేపించారు అభిజ్ఞులు.

సమస్యను సమస్యగానే ఉంచి, జనం సద్దుమణిగారు.

శిల్పి గృహారామంలో మారు మూల, నికుంజ చ్ఛాయలో, శిలావేదికపై పద్మాసనాసీనుడై, అర్ధనిమీలితనయనాలతో, ఆలోచనలో మునిగి ఉన్నాడు. శిలావితర్దికసమీపంలో కూర్చొని ఉంది మైనా. నారింజతొనలు ఒలిచి, ముత్యాల విడమర్చి శిల్పిచేతి కందిస్తూంది. శిల్పి పరధ్యానంలో, ఆ తొనల ముత్యాలు అల్లాగే అతని చేతిలోనే ఉండిపోతున్నాయి.

మైనా హెచ్చరించింది.

శిల్పి కనువిప్పార్చి, ఓరమోము పెట్టి, మమతతో, మైనాను పరికించాడు. నారింజపండుపసిమి మేను, సుశోభితమైన అంగాంగరేఖ, యవ్వనంసుమించిన వక్షోరుహాలు, సుదీర్ఘ నీలకేశరాశి, మైనా నిజంగా సుందరి.

ఆమె కంటినీటికి శిల్పికనీనికలు జలదరించాయి.

"మైనా ! ఏడుస్తున్నావా !"

ఆ చిరు, ఆదరణకు మైనా కంఠపుముడి సడలింది. వెక్కులువెక్కులుగా ఏడ్పు వెల్లివిరిసింది.

"ఎందుకు మైనా ఏడుపు !...ఊరుకోవూ ?"

"ఈ రెండేళ్లూ—ఎక్కడికి వెళ్లారు ?"

"మైనా! ఆ ఒక్క విషయం అడగకుండా ఉండలేవా !"

"స్వామీ మీకు నాదగ్గిర మాట దాచే పని లేదు కదా !"

"లేదు ! కాని, ఈ ఒక్కటే నా ఆత్మీయమైన రహస్యం అనుకోలేవా ? ఏదో అబద్ధమాడి సమాధాన పరచాలా !"

"పోనీండి ! మళ్ళీ అల్లా వెళ్లిపోరుకదా ?"

"వెళ్ళవనే అనిపిస్తోంది."

"అనుమానమేనా ! స్థిరం లేదా ప్రభూ ?"

"మైనా ! ప్రపంచంలో, ఈ జీవితంలో, ఏది స్థిరం—మైనా...?"

తనలో తనుగా మాట సాగించుకొంటూ చుబుకం నిమురుకొంటున్నాడు శిల్పి.

మైనా తన్ను మరల్చుకొంది.

"స్వామీ ! పని ప్రారంభిస్తారా. మన్ను తయారు చేయనా ?"

"ఇప్పుడు వద్దు."

"మరి పని ప్రారంభించరా ?"

"......మళ్లీ వచ్చాక"

రాజమందిరంనుంచి ఒక భటుడు ఒక లేఖను తెచ్చి శిల్పికి సమర్పించాడు. లేఖను చదువుతోంటే శిల్పిమొగం ముడిపడ్డది.

"జాబు ఎక్కడిది" దని మైనా అడిగింది.

"రమ్మనమని మహారాజు వార్త పంపారు"

"వెళ్తారా !"

శిల్పి లేచి, భటునితో, "ఇప్పుడే వస్తానని చెప్పుపో" అన్నాడు. భటుడు నిష్క్రమించాడు.

మైనా వారించింది. "స్వామీ! అక్కడికి వెళ్లవద్దు."

"ఏం ?"

"నా కేదో భయంగా ఉంది_"

"దేనికి భయం ?"

"మనకు రాజింటి సహవాసం వద్దు. అసలు ఈ ఊరు వద్దు. ఈ దేశం వద్దు. దూరంగా పోదాం పదండి. నన్ను నా కాశ్మీరం పిలుస్తోంది."

"పిచ్చిదానా! మైనా," అని ఆమె నుదురు నిమురుకున్నాడు. ఆమె కన్ను లప్పచెప్పి, మాటలు అప్పచెప్పుతోంది.

"క్రిందటిసారి రాజమందిరంనుంచి వచ్చిన రాత్రే ప్రవాసగతులై వెళ్ళిపోయారు. స్వామీ! ఆ యింటి చెలిమి అంటేనే నాకు అదలుపుట్టుతుంది"

"మైనా! నేను పిచ్చివాణ్ణిగా కనపడుతున్నాను కదూ ?"

"నాకు కనబడుతోంది నా దైవ మొక్కడే. వేరేమీ ఈ మూర్తిలో నాకు గోచరించవు."

"మైనా! నువ్వు సుఖంగా ఉండాలనే నా కోరిక !"

"నాకు తెలుసును ప్రభూ !"

"మైనా ! ఒక్క మాట చెప్తాను వింటావా"

"మీ ఆజ్ఞ ఏదీ కాదనను"

"ఆజ్ఞగా కాదు, మైనా! బలవంతంమీద కాదు. ఇచ్ఛాపూర్వకంగా నా మాటకు ఒప్పుకోలు..."

"ఏమిటో చెప్పండి :"

"నీకు బ్రతుకులో ప్రశాంతపరిస్థితులు సమకూర్చి, నిన్ను కాశ్మీరం తీసుకొనివెళ్తాను."

మైనా చకితురాలైంది. ద్రవీభూతురాలైన ట్లాతని పాదాలమ్రోల కరిగిపోయింది.

శిల్పి ఆప్యాయంగా ఆమెను పొదువుకొని లేవనెత్తాడు.

"స్వామీ! నన్ను విడువవద్దు"

"మైనా!......"

"మీ చరణదాసిని. ఆ సంపత్తిని మించి మరే నగలూ నాణ్యాలూ కోరను. నాకు సర్వస్వం మీరే."

"అది కాదు— మైనా !"

"నేను ఈర్ష్యాళువును కాను. మీరు కోరుకొన్న స్త్రీని తెచ్చుకోండి. ఆమెకుకూడా సేవ చేస్తూ జీవిస్తాను. దూరంనుంచే మీ సంతోషంలో భాగస్థురాలనై సంతోషిస్తాను."

"మైనా! ఆ ఊహతో నిన్ను పొమ్మన్నానని అనుకున్నావా? పిచ్చిదానా!"

"ఎందుకైనా కానియ్యండి. నన్నుమాత్రం వదలవద్దు. ఈ రెండేళ్ళ వియోగమూ జీవాలతో భరించానంటే, ఏనాటికైనా మీరు తిరిగి వస్తారన్న ఆశతోనే. ఇప్పుడు నన్ను దిక్కుమాలినదాన్నిగా చేయవద్దు."

శిల్పి తెముల్చుకొని నిల్చాడు.

"రాజమందిరానికి వెళ్ళవలసిన వేళ అయింది. రాజుకు కోపం రావచ్చును."

"చేతులు జోడించి ప్రార్థిస్తాను, రాజమందిర సహవాసం వదిలెయ్యండి."

"సరే_కాని"

అప్పటికి తప్పించుకొని బైటపడి రాజమందిర ముఖంగా నడిచాడు శిల్పి.

మైనా చింతిస్తూ కూలబడిపోయింది. ప్రకృతి వలయాకృతివహించి, అంతకంతకూ కుంభించుకొంటూ, తన్ను చుట్టివేస్తూన్నట్లు తోచింది. ఆతనికి తను 'పుస్తె కట్టిన భార్య' కాదు. ఆతని యిష్టంవచ్చినట్లే ఆతను చేసుకోవచ్చు నని సమాధానపరచుకో ప్రయత్నించుకుంది. పూర్వస్మృతులు కలకవేశాయి.

తన కాశ్మీరంలో పడవలు నడపే బోయీల పిల్ల. రాజశిల్పి కాశ్మీరం వచ్చినప్పుడు తన పడవలో అతిథిగా ఉన్నాడు. అతని పరిచర్యలలో తను నిమగ్న అయిపోయింది. అతని మనస్సు చూరగొంది. శిల్పి, ఆ బోయీ నడిగాడు, మైనాను తనకు జతగా పంపమని. "సర్కార్ మాకు అన్నం నీళ్లూ, అన్నీ మైనాయే-మైనా లేనిదే మా పడవ కెవళ్లు వస్తారు?" అన్నాడు బోయీ. రెండువేల రూపాయలతో బోయీని సమాధానపరిచాడు శిల్పి. మైనా శిల్పివెంట రాగలిగింది.

శిల్పిగృహంలో, యాజమాన్యమంతా, రాను రాను మైనాచేతికి చిక్కింది. అతని విగ్రహాలకు తడి మన్ను ఆమెచేతుల్లో తయారయితేతప్ప అతని శిల్పం పసిపడేది కాదు. ఆమె రూపభంగిమలలో తప్ప అతని విగ్రహాలకు జీవస్వరూపాలు ఏర్పడేవి కావు. ఆమె ఎదుట లేనిదే, అతని అంగుళులు, ఆ మృత్తికకు చైతన్య మియ్యగలిగేవి కావు. అతని విగ్రహాలలోని అవయవసౌష్ఠవం, కళావైదగ్ధ్యం, జీవస్వరం అన్నిటికీ మాతృక మైనా.

శిల్పి కిది తెలుసును. ఆమె మన్ను తడిపి ఇవ్వకుంటే ఆ విగ్రహానికి అతని కళానైపుణ్యం అంతా కూడా జీవమియ్యగలిగేది కాదు. అతని హృదయంలో మైనాకు విశిష్టస్థానం లేకపోలేదు. కాని ఆ స్థానంలోనే తీరని వ్యసన-స్థాన మిచ్చినంతమాత్రంలోనే ఆత్మ సమాధానం-తన ప్రతిభకు కారణభూతురాలైనమైనా "ఒక దాసి"! ఈ ప్రజ్ఞాగర్వంలో ఒక్కొక్కప్పుడు, ఈ మైనా లేకుంటే, తన కళాప్రాశస్త్యానికి లోటేమిటని అనుకొనేవాడు. కాని మైనా స్పర్శ లేని కృతి నీరసమై నిర్జీవ మైపోయేది.

శిల్పిశిల్పాల్ని పరిపూర్ణంగానే లోకం పరిగణించేది. కాని శిల్పికి ఆ ఆత్మసంతృప్తి చిక్కేది కాదు. తన శిల్పాలలో ఏదో అసంపూర్ణత్వమే గోచరిస్తూ వేధిస్తూండేది.

ఆ హృదయంలోని ఆ అగ్నిజ్వాల పరులకు పరిస్ఫుటం కాదు. దాని స్వభావం అతనికే అగమ్యగోచరం.

రాజశిల్పి 'కీర్తి', శిఖరాల నంటుకొన్నది. మహారాజాధిరాజు లూ శిల్పాల నార్జించుకోటానికి పోటీలుపడేవారు. ఇక సామాన్యప్రజకు అతడు రూపొందిన కళాదేవత; లక్ష్మీపుత్రుడు. అతని ఇంట కుక్కపిల్లకూడా వెండికంచాల విందారగిస్తుం దని ప్రతీతి. ఇంతటి భోగభాగ్యాలమధ్య నున్నా, ఆ హృదయంలో అసంతృప్తిజ్వాల లారవు. ఆ జీవితాన్ని వైరాగ్యం అలముకొంటూంటుంది.

నిస్స్వార్థ, నిర్మలినహృదయంతో మైనా శిల్పిని ప్రేమించింది. ఆ ప్రేమలో, తన సర్వస్వం అతనికి కానుకగా అర్పించింది.

'కుందనమువంటి మేను – స్ఫటికాచ్ఛవినిర్మల మైన హృదయము -శరద్రాత్రుల వెన్నెల వెల్లువలలో, మెత్తని పచ్చికసెజ్జలపై ఆమె వపుఃకోమలసౌభాగ్యాన్ని-అతని కాస్వాదించ నర్పించేది. ఆ నిసర్గసౌందర్యశోభ అతని కన్నుల మూర్తీభవించి నిలచిపోయేది. కాని ఆ నిర్నిమేషత్వాన్ని భంగించుకొంటూనే, నిత్యనూతనమై, నవనవోన్మేషమై, మైనాకళారూపం, క్షణక్షణ మొక్కొక్క నూతనకళను ప్రచురించుకొంటూండేది, అతని రసప్రపంచంలో! ఆమె ఒక్కొక్క చూపుకో ఒక్కొక్క నూతనజగత్తు నిర్మిత మయ్యేది. "ఈమె ఒక దేవత. 'యా తత్రాస్తే యువతివిషయే సృష్టిరాద్యేవ ధాతుః'; దేవశిల్పిశిల్పంలోనిపరిపూర్ణస్వరూపం మైనా," అనుకొనేవాడు శిల్పి.

ఆ పరిపూర్ణత్వాన్ని తన శిల్పంలో ఇముడ్చజూచాడు రాజశిల్పి. అనేకవిధాలలో ఆ రూపాన్ని మట్టిలో మలిచాడు. ఆ పెదవుల చిరునవ్వు-పద్మపత్రాలవంటి ఆ నేత్రాలు, అన్నీ సమకూర్చి, "వనసుందరి"ని నిర్మించాడు.

"వనసుందరి," శిల్పసౌందర్యానికి రాజు విమోహితు డయ్యాడు. శిల్పికృతులతో రాజప్రాసాద విలాసగృహాలు అలంకృత మయ్యాయి. "అభిసారిక", "పరిత్యక్త", "నిరీక్ష" అన్ని విగ్రహాలలోనూ, మైనా సౌందర్యవిలాసాలకు శిల్పి నీరాజనా లిత్తాడు.

ప్రభువు మొగంలో నొసటిముడి సడలింది.

"కారణ మేమిటి శిల్పీ ! ఇక్కడేమైనా లోపం జరుగుతూందా ?"

"ఏ లోపమూ లేదు."

"మరెవరైనా రాజులు ఆహ్వానించారా.?"

"తమను విడిచి మరొకరాజును ఆశ్రయించను ప్రభూ."

"మరి విరమణకు కారణం? "

"కేవలం అసంతృప్తి"

"శిల్పీ, నీ కోరికకు అభ్యంతరం లేదే. నా రాజత్వం కావాలంటే, అదీ సరే ! ఆరామాలు, అగ్రహారాలు, కాంతా కనకాలు, నవరత్న నిధులూ— ఏది కావాలో చెప్పు, శిల్పీ—క్షణంలో నీ వవుతాయి."

"ప్రభూ అవేవీ కోరను !"

"మరి ?"

"స్వాతంత్ర్యమాత్రమే కోరుతాను"

"నీవు నా బందీవి కావే! స్నేహితుడవనే అనుకొంటున్నాను శిల్పీ."

"నా చిత్తవృత్తి కనుగుణంగా కళ నారాధించు కోగల స్వాతంత్ర్యం ప్రభూ"

"శిల్పీ—మనస్థ మొకటి చెప్పేనా ?"

"విన్నవించండి, ప్రభూ"

"రాకుమారి విగ్రహం మాత్రం నాకోసం నిర్మించు. ఆ తర్వాత ని న్నేమీ అడగను."

శిల్పి ఆలోచనలో పడ్డాడు.

"శిల్పీ—ఇది కేవలం నా ఆనందం కోసమే కాదు. దేశక్షేమమూ కొంత ఇమిడిఉంది"

శిల్పి చకితుడై చూశాడు.

"పరరాజు బలిష్ఠుడు—నా దేశంపై చూపు పడుపుతున్నాడు."

"రాకుమారివిగ్రహం—!"

"సంబంధీకమే ! ఆ రాజకుమారుని కంట రాకుమారివిగ్రహం పడితే, ఈ దేశాలకు కయ్యము పోయి వియ్యము కుదురుతుంది."

శిల్పి ఆలోచనలోంచి మెత్తగా పలికాడు

"ప్రభూ ! మనమన్న ఈ సమయం నిలుస్తుందా ! మళ్ళీ శిల్పవృత్తిలో నియోగించరు కదా !"

"కులదేవత సాక్షి !"

"ప్రభువుల చిత్తం"

హర్షపులకాంకితుడై రాజశిల్పిని కౌగిలించు కొన్నాడు రాజు.

శిల్పి ముక్తసరిగా ఈవిషయం మైనాతో చెప్పాడు. రాజోద్యోగవిముక్తి త్వరలో కాగలదని మైనాకూడా సంతోషించింది.

* * *

రాజప్రాసాదంలో తూర్పుదిక్కున శిల్పిచిత్రాగారం వెలిసింది. మందిర నిర్మాణంలో కళాసౌకర్యాలు శిల్పి స్వయంగా చూచుకున్నాడు. వెలుగునీడలు దిశాభేదం లేకుండా అతని అభీష్టం ప్రకారం శిల్పశాలలో మసులుతాయి. మందిరమధ్యంలో ఒక వేదిక. దానిపై ఒక అస్థిపంజరం. అస్థిసంధులను మృత్తికతో నింపాడు శిల్పి. ప్రక్కనే రాకుమారి ఆసీన అయ్యేందుకు మరో వేదిక.

శుభముహూర్తాన పని ప్రారంభించాడు శిల్పి. ఆ ప్రారంభోద్వేగంలో, శిల్పివదనం సంధ్యారుణరాగరంజిత మయింది. అస్థిపంజరాన్ని మృణ్మయ మొనర్చి, కరచరణాదులు తీరుస్తున్నాడు. అస్పష్టమైన దేహస్వరూపం, మృణ్మూర్తి, తయా రవుతూంది.

"చేటీ, రాకుమారిని ప్రవేశం చెయ్య"మని సంజ్ఞ నిచ్చాడు.

మనుజిలుగు పట్టువెల్లా ధరించి, అంగసౌష్ఠవం మరుగుపరచని ఆభరణాసంచయంతో రాకుమారి ప్రవేశించింది.

శిల్పి స్తబ్ధుడయ్యాడు. అతని మాటకై నిరీక్షించింది ఆమె. అతను మాటాడలేదు.

"నేను ఎక్కడ, ఎల్లా, నిలవాలో శిల్పులు విన్నవిస్తారా?" అని రాకుమారి మందహాసం చేసింది.

మౌనముద్రాలంకారుడై చేతితో వేదిక చూపించాడు శిల్పి. ఆమె అందు నిల్చింది.

శిల్పి వెలుగుతెరలను సవరించి, ఆమె ముఖంపై వెలుగునీడలు కళాప్రపూర్ణంగా ప్రసరింపచేశాడు. దగ్గరకు జరిగి, ఆమె నిలవవలసిన భంగిమను చూపాడు. ఆమె అతన్ననుసరించింది.

"మెడవంపు కుదరలేదు."

"ఇంకా ఎల్లాగ శిల్పీ"

దరిజేరి, ఆమె చుబుకాన్ని స్పృశిస్తూ మెడవంపు దిద్దుతున్నాడు. ఆ స్పర్శలో అంగములు పులకరిస్తున్నాయి. కేవలం శిల్పిగా రాకుమారి కర చరణాది దేహ ప్రమాణాలను కొలబద్దతో సేకరించుకొని, మృణ్మూర్తితో సరిపోల్చుకొంటున్నాడు.

రాకుమారి దివ్యసుందరి. అనాఘ్రాత కుసుమ కోమలత్వం చిందుతున్న, నిండిన కపోలాలు, యౌవన మదానికి జంటపతాకలై నిక్కి నిలచిన వక్షోద్వయం. భుజముల సోయగం పాలరాతితో చెక్కి మలచినట్లుంది.

ఆమె మేని మెత్తదనము పట్టురేకుల నపహసిస్తూంది. సర్వాంగసుందరి అయిన ఆ మూర్తి, దేవశిల్పి అపూర్వరచనలా భాసిస్తూంది.

ఆ సౌందర్య శరాఘాతంలో శిల్పిచేయి స్తంభించిపోయింది. శిల్పిదృష్టి చెదరునట్లుంది. మనస్సును బిగబట్టాడు. ఆ దివ్యమూర్తిలోని జీవకళనంతా తన మృణ్మూర్తిలో ధారవోయ యత్నించాడు.

అహర్నిశలు ఆ శిల్పంపై కృషిచేస్తున్నాడు శిల్పి. మృణ్మూర్తి, మూర్తిదాలుస్తూ వస్తూంది. రాకుమారికే ఆ మృణ్మూర్తి ఈర్ష్యాస్థానం కాసాగింది. పూర్ణిమకు పూర్ణిమ గడిచింది.

ఆ పూర్ణిమ వెన్నెలలో శిల్పి తన కృతి ముగించాడు. ఆ కౌముదీప్రసారంలో తన సృష్టిని పరీక్షించుకొన్నాడు. శిల్పంలో కళా కౌశలం తాండవమాడుతూంది. శిల్పంలో లవలేశమైనా దోష మేదీ ఎవరూ చూపించేటట్టు లేదు.

ఆ విగ్రహాన్ని చూచి చూచి, శిల్పి విసుగు చెందాడు. ఆ విగ్రహానికి ముసుగు కప్పాడు.

"ప్రహరీ" అని కేకవైచాడు.

పరిచారకుడు పరుగెత్తుకొంటూ వచ్చి, చేతులు జోడించాడు.

"ఇదిగో మందిరం తాళంచెవులు. రాజుగారి కియ్యి. నా పని పూర్తి అయిందని చెప్పు."

"మీరు..."అనబోతున్నాడు సేవకుడు.

"నేను ఇంటికి వెళ్తున్నా" అని ఆగకుండా ఇంటికి వచ్చాడు శిల్పి.

మైనా ఆ రాత్రంతా అతనికోసం ఎదురు తెన్నులు చూస్తూ గడపమీదే తలవాల్చి, నిద్రకు తునికింది. జాలితో, తన పైపచ్చడం తీసి, ఆమెకు చలి వేయకుండా కప్పాడు.

ప్రొద్దు పొడిచింది; ప్రొద్దు గడిచింది. కునుకుతూన్న మైనా ఉలికిపడి లేచింది. పై నున్న పచ్చడం చూసి,చకితురాలై,శిల్పిని వెదుకుతూ లోనికి పోయింది. శిల్పి అప్పుడే తన శిల్పమందిరంలో ఉన్నాడు. ఒక ఆరున్నర అడుగుల అస్థిపంజరానికి మన్ను మెత్తుతున్నాడు.

మైనా అడుగులో అడుగు వేసుకొంటూ మెల్లిగా దగ్గరకు చేరింది.

"ఎప్పుడు వచ్చారు?"

"రెండుగంట లైందేమో!"

"నన్ను నిద్రలేపరాదా?"

"నా శబరికి నిద్రాభంగం చెయ్యనా ?"

"రాజమందిరంలో పని పూర్తి అయిందా?"

"ఈ ఉషఃకాలానికే ముగించాను."

"శిల్పం ఎల్లా ఉంది?"

"మహారాజు మెచ్చుకోవచ్చును."

"మీరో ?"

"నామాట అడగవద్దు."

"రాకుమారి రూపసుందరిట కదా?"

"అవును, దివ్యసుందరి!"

"మీ కళాప్రతిభకు—ఆ రూపసంపద తోడైతే, పాలకు చక్కెర కలిపినట్లేకదా !"

"అవవచ్చును. కాని పాలు విరిగాయి."

ప్రభువు మొగంలో నొసటిముడి సడలింది.

"కారణ మేమిటి శిల్పీ! ఇక్కడ ఏమైనా లోపం జరుగుతూందా?"

"ఏ లోపమూ లేదు."

"మరెవరైనా రాజులు ఆహ్వానించారా.?"

"తమను విడిచి మరొకరాజును ఆశ్రయించను ప్రభూ."

"మరి విరమణకు కారణం?"

"కేవలం అసంతృప్తి"

"శిల్పీ, నీ కోరికకు అభ్యంతరం లేదే. నా రాజత్వం కావాలంటే, ఈయననే! ఆరామాలు, అగ్రహారాలు, కొంతా కనకాలు, నవరత్న నిధులూ— ఏది కావాలో చెప్పు, శిల్పీ—క్షణంలో నీ వవుతాయి."

"ప్రభూ అవేవీ కోరను!"

"మరి?"

"స్వాతంత్ర్యమాత్రమే కోరుతాను"

"నీవు నా బందీవి కావే! స్నేహితుడవనే అనుకొంటున్నాను శిల్పీ."

"నా చిత్తవృత్తి కనుగుణంగా కళ నారాధించుకోగల స్వాతంత్ర్యం ప్రభూ"

"శిల్పీ—మధ్యస్థ మొకటి చెప్పేనా?"

"విన్నవించండి, ప్రభూ"

"రాకుమారి విగ్రహం మాత్రం నాకోసం నిర్మించు. ఆ తర్వాత ని న్నేమీ అడగను."

శిల్పి ఆలోచనలో పడ్డాడు.

"శిల్పీ—ఇది కేవలం నా ఆనందం కోసమే కాదు. దేశక్షేమమూ కొంత ఇమిడిఉంది"

శిల్పి చకితుడై చూశాడు.

"పరరాజు బలిష్ఠుడు—నా దేశంపై చూపు పరుపుతున్నాడు."

"రాకుమారివిగ్రహం—!"

"సంబంధీకమే! ఆ రాజకుమారుని కంట రాకుమారివిగ్రహం పడితే, ఈ దేశాలకు కయ్యము పోయి వియ్యము కుదురుతుంది."

శిల్పి ఆలోచనలోంచి మాటొత్తుగా పలికాడు

"ప్రభూ! మనమధ్య ఈ సమయం నిలుస్తుందా! మళ్ళీ శిల్పవృత్తిలో నియోగించరు కదా?"

"కులదేవత సాక్షి!"

"ప్రభువుల చిత్తం"

హర్షపులకాంకితుడై రాజశిల్పిని కౌగిలించుకొన్నాడు రాజు.

శిల్పి ముక్తసరిగా ఈవిషయం మైనాతో చెప్పాడు. రాజోద్యోగవిముక్తి త్వరలో కాగలదని మైనాకూడా సంతోషించింది.

* * *

రాజప్రాసాదంలో తూర్పుదిక్కున శిల్పిచిత్రాగారం వెలిసింది. మందిర నిర్మాణంలో కళాసౌకర్యాలు శిల్పి స్వయంగా చూచుకున్నాడు. వెలుగునీడలు దిశాభేదం లేకుండా అతని అభీష్టం ప్రకారం శిల్పశాలలో మసులుతాయి. మందిరమధ్యంలో ఒక వేదిక. దానిపై ఒక అస్థిపంజరం. అస్థిసంధులను మృత్తికతో నింపాడు శిల్పి. ప్రక్కనే రాకుమారి ఆసీన అయ్యేందుకు మరో వేదిక.

శుభముహూర్తాన పని ప్రారంభించాడు శిల్పి. ఆ ప్రారంభోద్వేగంలో, శిల్పివదనం సంధ్యారుణరాగరంజిత మయింది. అస్థిపంజరాన్ని మృణ్మయ మొనర్చి, కరచరణాదులు తీరుస్తున్నాడు. అస్పష్టమైన దేహస్వరూపం, మృణ్మూర్తి, తయారవుతూంది.

"చేటీ, రాకుమారిని ప్రవేశం చెయ్య"మని సంజ్ఞ నిచ్చాడు.

నునుజిలుగు పట్టుపెల్లా ధరించి, అంగసౌష్ఠవం మరుగుపరచని ఆభరణసంచయంతో రాకుమారి ప్రవేశించింది.

శిల్పి స్తబ్ధు డయ్యాడు. అతని మాటకై నిరీక్షించింది ఆమె. అతను మాటాడలేదు.

"నేను ఎక్కడ, ఎల్లా, నిలవాలో శిల్పులు విన్నవిస్తారా?" అని రాకుమారి మందహాసం చేసింది.

"స్వామీ అదేమి మాట! మీ ప్రతిభ ఎన్నటికీ మాసిపోదు."

"మాపు నా ప్రతిభకే, ఈమాత్రపు సౌందర్యానికి కాదు."

"మీరే అన్నారే ఆమె దివ్యసుందరి, అని."

"సామాన్యనేత్రాలకు—దివ్యచక్షువులకో?"

"సామాన్యమైనదా?"

"అవును."

"స్వామీ! మీ ఊహలో సౌందర్యం అంటే ఎలా ఉండాలి?"

"ఇదిగో ఇల్లా." అంటూ శిల్పి మన్ను మెత్తుతూన్న అస్థిపంజరాన్ని చూపాడు. మైనా క్షణకాలం విభ్రమంతో చూచి, కిలకిల నవ్వింది.

"ఇదా!"

"ఇదే! మానవ సౌందర్యంలో, ఇంతకే మించి ఏముంది?"

శిల్పిముఖంలోని కాఠిన్యాన్ని గమనించి, మైనా మెల్లగా అక్కడినుంచి జారింది.

* * *

శిల్పికృషిలో నాలుగు గంటలు గడిచిపోయాయి. విగ్రహంపైన మెత్తిన మన్నును ఛురికతో పరిదిద్దుతున్నాడు శిల్పి. మైనా కన్పించింది.

"ఏం పని?"

"రాజమందిరంనుంచి ఉద్యోగులు వచ్చారు."

"ఇప్పుడు కాదని చెప్పు."

"అగత్య మంటున్నారు."

విసుగుతో, "సరే.ఇక్కడకే రమ్మన" మని, శిల్పి విగ్రహంపై ముసుగు వేశాడు.

రత్నరాసులు పళ్లేరాలలో నింపి పైన వసనాలు కప్పి, రాజభటులు మోసుకొనివచ్చారు. ఆ వసనాలు తొలగించగానే రత్నరాసులు తళతళలాడసాగాయి.

"ప్రభువులు పంపారు. స్వీకరించండి." అని ఉద్యోగులు విన్నవించుకొన్నారు.

"నాకు అక్కరలేదు. తీసికొనిపొండి."

"నిరాకరిస్తే ప్రభువులు కోపగిస్తారు"

"ఎవరి కోపంతో నాకేమి పని?"

మైనా సద్దుమాచింది.

"వారు ప్రీతితో పంపింది నిరాకరించేదా?"

శిల్పి మైనావంక తీక్షంగా చూశాడు. కళ్లవంక తిరిగి:—

"సరే అక్కడ ఉంచివెళ్లండి"

మైనా అల్లాగే నల్చునివుంది.

శిల్పి పళ్లేరంలోనుంచి ఒక వజ్రాన్ని తీశాడు. రెండో చేతిలో బొమ్మగా చేస్తూన్న మట్టిముద్ద వుంది.

"మైనా! ఇదేమిటో తెలుసా?"

నీరసంగా జవాబిచ్చింది:

"బంకమన్ను!"

"ఇదీ...?"

"వజ్రపు తునక"

"జనులు దీనికి (వజ్రపుచెయ్యి చూపుతూ) వెల యిస్తారు. నేను దీనికి వెల యిస్తాను."

మైనా మౌనంగా నిలిచింది.

"కారణం ఎరుగుదువా! వజ్రానికి వజ్రమయినందుకే వెల. ఈ మన్నో, కళావిదుని ప్రతిభకు ప్రతీకం కాగలదని వెల. ఒకదానిలో రాతికే వెల; ఇంకొకదానిలో కళకు వెల."

"ప్రభూ! నేను ఈ వెల ఆశించలేదు. రాజులకు వృథా ఆగ్రహం తెప్పించట మెందుకని స్వీకరించుమన్నాను."

"వీటి నిక్కడనుండి తరలించు"

రత్నరాసుల నక్కడనుంచి తీసికొనిపోయింది మైనా. శిల్పి తలవాకిలి బిగించి శిల్పనిర్మాణంలో నిమగ్నుడయాడు.

* * *

శిల్పి "ఆత్మీయమైన" ఆ శిల్ప నిర్మాణంలో పెలలతరబడి లీనుడైపోయాడు. అన్నపానాదులు మాత్రం మైనానిర్బంధంమీద అమనస్కుడై ముగించేసుకొంటూంటేవాడు. తక్కినవుడు తలుపులు బిగించు

కొని ఒక్కడు లోన కూర్చొనేవాడు. మైనాకు కూడా లోనికి ప్రవేశం లేదు. ఆ వాకిలిగడప నానుకొని నిరీక్షిస్తూ, ఆ గడపమీదే తల పెట్టుకొని నిద్రను తూగుతూండేది మైనా. అతను లోపల ఉన్నాడు. ఆ పదధ్వని అతనిదే—ఆ ధ్వనిని మించిన సంగీతమే లేదు ఆమెహృదయానికి. ఆమె కదే తృప్తి.

ఒక రాత్రి మూడోఝామున శిల్పి, మందిరపు తలుపు తెరుచుకొని బైటకు వచ్చాడు. గుమ్మంలో మేను సగం వాల్చి మైనా నిద్రపోతూంది.

"మైనా—మైనా!" ఆమెను నిద్దురలేపాడు.

ఆమెనిద్ర హఠాద్భంగం కాగా కంపితురాలై లేచి నిల్చుంది.

"ఇటు రా—" సుఖాసీను డయ్యాడు. ఆమె దగ్గిరలో కూర్చునుంది.

"మైనా..."

"స్వామీ, బొమ్మ ముగించారా?"

"ముగిసినట్లే!"

"నేను చూడవచ్చునా?"

"ఇప్పుడు కాదు—రేపు—రేపు, నీకూ, లోకానికీకూడా నా కళాకృతిని అంకితం చేస్తాను."

మాటలు ఆత్రంగా వస్తున్నాయి. మైనాచేయి అతని నుదురుమీద వ్రాలి ఒంటిమీదకు పాకింది.

"స్వామీ—జ్వరం వచ్చిందా?"

"ఏమో! వస్తే రానీ. ఇంక భయం లేదు."

మైనా జాగ్రత్తగా ఉపచరిస్తూ అతన్ని నిద్రపుచ్చింది. అన్నాళ్లకు ఆనాడే నిద్రపోగలిగాడు.

అతనికి మెళుకువ వచ్చేటప్పటికి సూర్యకిరణాలు కన్నులలో పొడుస్తున్నాయి. అలసాత్వానికి చికాకు పడుతూ మేలుకొన్నాడు.

"మైనా!"

"స్వామీ!"

"మందిరానికి వెళ్తున్నాను. ఇది నా పరీక్షదినం. నా శిల్పం విజయవంతం కావాలని ఆశీర్వదించు."

"ఆశీర్వదించటానికి నే నెవరను ప్రభూ!"

"నా ప్రేమలక్ష్మివి!"

మైనాముఖంలో అమృతలాస్యం చిందులాడింది.

"మీ కృతి అమర మవుతుంది."

తృప్తహృదయుడై శిల్పి మందిరం చేరాడు. హృదయంలో ఏదో ఆవేదన.

ఇది మొదటి శిల్పం కాదు. నూరారుకృతుల చేయి తిరిగిన దిట్ట—మహాశిల్పి. విశ్వవిఖ్యాతుడు—కాని ఆ ఆవేదనలో పసికందుకన్న బేలయై వణికిపోతున్నాడు.

గతరాత్రికే విగ్రహశిల్పమంతా పూర్తయింది. కనుపాపల దృష్టిపాటవ మొక్కటి దిద్దేపనిమాత్రమే నాటికి మిగుల్చుకొన్నాడు.

మృత్తికను దిద్దే ఛురికను చేత బుచ్చుకొని విగ్రహంపై తెర తెమల్చాడు.

ఆ విగ్రహాన్ని చూసి శిల్పి స్తంభించిపోయాడు. "ఈ విగ్రహం చెక్కింది, నేనేనా!" అని విస్తుపోతున్నాడు. ప్రజ్ఞాగర్వంతో చేయి కంపిస్తూంది. ఒడలంతా ముచ్చెమటలు పోసినయి.

స్థైర్యం ఏర్పరచుకొని, కళాదేవికి ఆత్మలో నమస్కారాంజలు లిచ్చి, కన్ను దిద్దడం ప్రారంభించాడు. కాలం గడుస్తున్నట్లే లేదు. పని పూర్తిచేసికొని నిట్టూర్చి, మరల వెనుకకు వచ్చి విగ్రహాన్ని పరీక్షిస్తున్నాడు.

ఒక నూతనదృశ్యం. అధీరుడై పోయాడు దేహోద్యంతం కంపించాడు. మహాయాతనాభరితమైనట్లు మొగం నల్లబడి కమిలిపోసాగింది. విగ్రహానికి సమీపస్థుడై, దూరస్థుడై, చుట్టూ తిరుగుతూ విగ్రహాన్ని పరిశీలిస్తున్నాడు. మనస్సు పగిలిపోయింది. పైశాచిక ఆవేశం ఆవరించింది. ఉద్విగ్నుడై ఛురికతో విగ్రహాన్ని పొడుస్తూ చీరుతూ చిందరవందర చేయసాగాడు. విగ్రహం చితికి చిద్రుపలై నేల బడ్డది. అతనిలో ఆవేశం కంతా న్యాకరించింది.

"మైనా...!" అని గీపెట్టాడు.



విమర్శనము

కవి విపంచి

డా. అన్నమరాజు శర్మ

నవ భారత్ పబ్లిషర్స్ లిమిటెడ్, కర్నూలు.

వెల : రూపాయి.

కవి విపంచి బాలచంద్రుడు, శకుంతల మొదలైన పది ఖండకావ్యాల సంపుటి. వీటిలో గంగిగోవు, సమాశ్వాసము తప్ప మిగిలిన వన్నీ కథాకావ్యాలు.

ఈ కథా కావ్యాలలో 'కృష్ణకుమారి' 'సుజాత' కొంత బాగున్నాయి. పాలపడతిని వర్ణించే ఈ పద్యం లోని చిత్రణం గమనింపదగినది.

"పయోద శాకునం గురులు
ఫాలతలమ్ము నటింప మాటికిం
బయోద జాల గ్రొందలిరు
ప్రాయపు నిగ్గుల లేమ యొర్తు దా
నెయ్యెడ కేలు కాల్నడల
సేసుచు నుండె సువర్ణ పాత్రికం
దియ్యని పాయసమ్ము కన
దేవత కర్పణ సేయు కోరికన్"

ఈ కవికి ప్రకృతిపరిశీలనలోను, వర్ణనలోను ఒక ప్రత్యేకత ఉన్నది. తుంగభద్రాతటం అనే ఖండ కావ్యంలో ఈ క్రింది పద్యాలు దీనికి తార్కాణాలు.

"హోరు మంచు సమీరముల్ దా విడువ,
తుంపురులు రాల దొడగె, ఖద్యోతగణము
భువికి జారిన తారల పోలుపు దోప
ఢక్కు ఢక్కున నందంద తనరు చుండె
సూతి వాంఛః కణంబులు నూలు కొనెను
తుంగభంగావలులో న్నిద్ర తుంగభద్ర
కనులమం గోచె దన్నిశా కాలమందు
దరుల నొఱయుచు గర్భిణీ తరుణి కరణి"

ఈ ఘట్టంలోని ఈ క్రింది పద్యపాదలు కూడా పరిశీలింపదగినవి.

"అంబరశ్యామ కుటిలానిలంబ కేశ
పాశముల వాలి విడిచిన భావ మెలుక
నీల కాదంబినుల్ దపల్ నెఱయు చంచ
లాలతల్ మెఱుఁగు దెలిల నాట్యమాడ
ఎడద కలగుండువడ కేకల్ గడెలు వడగ
ఫెళ ఫెళార్భటి పటుతరాభీల చటుల
వజ్ర నిర్ఘోషములు నిండె, ప్రకృతి ముఖము,
శోకము వెలార్చె యామినీ క్షుభితకళల"

కథా కావ్యాలలో మనం సహజంగా కథాకథన శిల్పం కోసము పాత్రోన్మీలనంకోసము పరిశీలిస్తాము. ఈకవి కథాకావ్యాలలో ఈరెండు అంత ప్రస్ఫుటంగా కనబడవు. ఉదాహరణకు కృష్ణకుమారి కథ తీసుకుందాము. కృష్ణకుమారి ఉదయ పురాధిపతి భీమ సింగు కుమార్తె. ఈమె చాలా సౌందర్యవతి. ఈమె కోసం సింధియాధిపతి, జయపురాధీశ్వరుడు జగత్సింహుడు ఉదయపురిపై దండెత్తుతారు. ఈ సమయంలో భీమసింగు తన మంత్రిమాటలు విని ఆమెకు విషం ఇప్పించి చంపించివేస్తాడు. ఈ దారుణవృత్తాంతమే దీని కథావస్తువు. ఇది గొప్ప మానసికసంఘర్షగలఇతివృత్తము. కవి ఈ మానసిక సంఘర్షణ తప్పించివేసి కేవలం వర్ణనాపరంగా ఈ కథ చెప్పడంలో కథ అంతా తేల్చివేసినట్లయింది. మిగిలిన కథలలో కూడా ఈ లోపమే ఎక్కువగా కనిపిస్తుంది.

కవి విపంచికి రళ్లపల్లి అనంత కృష్ణ శర్మగారు పీఠిక వ్రాశారు. ఈ పీఠికలో 'వీరు వర్చస్వియైన భావ, నిరర్గళమైన ధార తీవ్రములైన భావములు—ఇవి వీరి కవిత్వములో నాకు ముఖ్యముగా గనిపించినవి. అన్నారు. భావవిషయంలోను, ధారవిషయంలోను వీరు వ్రాసినది అక్షరాలా నిజం. కాని భావాలలో మాత్రం తీవ్రత కనబడదు.

ఈ పుస్తకముద్రణం చక్కగా ఉన్నది. అధునిక కవితాపరిణామాన్వేషకుల కిది అవశ్య పఠనీయమైన కావ్యం.

శ్రీ శర్మగారు తమ పీఠిక చివరిభాగంలో ఇలాగ వ్రాస్తున్నారు. "కళాదృష్టితో పరీక్షించితిమేని, ఈ కవిగారు చిత్తప్రశాంతిని, విశ్వలీలాసౌందర్యానుభవమును, ఇంకను ఎక్కువగా సాధించుకొనగలరనియు, దాని ఫలముగా వీరి రచనలు మున్ముందు ఇంకను, ఇంత తేజస్సు చక్కదనము గలిగి తెలుగు భావుకుల నాకర్షింపగలవనియు నా నమ్మిక; నా యాశంస".

ఈ విషయంలో శ్రీ శర్మగారితో ఏకీభవిస్తున్నాము. అన్నమరాజశర్మగారు కవివిపంచిలో చూపించిన శక్తి అభినందనీయమైనది. క్రమంగా వీరి కవితావిపంచి ఉన్నతస్థాయిని అందుకోగలదని ఆశిస్తున్నాము.

"శాస్త్రి"

LILIES IN THE LAKE

Selected Poems of

Sreepada Krishnamurty Sastry

Translated by R. M. Challa

Price 1—4—0

R. M. Challa, Bhimalapuram,

W. Godavari Dt.

ఇందులో మహామహోపాధ్యాయ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి గారి పద్యాలకు ఆంగ్ల ఛ్ఛందోనువాదాలున్నాయి. ఆర్. ఎమ్. చల్లా శ్రీ శాస్త్రిగారి గ్రంథాలలోనికొన్ని ఘట్టాలు అనువదించి ఆంగ్ల కవితాపాఠకులకు శ్రీ శాస్త్రిగారి కవితతో పరిచయం కలిగించారు. ఒక పక్కన శ్రీ శాస్త్రిగారి పద్యాలున్నాయి. రెండవ ప్రక్కన చల్లావారి అనువాదం వేశారు. ఆంగ్లపద్యాల అడుగున క్లిష్టమైన కొన్ని విషయాలు వివరించే కొన్ని ఆంగ్లవివరణలు కూడా చేర్చారు.

పుస్తకముద్రణాదికాలు చాలా చక్కగా ఉన్నాయి. శ్రీ చల్లా ప్రసిద్ధకవులైన కృష్ణమూర్తిశాస్త్రిగారి కవితను ఆంగ్లపాఠకులకు రుచి చూపించడానికి చేసిన ప్రయత్నం ప్రశంసనీయమైనది. ఇలాగే అనేకులయిన అధునాతనాంధ్రరచయితల కావ్య కథా నవలాది రచనలు ఆంగ్లంలోకి అనువదించడం ప్రస్తుతం ముఖ్యంగా చెయ్యవలసిన పని. శ్రీ చల్లా ఇంకా ఎక్కువగా శ్రీ శాస్త్రిగారి రచనలు ఇతరాంధ్ర రచయితల రచనలు విరివిగా ఆంగ్ల పాఠకులకు అందించగలరని ఆశిస్తున్నాము.

అల్లాగే ఆంగ్లాది పాశ్చాత్య భాషారచనలు కూడా బాగా తెలుగులోకి రావాలి. ఈ అనువాదాలు చేసేటప్పుడు ఆ యా కవుల ప్రధాన కృతులు ఆంగ్లంలోకి పరివర్తన చేయాలి. లేకపోతే రచయితలకు న్యాయం జరగదు.

శ్రీ చల్లా ఈ గ్రంథానికి వ్రాసిన పీఠికలో ఇల్లాగ అంటున్నారు.

"The few poems included in this book are not really Mr. Sastry's best, or, at least not all his best. only they are his best translatable poems."

ఇల్లాగ అనువాదానికి వీలైన పద్యాలే వీరి శాస్త్రిగారి ఉత్తమ రచనలు విడిచివెయ్యడంవల్ల అనువాదపాఠకులకు శాస్త్రిగారి ఉత్తమరచనలు చదివే అవకాశం కలగలేదు. మూల రచనలలో శ్లేషాదులు విశేషంగా ఉండడంవల్ల ఇది వీలుపడలేదని అనువాదకులు పీఠికలో అంటున్నారు. శాస్త్రిగారి ఉత్తమ కృతులలో శ్లేషాదుల క్లిష్టత లేని రసవద్ఘట్టాలు చాలా ఉన్నాయి. శ్రీ చల్లా ఆ యా ఘట్టాలు ఆంగ్ల పద్యాలలోకి అనువదిస్తే ఇంకా బాగుండేది.

వీరు చేసిన అనువాదాలలో కూడా కొన్ని దోసగులు దొర్లాయి. ఈ క్రింది పద్యము లోని పూర్వ భాగానువాదం దీనికి తార్కాణము.

సత్సాంగత్యము

"పాసరక్ రాజనముల్ పయస్సులను సె
ప్పుం జెంచు నయ్యేళులం
దనిశక్రీడలు సల్పు స్త్రీలకు నొడ
ళ్లందౌ సుగంధంబు పీ
ల్చి నదీ తోయములందుగల్వలను వాఁ
గెం గాన సౌగంధికా
ఖ్యను జెంపొందెను గల్వ లట్టులప స
త్సాంగత్య మెవ్వారికిన్."

ఈ పద్య పూర్వార్థానికి ఈ క్రిందిది ఆంగ్లానువాదము :

" The lily living in the lakes, Where in lovely ladies bathe, takes in the sweetness that comes from their sweet bodies and attains the fair name "Sougandhika"

ఇందులో మూలపద్యంలో 'ఏకులక్' అని ఉన్నది. దీనికి అనువాదంలో 'సరస్సు' లని వ్రాశారు. బహుశః 'The lily living in the lakes' అన్నప్పుడు వచ్చేలకార యమకం కోసం అనువాదకులు ఇలాగ మార్చి ఉంటారని అనుకుందాము. కాని "పాసరక్, రాజనముల్ పయస్సులను సెప్పుం జెంచు" అనే విశేషణానికి అసలు అనువాదమే లేదు.

ఇలాగే 'కుకవి - సుకవి' శీర్షిక క్రింద ఉన్న -
'గురువు లఘువులు కొన్ని గూర్చి
కవి ననుచు విఱ్ఱవీగుచు గర్వపడుచు,
గల్ల బొల్లి కవిత్వము లల్ల నేర్చు
కుకవి సుకవియై ఖ్యాతి గొనగలండె?'

అన్న పద్యంలోని తృతీయపాదానువాదం కూడా తిన్నగా లేదు.

'కల్లబొల్లి కవిత్వము లల్ల నేర్చు' అనే పాదానికి అనువాదంలో 'Writing mock . heroic poems అని ఉన్నది. కల్లబొల్లికవిత్వాలంటే 'mock heroic Poems అనడం సరి కాదు.

అనువాదకులు పీఠికలో శ్రీ శాస్త్రిగారిని గురించి వ్రాస్తూ 'Indian poesy mainly manifests itself in the Lyrical and the Mystical. Mr. Sastry's work mostly abounds in the former.' అన్నారు. దీనిలో మొదటి వాక్యము, రెండో వాక్యము కూడా యథార్థానికి విరుద్ధంగా ఉన్నాయి. శాస్త్రిగారి కవితలో భావప్రధానమైన (Lyrical) కవిత చాలా తక్కువ. శాస్త్రిగారి తరువాత బయలుదేరిన ఆధునాతనయుగంలో కవులలోనే ఈ భావప్రధానమైన కవిత ఎక్కువగా కనిపిస్తున్నది. అనువాదకులు ఈ విషయాలు గమనించక పోవడంవల్ల శ్రీ శాస్త్రిగారిని గురించి ఆంగ్లపాఠకులకు సరియైన అభిప్రాయం కలగడం కష్టము.

అనువాదకులు శాస్త్రిగారి రచనలలో భావప్రాధాన్యం గల ఘట్టాలనే ఎక్కువగా సేకరించి, వాటిని అనువదించారు. ఇంతకంటె వివిధశక్తులను ప్రస్ఫురింపజేసే వేర్వేరు రచనలనేకం సంతరించి అనువదించి ఉంటే ఈ పుస్తకం ఇంకా బాగుండేది.

అనువాదకులు ఇలాంటి వైవిధ్యంకల శాస్త్రిగారి రచనాసంపుటి మరిఒకటి అనువదించి ప్రకటింపగలరని ఆశిస్తున్నాము.

"శాస్త్రి"

అనిసెట్టి కథలు

అనిసెట్టి సుబ్బారావు,
సర్వోదయ ప్రచురణలు : నరసరావుపేట.
వెల : ఒక రూపాయి.

ఇది, లోకం కండ్లు, పునర్జన్మ, మనిషిఖరీదు మొదలయిన 8 కథలున్న కథాసంపుటి.

సామాన్యంగా మన కథలలో మధ్యతరగతి ప్రజల జీవితాలు, అంతకంటె ఎక్కువ తరగతిప్రజల జీవితాలు కనిపిస్తాయి. ఈ తరగతులకంటె తక్కువ తరగతిప్రజల జీవితాలు చిత్రించే కథలు మనకు చాలా తక్కువ. అనిసెట్టి సుబ్బారావుగారు తమ కథలలో

విస్తారంగా కార్మికుల జీవితాలు, ఇంచుమించుగా ఆ అంతస్తులోనే జీవించే వ్యక్తుల జీవితాలు తమ కథావస్తువులుగా తీసుకున్నారు.

ఈయన మంచి కథకులు. ఈ వ్యక్తుల జీవితాలు సానుభూతితోనే చిత్రించగలిగారు. అయితే కొన్ని కొన్ని చోట్ల ఆ యా వ్యక్తులు మాట్లాడిన మాటలు సహజంగా లేవు. 'సహగమనం' అనే కథలో అత్తరు సాహేబు కూతురు "మాలా తాతకి మనమనీ ప్రేమమూర్తి" అని అంటుంది. ఇక్కడీ ప్రేమమూర్తి! అని ఈ బాలిక అనడం సహజంగా లేదు.

ఇలాంటి చిన్న చిన్న దోషములు విడిచిపెడితే ఈ కథకులు తమ లక్ష్యం సాధించుకోగలిగారనే చెప్పాలి.

ఈ రచయితకు కొద్దిమాటలలో పరిసరాల వాతావరణం సృజించే శక్తి ఉన్నది. ఈ క్రింది పరిసర వర్ణన దీనికి తార్కాణంగా తీసుకోవచ్చును. ఇది 'సహగమనం' అనే కథ ప్రారంభం. "ఆరోగ్యమైన ప్రాణులలో పక్షపాతమై శాపమై తిరుగుతున్నది కరువు. వాతావరణం భారమై, భీకరమై స్టీమురుగొలుసులవలె బంధిస్తున్నది.

ఎర్రగా - లేతగా - భయంకరంగా పైకివచ్చే ఉదయము; నిలబెట్టి పీడించే మధ్యాహ్నము; ఎక్కడా చెయ్యి చాచడానికి వీలు ఇవ్వక నిద్రమైకం కమ్మించి దిగిపోయే సాయంత్రము. రాత్రి నిద్రపోయేందుకు; పగలు కూడబెట్టుకునేందుకు. పగలు దారి తప్పింది. రాత్రి మేలుకొని వ్యథపడుతుంది. చీమలు నయం, ఎప్పటివలె సాయంత్రం చీకటి తారుధారగా పోస్తున్నది. వీధులలో ప్రజలు మసిలీ మసలని నీడలవలె గూళ్లు చేరుతున్నారు.'

ఆ యా కథలలో ఇంకా ఇలాంటి ఉదాహరణలనేకం చూపవచ్చును. అయితే ఈ రచయిత వాడే భాషలో అక్కడక్కడ జాతీయత కుంటుపడుతున్నది. రచయిత ఈ విషయంలో ఇంకా జాగ్రత్తపడడం మంచిది.

పరిసరచిత్రణంలో లాగే వ్యక్తిచిత్రణంలో కూడా ఈ రచయితలో ఒక విశిష్టత కనిపిస్తున్నది.

ఈ రచయిత వ్రాసిన కథలలో మనిషి ఖరీదు, సహగమనం, జనావాలో భర్త, భార్య బాగున్నాయి. ఈ సంపుటిలోనివి చాలావరకు చిత్రణాలే. కానీ ఇవీ బాగున్నాయి.

ఈ కథకునిలో ఉత్తమకథకుల కుండవలసిన గుణాలు కనిపిస్తున్నాయి. క్రమంగా ఈయన మంచి కథకుడు కాగలడని ఆశిస్తున్నాము. ఈయన పుస్తకం కథాభిమానులందరు తప్పక చదవవలసిన సంపుటి.

"శాస్త్రి"

Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press,
No. 7, Thambu Chetty Street, Madras. Editor: S. Sambhu Prasad.